www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 11-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 236 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 1.10 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రేవతి ఉ. 11.48 తదుపరి అశ్విని; వర్జ్యం: తె. 6.11 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.30; అమృతఘడియలు: ఉ. 9.34-11.03, తె. 3.14-4.43; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అయ్యో.. దేవుడా!



చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్

40 రోజులు చర్చిలోనే ఉండి ఉపవాస ప్రార్థనలు

అక్కడే ప్రాణాలు వదిలిన చిన్నారి

కలువాయి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్! తల్లిదండ్రులు నిరక్షరాస్యులు! దానికి తోడు పేదరికం! శస్త్రచికిత్స చేయించేందుకు స్తోమత సరిపోలేదు. పైగా... ఆపరేషన్ చేస్తే ఏమవుతుందో అని భయపడ్డారు! చివరికి దేవుడిని నమ్ముకున్నారు. 40 రోజులు చర్చిలోనే ఉండి ప్రార్థనలు చేశారు. ఆఖరికి... చర్చిలోనే ఆ చిన్నారి కన్ను మూసింది! 'ట్రాన్స్' సినిమాను గుర్తు చేసే

మిగతా 14వ పేజీలో...

జగన్ నిర్వాకం

అమరావతిపై 45% అదనపు భారం

ఐదేళ్లు ఆపేయడంతో పెరిగిన ధరలు

అయినా.. అడుగు ముందుకే వేస్తాం

మూడేళ్లలో పనులు పూర్తి చేస్తాం

మంత్రి పి.నారాయణ స్పష్టీకరణ

ఇప్పటికి రూ.20 వేల కోట్లకుపైగా పనులకు ప్రభుత్వ ఆమోదం

రూ.11,467 కోట్ల పనులపై జీవోలు

సీఆర్డీయే భేటీలో మరో రూ.8,821 కోట్ల పనులకు ఓకే



సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, సీఎస్, ఉన్నతాధికారులు

అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ నిర్వాకంతో 'అమరావతి'పై పెను భారం పడుతోంది. రాజధాని నిర్మాణ వ్యయం ఏకంగా 45 శాతం పెరిగినట్లు అంచనా! నాడు... శరవేగంగా, యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న రాజధాని పనులను జగన్ ఒక్కసారిగా ఆపివేశారు. తర్వాత మూడు ముక్కలాటతో అమరావతిని అటకెక్కించారు. ఇప్పుడు అవే పనులను పూర్తి చేయడానికి భారీగా అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే 42వ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "రాజధాని కోసం రైతులు కేవలం 58 రోజుల్లోనే స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారు. కానీ, జగన్ మూడు ముక్కలాటతో అమరావతిని నాశనం చేశారు. ఆయన నిర్వాకంతో నిర్మాణ వ్యయం భారీగా

మిగతా 12వ పేజీలో...

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

జగన్ పాపాలపై ఫిర్యాదుల వెల్లువ 13

వాటికి పరిష్కారమే ప్రధాన అజెండా

గ్రామసభల విన్నపాలకు జవాబుదారీ

ఫ్రీ హోల్డ్, అసైన్డ్ సమస్యలు తీరేనా?

రీ సర్వే చిక్కులు ఇకనైనా తొలగేనా?

ఇక వాట్సాప్ పాలన!

పాలనలో మరింతగా టెక్నాలజీ వినియోగం 12


అన్ని ప్రజా సేవలకూ వాట్సాప్ వేదిక కావాలి

శాఖలవారీ డ్యాష్‌బోర్డుల నిర్వహణ ఆర్టీజీఎస్‌కు

జనవరి 1న జనన, మరణాల నమోదుకు పోర్టల్

మరో వెయ్యి సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు

ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



జమిలిపై ముందుకు!

బిల్లుకు రేపు కేబినెట్ ఆమోదం

ఏకాభిప్రాయం కోసం జేపీసీకి పంపే అవకాశం

జమిలి కోసం రాజ్యాంగానికి ఆరు సవరణలు

కొన్ని సవరణలకు 2/3 మెజారిటీ అవసరం

విపక్ష పరోక్ష సహకారం లేకుండా అసాధ్యం

జేపీసీతో కొన్ని పార్టీలనైనా ఒప్పించే వ్యూహం

న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిపే రాజ్యాంగ సవరణ బిల్లును శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని నిర్ణయించామని, గురువారం కేంద్ర కేబినెట్‌లో ఈ బిల్లును ఆమోదించవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. కేబినెట్ సమావేశం సాధారణంగా బుధవారం జరగాల్సి ఉండగా ఈసారి గురువారానికి వాయిదా వేశారు. బిల్లు ప్రవేశపెట్టిన

మిగతా 2వ పేజీలో...

రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాసం

దేశ చరిత్రలోనే తొలిసారి ప్రతిపాదన

మోహన్‌బాబు x మనోజ్

మంచు ఫైటింగ్స్





మైకు లాక్కొని మీడియా ప్రతినిధులపై దాడి చేస్తున్న మోహన్‌బాబు; ఓ వ్యక్తిపై మనోజ్ దాడి

జల్‌పల్లిలోని నివాసం వద్ద ఉద్రిక్తత

భార్యతో కలిసి వెళ్లిన మనోజ్.. లోపలికి రానివ్వని మోహన్‌బాబు, సెక్యూరిటీ

గేట్లు బద్దలు కొట్టుకొని వెళ్లిన కుమారుడు

ఆగ్రహంతో ఊగిపోయిన తండ్రి

సంఘటనను చిత్రీకరిస్తున్న మీడియాపై దాడి

మైకు లాక్కొని కొట్టిన మోహన్‌బాబు

ఒక జర్నలిస్టుకు ఫ్రాక్చర్.. పలువురికి గాయాలు

జర్నలిస్టు సంఘాల ఆగ్రహం.. చర్యలకు డిమాండ్

మోహన్‌బాబు, మనోజ్ లైసెన్స్‌డ్ తుపాకుల సీజ్

నేడు విచారణకు రావాలని మోహన్‌బాబుకు నోటీసులు.. ఆస్పత్రిలో చేరిక

మనోజ్.. నా గుండెలపై తన్నావ్

కొడుకునుద్దేశించి తండ్రి ఆడియో విడుదల

హైదరాబాద్ సిటీ/పహాడీ షరీఫ్/హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో రచ్చకెక్కిన ఇంటి గొడవలు మరింత ముదిరి తారస్థాయికి చేరాయి. మోహన్‌బాబు, ఆయన చిన్న కుమారుడు మనోజ్ మధ్య చోటుచేసుకున్న వివాదం మంగళవారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద మనోజ్ బౌన్సర్లు, మోహన్‌బాబుకు రక్షణగా ఆయన పెద్ద కుమారుడు విష్ణు నియమించిన బౌన్సర్లకు మధ్య ఘర్షణ జరిగింది. మనోజ్ దంపతులను మోహన్‌బాబు ఇంట్లోకి రానివ్వకపోవడంతో ఆయన గేట్లు బద్దలు కొట్టుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడం ఘర్షణను మరింత పెద్దది చేసింది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి బయటికి వచ్చిన మోహన్‌బాబు.. వివరణ కోరిన మీడియా ప్రతినిధులపై దాడి చేశారు. ఈ దాడిలో పలువురికి గాయాలు కూడా

మిగతా 9వ పేజీలో...

సిరియాపై.. ఇజ్రాయెల్

ముప్పేట దాడులు



గోలాన్‌హైట్స్‌లోని బఫర్‌జోన్‌లో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు 14

కీలక వైమానిక స్థావరాల ధ్వంసం.. ఆయుధాగారాలపైనా ఏరియల్ బాంబింగ్

బఫర్‌జోన్‌లో భారీగా ట్యాంకులు.. డమాస్కస్‌కు 25 కి.మీ. దూరంలో ఐడీఎఫ్

ఖతార్, తుర్కియే, ఇరాన్ ఖండన.. సిరియాలో కొలువుదీరిన ఆపద్ధర్మ సర్కారు



తైవాన్ తూర్పు తీరంలో మోహరించిన చైనా యుద్ధ నౌక

తైవాన్ తీరంలో 90 యుద్ధ నౌకలు

చైనా దుందుడుకు చర్య

భారీగా నౌకల మోహరింపుతో ఉద్రిక్తత

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తైవాన్ ఆర్మీ వెల్లడి 14



ఇదేదో రైలు పట్టాల పక్కన పేదలు వేసుకున్న గుడిసె అనుకుంటున్నారా? కాదు.. రష్యా యుద్ధ ట్యాంకు. ఉక్రెయిన్ ప్రయోగిస్తున్న డ్రోన్లు, ట్యాంకు విధ్వంసక క్షిపణుల దెబ్బకు భయపడి రష్యా తన ట్యాంకులను ఇలా ప్లైవుడ్ షీట్లు, ఇనుప రేకులు, ఊచలతో కదిలే గోదాములా.. గుడిసెలా మార్చేసింది.

గుడిసె కాదు.. యుద్ధ ట్యాంకు!

14

ఉక్రెయిన్ డ్రోన్లు, క్షిపణి దాడుల నుంచి తన యుద్ధ ట్యాంకుల రక్షణకు తిప్పలు పడుతున్న రష్యా

ప్లైవుడ్ షీట్లు, డ్రోన్ జామర్లతో కాపాడుకునే యత్నం

టీ 72, టీ90లతో తంటాలు.. మన వద్దా భారీగా ఆ ట్యాంకులు.. రష్యా అనుభవంతో భారత సైన్యం అలర్ట్

2030నాటికి టీ 72ల స్థానంలో 1770 ఎఫ్ఆర్‌సీవీలు!




12

17న మంగళగిరి ఎయిమ్స్‌కు

రాష్ట్రపతి

ప్రథమ వార్షికోత్సవానికి ముర్ము రాక

విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశాలు



2

కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

గుండెపోటుతో నిద్రలోనే తుదిశ్వాస

6 దశాబ్దాలుగా వివాద రహితుడిగా ముద్ర

కేంద్ర మంత్రి, గవర్నర్ సహా పలు పదవుల నిర్వహణ

మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టులకు 50% రిజర్వేషన్

సగం పోస్టులు బీసీ, ఎస్సీ, ఎస్టీలకే

మొత్తం పదవుల్లో మహిళలకు 50 శాతం 13

జిల్లా యూనిట్‌గా ఖరారు చేయనున్న కలెక్టర్లు

త్వరలో లిక్కర్ ప్రీమియం స్టోర్లు

లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.కోటి.. ఏటా 10% పెంపు 13

'స్పామ్'.. ఏపీ!

స్పామ్ కాల్స్ రిసీవర్స్‌లో రెండో స్థానంలో రాష్ట్రం

మొదటి స్థానంలో ఢిల్లీ

ల్యాండ్ ఫోన్లకు కూడా

ఢిల్లీ, ముంబై సహా కర్ణాటకల నుంచి కాల్స్

గుజరాత్, ఉత్తరప్రదేశ్, కోల్‌కతాల నుంచి మెసేజీలు



విజయవాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): "మీరు స్థలం కొనాలనుకుంటున్నారా? బెంగళూరు శివారులో మా సంస్థ కొత్తగా వెంచర్ వేసింది. ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి త్వరపడండి. మీ పేరును రిజిస్టర్ చేసుకోండి"- "మా బ్యాంక్ నుంచి హౌసింగ్ లోన్ ఇస్తున్నాం. మీ క్రెడిట్ స్కోర్‌ను బట్టి రూ.35 లక్షల వరకు లోన్ మంజూరు చేస్తాం" - బాగా బిజీలో ఉన్నప్పుడు, ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ వినియోగదారులను ఇబ్బంది పెట్టడమే కాకుండా వారికి చిరాకు తెప్పిస్తున్న ఫోన్‌కాల్స్ ఇవి. ఎక్కడి నుంచి వస్తున్నాయో, ఎవరు చేస్తున్నారో తెలియదు. ముఖ్యమైన ఫోన్‌కాల్ అని భావించి ఆన్సర్ చేస్తే

మిగతా 12వ పేజీలో...

ఆర్థిక వృద్ధి.. ఉపాధి కల్పన

టూరిజం పాలసీలో ప్రభుత్వ లక్ష్యాలు.. జీవీఏ 8 శాతం, ఉద్యోగాలు 15 శాతానికి పెంచాలని నిర్ణయం

వచ్చే ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు.. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక సదుపాయాలు

ఏడు యాంకర్ హబ్స్ ఏర్పాటు.. కనెక్టివిటీ పెంపు.. ఫిల్మ్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

పర్యాటకుల భద్రతకు టూరిజం సెక్యూరిటీ ఫోర్స్.. 2024-29 పర్యాటక విధానం విడుదల 12

ఖైదీపై క్రూర లాఠీ

జైలులో ఉండాల్సిన ఖైదీతో ఇంటి పనులు

సరిగా పనిచేయలేదంటూ బాదేసిన జైళ్ల ఉన్నతాధికారి

అడ్డొచ్చిన వార్డర్‌కు కూడా గాయాలు 14

రాజమండ్రి సెంట్రల్ జైలు పరిధిలో ఘటన

గతంలోనూ ఖైదీలపై రాక్షస 'కిరణం' పైశాచికం

సీమ వైసీపీ మాజీ మంత్రికి ఈయన బంధువు

తొలి నుంచీ జైళ్ల శాఖలో వివాదాస్పదుడిగా ముద్ర

'కెనడా గవర్నర్' ట్రూడో

కెనడా నుంచి అక్రమ వలసలు, డ్రగ్స్ నేపథ్యంలో ట్రంప్ చురకలు

కెనడా అమెరికాలో చేరాలని హితవు

అమెరికా పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ ధిల్లాన్ 14

ఎఫ్ 1 వీసాల జారీలో 38% క్షీణత

అమెరికాకు తగ్గిన భారతీయ విద్యార్థులు 2

విహారయాత్ర విషాదాంతం

- పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు మృతి, మరొకరు గల్లంతు.. కోనసీమ జిల్లాలో ఘటన

పి.గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబమంతా సరదాగా అరకు విహారయాత్రకు వెళ్లింది. సంతోషంగా యాత్ర ముగించుకొని తిరిగి వస్తున్న వారు.. మరో 5-6 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఇంటికి చేరుకునేవారు. అయితే ఇంతలో ఆ కుటుంబాన్ని మృత్యువు వేటాడింది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో భార్య, ఒక కుమారుడు మరణించగా, మరో కుమారుడు నీటిలో గల్లంతయ్యాడు. భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్‌కుమార్ తన భార్య ఉమా (32), కుమారులు రోహిత్ (9), మనోజ్ (5)లతో కలిసి ఈనెల 6వ తేదీన కారులో అరకు వెళ్లారు. యాత్ర ముగించుకుని సోమవారం రాత్రి వైజాగ్ నుంచి తిరిగి బయలుదేరారు. రావులపాలెం సమీపంలోని ఈతకోట వచ్చేసరికి నిద్రమత్తుగా ఉందని విజయ్‌కుమార్ కారును రోడ్డు పక్కన ఆపి.. డ్రైవింగ్‌ను భార్య ఉమాకు ఇచ్చాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో చింతావారిపేట వచ్చేసరికి కారు అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. భార్యాబిడ్డలు నీటిలో గల్లంతయ్యారు. విజయ్‌కుమార్ కారు వెనుక డోర్ నుంచి బయటకు వచ్చి ఉమాను, ఒక కుమారుడిని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చి, మరో కుమారుడిని వెతుకులాడేందుకు వెళ్లాడు. ఈ సమయంలో ఒడ్డున ఉన్న వారు కూడా కంగారుతో చీకట్లో నీటిలో జారిపడి గల్లంతయ్యారు. విజయ్‌కుమార్ ఎంత వెతికినా భార్యా పిల్లల ఆచూకీ తెలియలేదు. దీంతో బయటకు వచ్చి అటుగా వెళ్లే ఓ ప్రయాణికుడి ఫోన్ తీసుకుని తన సోదరుడు, బంధువులకు, 108కు సమాచారం అందించాడు. ఎస్ఐ బి.శివకృష్ణ, స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా.. ఘటన జరిగిన ప్రదేశానికి సమీపంలో ఉమా, రోహిత్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మనోజ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంఘటనా స్థలానికి వచ్చి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

అప్పు తీర్చినా వేధిస్తున్నారు

- పింఛన్ కూడా లాక్కున్నారు
- సెల్ఫీ వీడియోలో పురుగుల మందు తాగుతూ ఆత్మహత్యాయత్నం

తెనాలి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చినా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరి గ్రామం వార్డు సభ్యురాలైన సౌపాటి కోటేశ్వరమ్మ...పినపాటి విజయ వద్ద రూ.3లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకు రూ.100కు వారానికి రూ.10 వంతున దాదాపు రూ.7 లక్షల వరకూ చెల్లించింది. అయినా ఇంకా రావాలంటూ ఆమెను వేధించారు. ఒంటరి మహిళ పింఛన్‌ను దౌర్జన్యంగా లాక్కున్నారు. దీంతో కోటేశ్వరమ్మ తీవ్ర మనస్తాపానికి గురయింది. ఇక తనకు బతకడం ఇష్టం లేదని సెల్ఫీ వీడియోలో పేర్కొంటూ పురుగులు మందు తాగింది. స్థానికులు ఆమెను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అమెరికాకు తగ్గిన భారతీయ విద్యార్థులు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆమేరకు అమెరికా జారీ చేసే ఎఫ్ 1 వీసాల సంఖ్యలో 38% తగ్గుదల కనిపించింది. అమెరికన్ బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నెలవారీ నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా నివేదికల డేటా ప్రకారం... ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకూ 64,008 మంది విద్యార్థులకు వీసాలు జారీ అయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో 1,03,495 వీసాలు జారీ అయ్యాయి. కొవిడ్ తరువాత భారతీయ విద్యార్థులకు ఈ స్థాయిలో వీసాలు తగ్గడం ఇదే తొలిసారి.

ఈఎస్ఐ ఆసుపత్రుల్లో అవినీతిపై విజిలెన్స్

- కార్మికులకు బీమా పరిహారం కూడా ఇవ్వలేదు: సుభాష్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ ఆసుపత్రుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపడతామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క ఈఎస్ఐ ఆస్పత్రిని కూడా నిర్మించలేదని, రూ.610 కోట్ల కేంద్ర నిధులు వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. రాష్ట్రంలోని కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు వసుధా మిశ్రా కమిటీ ఏర్పాటు చేశామని, ఆ కమిటీ నివేదిక అందిన వెంటనే సిఫార్సులను అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల విషయంలో కఠినంగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే యలమంచిలి, గుణదలలో ఈఎస్ఐ ఆసుపత్రులు ప్రారంభించామన్నారు. అమరావతిలో 150, 500 పడకల ఆస్పత్రికి, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం లభించిందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే చంద్రబాబును జైల్లో పెడతామని అంటున్నారని, ఒకసారి పెట్టినందుకే ఏమైందో ఇంకా తెలిసిరాలేదా? అని ప్రశ్నించారు.

16న పోలవరం పర్యటనకు చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనున్నారు. వచ్చే నెల రెండో తేదీన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులను బావర్ ప్రారంభించనున్నది. డయాఫ్రమ్‌వాల్‌తో సాటు సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు కూడా చేపట్టాలని కేంద్ర జల సంఘం సూచించింది. ఈ నెల ఆరో తేదీన పోలవరం ప్రాజెక్టు అథారిటీ రాష్ట్ర జల వనురుల శాఖతో నిర్వహించిన సమీక్షలో 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. వచ్చే నెల రెండో తేదీన ఎట్టిపరిస్థితుల్లోనూ డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సిందేనని జల వనరుల శాఖను.. కాంట్రాక్టు సంస్థలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పర్యటనలో.. డయాఫ్రమ్‌వాల్.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ల నిర్మాణాల కార్యాచరణపై సమీక్షించనున్నారని అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గానికొక మోడల్ కాలనీ: పార్థసారథి

రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ ఒక మోడల్ కాలనీని అభివృద్ధి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. వీటిలో మౌలిక సదుపాయాల కల్పనకు అంచనా వ్యయంతో నివేదిక రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణంలో పురోగతిపై హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న పేదల ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని, లేకపోతే భవిష్యత్తులో రాష్ట్రానికి ఇళ్లు మంజూరు కాని పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కారంపై సోషల్ ఆడిట్!

- త్వరలో జిల్లాలకు ర్యాంకింగ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజల నుంచి వెల్లువెత్తుతోన్న విన్నపాలు, ఫిర్యాదుల పరిష్కారంపై సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికార యంత్రాంగం పరిష్కరించిన 10 శాతం ప్రజా ఫిర్యాదులపై థర్డ్‌పార్టీ సంస్థలతో సోషల్ ఆడిట్ చేయించాలన్నది సర్కారు ఉద్దేశ్యం. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ఎలా ఉంది? నిజంగానే అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించారా? లేదా ఒత్తిడితో పరిష్కరించినట్లు కేసులను ముగించేశారా? అర్జీదారులకు నిజంగా న్యాయం జరిగిందా? లేదా? తదితర వివరాలు ఆరా తీసి, వాటి ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే అంశాన్ని జిల్లా కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ప్రధానంగా చర్చించనుంది. రీ సర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించిన సభలు, రెవెన్యూ సదస్సుల్లో వస్తోన్న ఫిర్యాదులకు ఈ విధానం వర్తింపచేయనున్నారు. సమస్యల పరిష్కారం ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగులు ఇవ్వాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ అంశంపై కలెక్టర్ల సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు జోనల్ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో జోన్‌ల వారీగా ఈ నెల 18 నుంచి సదస్సులు జరగనున్నాయి. రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా, సీసీఎల్‌ఏ జయలక్ష్మి, అదనపు సీసీఎల్‌ఏ, సర్వే డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఇతర అధికారులు ఈ సదస్సుల్లో పాల్గొంటారు. సంబంధిత జోన్‌లో ఉన్న అంశాలే ఎజెండాగా చర్చించి పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహించాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది.

రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాసం

దేశ చరిత్రలోనే మొదటిసారి.. తీర్మానంపై 60 మంది 'ఇండియా' ఎంపీల సంతకాలు





న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై రాజ్యసభలో విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. చైర్మన్‌పై ఇంతటి తీవ్ర చర్యకు ఎంపీలు దిగడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని చెబుతున్నారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఆర్జేడీ, టీఎంసీ, డీఎంకే, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, ఆప్ తదితర పార్టీలకు చెందిన 60 మంది ఎంపీలు దానిపై సంతకాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీలు జైరాం రమేశ్, సయ్యద్ నాసిర్ హుస్సేన్ సదరు తీర్మానాన్ని మంగళవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి అందజేశారు. అయితే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఇతర పార్టీల పార్లమెంటరీ నేతలు ఈ తీర్మానంపై సంతకాలు చేయలేదు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నందున కాంగ్రెస్ అగ్రనేతలు సంతకాలు పెట్టలేదని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు స్పష్టం చేశారు. మరోవైపు.. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మంగళవారం కూడా ఎలాంటి కార్యకలాపాలు జరుగలేదు. ఉభయసభల్లోనూ పెద్దఎత్తున గందరగోళం చెలరేగింది. పారిశ్రామికవేత్త అదానీపై అమెరికాలో చార్జిషీటు, ఆయనతో ప్రధాని మోదీ సంబంధాలపై చర్చకు కాంగ్రెస్ యథాప్రకారం పట్టుబట్టింది. బీజేపీ ఎదురుదాడికి దిగింది. అమెరికా ఇండస్ట్రియలిస్ట్, భారత వ్యతిరేకి జార్జి సోరో్స్‌తో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి లింకులున్నాయని.. ఆ పార్టీ దేశద్రోహానికి పాల్పడుతోందని.. ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేసింది. పరస్పర ఆరోపణలు, నినాదాలతో ఉభయసభలూ అట్టుడికాయి. దీంతో ఎలాంటి కార్యకలాపాల్లేకుండానే సభలు బుధవారానికి వాయిదాపడ్డాయి. కాగా.. ధన్‌ఖడ్ ఎగువ సభలో అధికార కూటమికి అనుకూలంగా అత్యంత పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోజనాల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఆయనపై ఇండియా కూటమి అవిశ్వాసం ప్రతిపాదించిందని 'ఎక్స్'లో తెలిపారు. ధన్‌ఖడ్‌తో పలు అంశాలపై విపక్ష ఎంపీలకు విభేదాలు ఉన్నాయి. తమపై దాడికి అధికార పక్షానికి ఎక్కువ అవకాశాలు ఇస్తున్నారని వారు గుర్రుగా ఉన్నారు. గత ఆగస్టులోనే అవిశ్వాసం పెట్టాలనుకున్నా ఆయనకు మరో అవకాశం ఇవ్వాలని భావించారు. తాజా సమావేశాల్లో సోరోస్-సోనియా లింకులపై చర్చకు బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసులను తిరస్కరించిన చైర్మన్.. తిరిగి ఆ అంశాన్ని జీరో అవర్‌లో ప్రస్తావించేందుకు అనుమతివ్వడంతో కాంగ్రెస్ ఎంపీలు మండిపడ్డారు. దీంతో ఆయనపై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. ఇతర ఇండియా కూటమి ఎంపీలు కూడా మద్దతిచ్చారు. రాజ్యాంగంలోని 67(బీ), 92, 100వ అధికరణల ప్రకారం.. రాజ్యసభ చైర్మన్‌ను తొలగించాలంటే తొలుత సభలో తీర్మానం ప్రవేశపెట్టాలి. ఓటింగ్ రోజు హాజరైన సభ్యుల్లో సగం మంది కంటే ఒకరు ఎక్కువగా దానికి అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆయన్ను తొలగించడం సాధ్యపడుతుంది. రాజ్యసభ చైర్మన్ ఉపరాష్ట్రపతి కూడా కావడంతో లోక్‌సభలోనూ తీర్మానం ఆమోదం పొందాల్సి ఉంటుంది. కాగా..ఈ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానంపై చర్చకు సాంకేతికంగా వీలుపడదని.. 14 రోజుల ముందు తీర్మానానికి నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని.. ఇంకో 8 రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగియనున్నాయని రాజ్యసభ సచివాలయం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయితే రాజ్యసభలో ఎన్డీఏకి పూర్తి మెజారిటీ ఉందని.. ఈ తీర్మానాన్ని తిరస్కరించడం ఖాయమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వ్యాఖ్యానించారు. 'రాజ్యసభ చైర్మన్ మనకు మార్గదర్శి. సభ సజావుగా నడిచేందుకు ఆయన చెప్పేది అందరూ వినాలి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎల్లప్పుడూ చైర్మన్‌ను అవమానిస్తుంటాయి' అని ధ్వజమెత్తారు. విపక్షాలకు రాజ్యాంగ నియమాలు తెలియవని.. ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ అన్నారు. 67(బీ) అధికరణ ప్రకారం అభిశంసన తీర్మానం మాత్రమే ప్రవేశపెట్టాలని చెప్పారు. ధన్‌ఖడ్‌పై ఒత్తిడి తేవడానికి విపక్షం ప్రయత్నిస్తోందన్నారు. టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మాట్లాడుతూ.. ఈ తీర్మానం ఆమోదానికి తగిన సంఖ్యాబలం తమకు లేదని.. కానీ ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కోసం పోరాడేందుకు బలమైన సందేశంగా పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏ వ్యక్తిపైనా తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదన్నారు.

అదానీ-మోదీ సంచులతో నిరసన


కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో వినూత్నంగా నల్ల జోలెలు ధరించి నిరసనకు దిగారు. ఆ సంచులకు ఓవైపు అదానీ, మోదీ చిత్రాలు.. ఇంకోవైపు 'అదానీ-మోదీ భాయ్ భాయ్' అన్న నినాదం ముద్రించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా సహా కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం, వామపక్ష ఎంపీలు మకరద్వారం మెట్ల ముందు నిరసన చేపట్టారు. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతకుముందు రాహుల్ కాంగ్రెస్ ఎంపీలతో పార్లమెంటు ప్రాంగణంలో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై సమీక్షించారు. పార్లమెంటు సమావేశాలు మొదలైనప్పటి నుంచి సభల లోపలే గాక వెలుపల కూడా ఇండియా కూటమి నిరసనలు చేపడుతున్న సంగతి తెలిసిందే.



భారత్‌పై సోరోస్ యుద్ధం: రిజిజు

కాంగ్రెస్-సోరోస్ లింకుపై బీజేపీ చేస్తున్నది వట్టి ఆరోపణ మాత్రమే కాదని.. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టంచేశారు. దీనికి సంబంధించిన నివేదిక అందరికీ అందుబాటులోనే ఉందని మీడియాతో అన్నారు. సోరోస్ బహిరంగంగానే భారత్, భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారని.. భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి సంకల్పించారని.. ఇది దేశ పౌరులందరికీ ఆందోళన కలిగించే అంశమని.. ఈ సమయంలో ఎంపీల మధ్య ఐక్యత అవసరమని తెలిపారు. జాతీయ ప్రయోజనాల విసయంలో పార్లమెంటు సభ్యులందరూ కలిసికట్టుగా ఉండాలని పిలుపిచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సోమవారం ఈ అంశాన్ని రాజ్యసభలో ప్రస్తావించిన సంగతి తెలిసిందే. అయితే అదానీని కాపాడుకునేందుకే బీజేపీ సోరోస్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే ఆరోపించారు. అదానీని అవిశ్రాంతంగా రక్షిస్తోందని.. పార్లమెంటును నడవనివ్వడం లేదని అన్నారు.

లోకం తీరు



మమతకు లాలూ మద్దతు

ఇండియా కూటమి బాధ్యతను ఆమెకు అప్పగించాలని సూచన

న్యూఢిల్లీ, డిసెంబరు 10: కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి తాను నాయకత్వం వహిస్తానంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమత తన మనసులోని మాటను చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమిలోని పలు పార్టీల నాయకులు ఆమెకు మద్దతు తెలపడం విశేషం. ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, మహారాష్ట్రకు చెందిన మాజీ సీఎం ఉద్ధవ్ బాల్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీలు మమత నాయకత్వానికి దన్నుగా నిలిచాయి. మంగళవారం లాలూ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమి బాధ్యతలను మమతకు అప్పగించాలని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. లాలూ కుమారుడు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. శివసేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంకా చతుర్వేది కూడా మమతకు మద్దతు తెలిపారు. "ఇండియా కూటమికి మమత నాయకత్వం అత్యంత ముఖ్యం" అని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌ను బలోపేతం చేసినట్టే.. ఆమెకు పగ్గాలు అప్పగిస్తే కూటమిని కూడా బలోపేతం చేస్తారన్న నమ్మకం ఉందని తెలిపారు. శివసేన(యూబీటీ) కీలక నేత సంజయ్ రౌత్ మాత్రం భిన్నంగా స్పందించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేరన్నారు. ఇదిలావుంటే, ఇండియా కూటమిలో సఖ్యత లేదని, పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ విమర్శలు గుప్పించింది. కాగా, మిత్రపక్షాల వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించవద్దని ఆయన కాంగ్రెస్ ఎంపీలను ఆదేశించారు.

ఈవీఎంల ఓట్లు, వీవీప్యాట్ స్లిప్‌లు

సరి సమానం

మహారాష్ట్ర ఎన్నికలపై ఎలక్షన్ కమిషన్ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 10: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈవీఎంల్లో నమోదైన ఓట్లు, వీవీప్యాట్ స్లిప్‌ల మధ్య ఎలాంటి తేడాలు కనిపించలేదని మంగళవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటి సంఖ్య సరిసమానంగా ఉందని పేర్కొంది. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మచ్చుకు అయిదు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి అక్కడి వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు రోజైన గత నెల 23నే వాటిని లెక్కించినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1,440 వీవీప్యాట్‌ల స్లిప్‌లను లెక్కించారు. వాటిని సంబంధిత ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లతో సరిపోల్చగా ఎక్కడా తేడాలు కనిపించలేదని పేర్కొంది. ఈవీఎంల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష సభ్యులు తొలి రోజున ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయడానికి తిరస్కరించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఈ వివరాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈసీ ప్రకటనపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపింది.

ఈ ఏడాది గూగుల్ ట్రెండ్ 'ఐపీఎల్'

వ్యక్తుల జాబితాలో పవన్ కల్యాణ్‌కు 5వ స్థానం

న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఏదైనా కొత్త విషయం తెలుసుకోవాలన్నా.. ఏదైనా విషయం మీద వార్తలో, వివరాలో కావాలన్నా.. అత్యధిక మంది ఆశ్రయించేది గూగుల్‌నే. జనం ఎక్కువగా దేనిపై ఆసక్తి కనబరిచారో ఎప్పుడెప్పుడు దేని గురించి వెతికారో గూగుల్ ట్రెండ్స్ చెప్పేస్తుంది. 2024లో భారతీయులు ఎక్కువగా వెతికిన అంశాల జాబితాను మంగళవారం గూగుల్ ప్రచురించింది. ఇందులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అగ్రస్థానంలో నిలవగా వ్యక్తుల జాబితాలో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐదో స్థానంలో ఉన్నారు. సినిమాల విషయానికి వస్తే స్త్రీ2 గురించి ఎక్కువ మంది ఆరా తీశారు.

జమిలిపై ముందుకు!

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన సంయుక్త కమిటీకి(జేపీసీ) నివేదిస్తారని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందుతుందని అధికార వర్గాలు తెలిపాయి ఈ మధ్య కాలంలో జేపీసీ వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లను సంప్రదిస్తుందన్నారు. బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రాలకు పంపుతారని, సగానికిపైగా అసెంబ్లీలు ఆమోదించిన తర్వాత అది చట్టరూపం పొందుతుందని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, జమిలి ఎన్నికలపై గత ఏడాది సెప్టెంబరులో ఏర్పాటైన రాంనాథ్ కోవింద్ కమిటీ సిఫారసులను కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదించింది. కోవింద్ కమిటీకి 47 రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలు తెలిపాయి. 32 పార్టీలు జమిలి ఎన్నికలను సమర్థించాయి. బీజేపీ, బీజేడీ, జేడీయూ, శివసేన వీటిలో ఉన్నాయి. వనరులు ఆదా కావడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం, ఏకకాలంలో దేశం అభివృద్ధి జరగడం దీనివల్ల సాధ్యపడతాయని అవి భావించాయి. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలను ఏకకాలంలో నిర్వహించేందుకు రాజ్యాంగంలోని 83, 172 అధికరణలను సవరించాలని కమిటీ సూచించింది. దీనివల్ల రాష్ట్రపతి, గవర్నర్ రద్దు చేస్తే తప్ప లోక్‌సభ, అసెంబ్లీల పదవీకాలం అయిదేళ్లు స్థిరంగా ఉంటుందని కమిటీ భావించింది. బీజేపీ ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో జమిలి ఎన్నికలను ప్రవేశపెడతామని ప్రజలకు హామీ ఇచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇదే అంశాన్ని పదేపదే ప్రస్తావించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎంఐఎంతో పాటు అనేక పార్టీలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. విషయాన్ని జేపీసీకి నివేదించి ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి జేపీసీ ఏర్పాటయితే దాని ద్వారా అన్ని పార్టీల ప్రతినిధులు, మేధావులు, సామాన్యుల అభిప్రాయాలను కూడా సేకరించడానికి అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం



ఉన్న ఎన్నికల విధానాన్ని మార్చడం భారీ సవాళ్లతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఏకాభిప్రాయ సాధన తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు ఆమోదం పొందితే ఎప్పుడు ఎన్నికలు జరుగుతాన్న విషయం చర్చ జరుగుతోంది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది కనుక 2029 వరకు ఈ ఎన్నికలకు సన్నద్ధం కావచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పరిస్థితులను బట్టి ఈ ఎన్నికల ప్రక్రియను ముందుకు జరపవచ్చునని కూడా చర్చ జరుగుతోంది.

మహారాష్ట్ర విజయం తర్వాత

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో జమిలి ఎన్నికల గురించి గట్టిగా చెప్పినప్పటికీ ఫలితాలు వచ్చిన తర్వాత బీజేపీ ఈ హామీపై కొన్ని నెలలు చప్పుడు చేయలేదు. కేంద్రంలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేక మిత్రపక్షాల మీద ఆధారపడే పరిస్థితి ఉండటం, హరియాణా, మహారాష్ట్రలలో లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్న నేపథ్యంలో మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి ప్రభుత్వం ఏర్పాటు చేయడమన్నది అనుమానాస్పదం కావడంతో నిజంగానే జమిలి సద్దుమణిగింది. అయితే, మహారాష్ట్ర, హరియాణాల్లో బీజేపీ తిరుగులేని విజయాలు సాధించడం, కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడటం, ఎన్డీయే మిత్రపక్షాలన్నీ జమిలి విషయంలో బీజేపీకి దన్నుగా నిలబడిన నేపథ్యంలో సవరణలను ముందుకు తీసుకెళ్లగలమని అధికారపక్షం భావిస్తోంది. ఇప్పుడు సగం రాష్ట్రాల్లో బిల్లును ఆమోదించుకోవడం ఎన్డీయేకు సమస్య కాదు.

ఒకేసారి అసెంబ్లీ ఎన్నికలు పెట్టలేని కమిషన్


ప్రస్తుతం పలు దఫాలుగా ఎన్నికలు జరుగుతుండడంతో సమయం, ధనం వృథా అవుతోందని ప్రభుత్వం భావిస్తోంది. దానికితోడు ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు చేపట్టడంలో సమస్యలు వస్తున్నాయని అంటోంది. అందువల్ల అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఇది ఆచరణ సాధ్యం కాదని ప్రతిపక్షాలు అంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలనే ఎలక్షన్ కమిషన్ విడతల వారీగా జరుపుతోందని, అలాంటప్పుడు అన్నింటిని ఒకేసారి ఎలా జరపగలుగుతుందని ప్రశ్నిస్తున్నాయి. ఇది అప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేకమని కూడా వాదిస్తున్నాయి.

బలాబలాలు చూస్తే

ఒకే దేశం-ఒకే ఎన్నిక నిర్వహించాలంటే ముందుగా రాజ్యాంగానికి ఆరు సవరణలు చేపట్టాల్సి ఉంది. ఇందుకు ఆరు బిల్లులు ప్రవేశపెట్టాల్సి ఉంది. వీటిని పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంటులో ఎన్డీఏకు సాధారణ మెజార్టీ ఉందే తప్ప 2/3 మెజార్టీ లేదు. రాజ్యసభలో 245 సీట్లు ఉండగా, ఎన్డీఏ బలం 112 మాత్రమే. ప్రతిపక్షాలకు 85 సీట్లు ఉన్నాయి. రాజ్యాంగ సవరణ బిల్లులో ఆమోదం పొందాలంటే 164 ఓట్ల అవసరం ఉంది. లోక్‌సభలో మొత్తం 545 స్థానాలు ఉండగా ఎన్డీఏకు 292 సీట్లే ఉన్నాయి. 2/3 మెజార్టీ అంటే 364 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. ఇక్కడ చిన్న మెలిక కూడా ఉంది. మొత్తం సభ్యులను పరిగణనలోకి తీసుకోకుండా.. సభకు హాజరయి, ఓటు వేసిన వారిలో 2/3 శాతం మెజార్టీ సరిపోతుందన్న నిబంధన ఉండడంతో చివరి నిమిషంలో అనూహ్యమైన పరిణామాలకు కూడా అవకాశం ఉంటుంది.

కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ కన్నుమూత

- గుండెపోటుతో నిద్రలోనే తుదిశ్వాస
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు
- సెలవు ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం



బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ(92) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కర్ణాటక రాజకీయాలలో అత్యంత సీనియర్ నేత అయిన కృష్ణ.. ముఖ్యమంత్రి, గవర్నర్, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి వంటి కీలకమైన పదవులను చేపట్టారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఏడాది నుంచి ఆయన ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న తన నివాసంలో నిద్రిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యారు. ఆ తర్వాత కొద్ది సేపటికే ఎస్ఎం కృష్ణ కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 60 ఏళ్ల పాటు రాజకీయాల్లో కొనసాగిన ఎస్ఎం కృష్ణ వివాదరహితుడిగా పేరొందారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గానూ కొనసాగారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన 2017 మార్చిలో బీజేపీలో చేరారు. అయితే క్రియాశీలకంగా వ్యవహరించలేకపోయారు. 1962లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1968, 1971, 1980లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1972లో కర్ణాటక విధానపరిషత్ సభ్యుడిగా, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. 1984లో ఆర్థికమంత్రిగా, 1989 నుంచి 92 వరకు శాసనసభ స్పీకర్‌గా కొనసాగారు. 1992 నుంచి 94వరకు కర్ణాటక తొలి ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1995లో శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత 1999లో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. 2004 నుంచి 2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగారు. 2009 నుంచి 2012 వరకు భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. ఎస్ఎం కృష్ణ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించింది. శాసనసభ కార్యకలాపాలను బుధవారం పూర్తిగా రద్దు చేశారు. ఎస్ఎం కృష్ణ స్వగ్రామం మండ్య జిల్లా మద్దూరు తాలూకా సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సెలవు ప్రకటించింది. ఎస్ఎం కృష్ణ సమీప బంధువు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు కృష్ణ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

'బ్రాండ్ బెంగళూరు' సొంతం!

కర్ణాటకలోని సోమనహళ్లిలో 1932, మే 1న జన్మించిన ఎస్ఎం కృష్ణ.. మైసూరులోని మహారాజా కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. తర్వాత అమెరికాలోని డల్లా్స్‌లో ఉన్న సదరన్ మెథొడిస్ట్ యూనివర్సిటీ, జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత రేణుకాచార్య లా కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 30 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి వచ్చారు. 1962లో మద్దూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ నేత కేవీ శంకర్‌గౌడ్‌పై విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. తర్వాత ప్రజా సోషలిస్టు పార్టీలో చేరారు. అనంతరం కాంగ్రెస్ కండువా కప్పుకొని సుదీర్ఘకాలం ఆ పార్టీలోనే ఉన్నారు. అంచెలంచెలుగా ఎదిగిన కృష్ణ.. ముఖ్యమంత్రి పీఠం ఎక్కాక.. 'బ్రాండ్ బెంగళూరు' కోసం తపించారు. ఐటీ రంగంలో బెంగళూరును ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న సిలికాన్ వ్యాలీకి ప్రత్యామ్నాయంగా బెంగళూరును అనతి కాలంలోనే తీర్చి దిద్దారు. ఎస్ఎం కృష్ణ పాలనా కాలంలో టెక్నాలజీ రంగం పరుగులు పెట్టింది. కాగా, టెన్నిస్ అంటే అమితంగా ఇష్టపడే కృష్ణ.. కాలేజీ రోజుల్లో పలు పతకాలు సాధించారు.

మైనార్టీల బడ్జెట్‌ను దారి మళ్లించొద్దు

» విద్య, ఉపాధి అవకాశాల్లో వారి అభ్యున్నతికి కృషి చేయండి

» జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షాహెజాది పిలుపు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మైనార్టీల బడ్జెట్‌ను వారి సంక్షేమానికే వినియోగించాలని, ఇతర పథకాలకు ఆ నిధులను మళ్లించకూడదని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాహెజాది అన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్రంలో ప్రధాన మంత్రి 15 పాయింట్ల కార్యక్రమం అమలు తీరును సమీక్షించేందుకు మంగళవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలుపర్చాలని అధికారులను ఆదేశించారు. మైనార్టీల ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు పెద్ద ఎత్తున ఎంఎస్ఎమ్ఈలను పెట్టుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మైనార్టీ యువతులు యుక్తవయస్సులోనే గర్భధారణ ఎక్కువగా ఉంటుందని, దానిని నియంత్రించేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆమె సూచించారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద చేపట్టిన పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి కొత్త 15 పాయింట్ల కార్యక్రమం అమల్లో భాగంగా మైనార్టీలకు విద్యాఅవకాశాలను మెరుగుపర్చాలని, మదర్సా విద్యను ఆధునీకరించాలని, మైనార్టీ వర్గాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయాలని సూచించారు. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని ఆదేశించారు. పేదలకు స్వయం ఉపాధి, వేతన ఉపాధి కల్పించాలని, సాంకేతిక శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించాలని ఆర్థిక కార్యకలాపాలకు మెరుగైన క్రెడిట్ మద్దతును కల్పించాలని అన్నారు. తొలుత రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కమిషనర్ చితూరి శ్రీధర్ మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాల ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై నిర్వహించనున్నారు. ధనుర్మాస ఘడియలు ఈ నెల 16వ తేదీ ఉదయం 6.57 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో 17వ తేదీ వేకువజాము నుంచి జనవరి 14వ తేదీ వరకూ సుప్రభాతసేవలో తిరుప్పావై నివేదిస్తారు. ఈ సందర్భంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామికి ఏకాంత సేవ నిర్వహిస్తారు.

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED

e - Procurement TENDER NOTICE

APTransco invites bids online for Spec.No.APT-e-54/2024- Erection of (i) 220/132/33kVSS Koppaka (ii) LILO of 220kV Bhimadole-Nunna & K.Kota-Nuzvid DC lines to Koppaka SS (iii)132kV MC line from 220 kVSS Koppaka to RTSS Vatluru (iv) Modification of 132kV Eluru-RTSS Vatluru DC/SC line & (v) 2No.132kV Traction Bays in to conventional bays at 132kVSS Eluru on turnkey basis'. Date and availability of Tenders are available from Dt.11.12.2024 from 17.00 Hrs. at https://www.apeprocurement.gov.in Phone No.0866-2429232, 9491067095.

Sd/- **Chief Engineer/ Projects**

DIPR RO No.3378PP/CL/ADVT/1/1/2021-22, Dt.10.12.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.14/2024-25 తేది: 04.12.2024

పనిపేరు: పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజి-8, 8ఏ మరియు 8బి కి సంబంధించిన ముఖ్యమైన పనులను వివరణాత్మక పరిశోధన, జల సంబంధిత వివరములు, డిజైన్‌లు మరియు ఇంజనీరింగ్‌ల తయారీ మరియు అంచనాల తయారీ మరియు పోలవరం ఎడమ ప్రధాన ప్రస్తుత కాలువల యొక్క డిస్టిల్టింగ్ మొదలైన పనులు చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. **పనివిలువ:** రూ.73,44,96,991/- టెండర్లు స్వీకరించుటకు ప్రారంభ తేది: 11.12.2024, మ.02 గం. నుండి. ఇతర వివరాలను https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్ నెం.9440908059.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, పి.ఐ.పి.యల్.యం.సి. సర్కిల్, తుని

DIPR RO.No.14826/CL/ADVT/1/1/2021-22, Dt: 10.12.2024

LEARNET SKILLS FOR LIFE — Recruitment of Vocational Trainers & Coordinator (Contractual Basis)

Learnet Skills Ltd, a NSDC empanelled vocational training partner invites the applications for the position of Vocational Trainers for Sector Apparel & Made up's and Healthcare to be engaged in the Secondary and Higher Secondary Government Schools of Andhra Pradesh under SamagraShiksha.

Locations:

Apparel & Made up's : Anakapalli (1), Anatapur (1), Annamayya(1), ASR (2), Bapatla (1), Chittoor(3), Eluru(3), Guntur (1), Kakinada(4), Kadpa (4), Nandyal(2), SPSR Nellore(1), Palnadu(2), Prakasam(1), SriSatyaSai(1), Srikakulam(1), Tirupathi(3)

Healthcare: Annamayya(1), Kakinada(3), NTR(1), SriSatyaSai(1), Srikakulam(5), Tirupathi(1)

Eligibility Criteria For Trainer

Applicant should be in the age group of 21 – 37 years as on 02-12-2024

- Apparel: Graduation in Textiles and Clothing or relevant area from a recognized Institute/University, with at least 01 year work/teaching experience in the relevant area Or Diploma in Textiles and Clothing or relevant area from a recognized Institute/University, with at least 01 year work/teaching experience in the relevant area.
- Healthcare: B.Sc. Nursing and Midwifery (4 years) or 3 1/2 years Diploma in GNM with one year experience.

Application Procedure

- Effective oral and written communication skills and basic computing skills
- Monthly remuneration of Rs. 24,000/-inclusive of all statutory deductions
- Last date of Submitting Online application is 12-12-2024 upto 5.30 PM.
- Only short-listed applicants will be called for the written examination and personal interview How to Apply: Eligible candidates have to submit their updated CV's and other related documents in the Google form Link/QR Code given below.
- Google Form Link : https://forms.gle/inXDmRztug1sqx5H7

Eligibility Criteria For Coordinator

- Applicant should be in age group of 25-37 years as on 02-12-2024.
- Masters (3+2 or 4+1) with two year of experience at district level in manager/coordinator position.
- Last date of submitting Online application is 20-12-2024 upto 5.30 PM

How to Apply: Eligible candidates have to submit their updated CV's and other related documents in the Google form Link/QR Code given below.

- Google form Link: https://forms.gle/bURiGvcaTPoatfpc8

For more information log on to: www.learnetskills.com

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

'E' Procurement Notice No.33/VMC/CDB/2024-25, Dt.10-12-2024

Engaging or workers for Attending sanitation work (Total 4 works) - Est. Amount 66.16 Lakhs.

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen @ www.tender.apeprocurement.gov.in

Sd/- FOR COMMISSIONER

VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

AUCTION NOTIFICATION

The Visakhapatnam Metropolitan Region Development Authority (VMRDA) is inviting applications from the interested individuals, firms, and IT organizations for allotment of the following office / commercial space of Multi-Level Car Parking (MLCP) cum Commercial Complex, located at Siripuram, Visakhapatnam through public auction on monthly rental basis from **11-12-2024 to 21-12-2024**

LIST OF OFFICE SPACES AT MULTI-LEVEL CAR PARKING, SIRIPURAM, OPP. VMRDA OFFICE OPEN AUCTION ON 23-12-2024

Sl.	Floor	Plinth Area	Common Area	Total Sft	Earmarked for	VMRDA Upset Price Per Sft (Rs.)	Remarks
1.	Ground Floor	24683	11654	36337	Commercial Use	80/-	The Bidder for Fourth Floor Shall be a State or Central Government / Public Sector Undertaking
2.	Third Floor	28691	2958	31649	Commercial Use	75/-	
3.	Fourth Floor	19045	2958	22003	IT/ITES	65/-	
4.	Fifth Floor	17427	2958	20385	IT/ITES	65/-	
	Sixth Floor						
5.	Front	8521	1479	10000	IT/ITES	70/-	
	Middle	4260	740	5000	IT/ITES	70/-	
	Back	3389	639	4028	IT/ITES	70/-	
6.	Seventh Floor	14989	2958	17947	IT/ITES	70/-	
7.	Terrace Floor	14212	2958	17170	Commercial Use	40/-	

Note : 15% Maintenance Charges will be charged on monthly rent and 20% on upset price for common area.

Sd/-Metropolitan Commissioner, VMRDA

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఈవీఎం శంకలు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన మహావికాస్ అగాడీ నేతలంతా ఈవీఎంలను తప్పుబడుతున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటన చేసింది. ఈవీఎంలలో పోలైన ఓట్లకూ, వీవీప్యాట్ స్లిప్పులకూ మధ్య వీసమెత్తు వ్యత్యాసం కనబడలేదని, దేశస్థాయిలో ఏ విధానమైతే అమలు జరుగుతున్నదో, మహారాష్ట్రలోనూ అదేరీతిలో ఎన్నికలు జరిగాయని ఈసీ వివరణ ఇచ్చింది. 288మంది సభ్యులున్న అసెంబ్లీలో 235సీట్లను మహాయుతి ఎగరేసుకుపోయి, అగాడీ కూటమికి 46మాత్రమే దక్కినందువల్ల, ఈ ఘోరపరాజయం ప్రజల నిరాదరణవల్ల కాక, ఓట్లమిషన్‌లో సాంకేతిక మతలబు వల్ల జరిగిందని గట్టిగా నమ్ముతున్న అగాడీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈసీ వివరణతో సంతృప్తిచెందని వీరంతా ఇప్పుడు సుప్రీంకోర్టుకు పోవాలని నిర్ణయించుకున్నారు. సుప్రీంకోర్టు ఇటీవలే వ్యాఖ్యానించినట్టుగా ఓడినవారికి ఈవీఎం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఓ ఆత్మరక్షణ కవచం.

ఓటింగ్ మెషీన్లనూ, వాటిద్వారా జరిగిన ఎన్నికలను తిరస్కరిస్తూ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో విపక్ష ఎమ్మెల్యేలు ఒకటి రెండురోజుల పాటు ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండిపోయారు కూడా. బ్యాలెట్‌పేపర్లతో తిరిగి ఎన్నికలు జరగాలంటూ మర్కడ్‌వాడి గ్రామ ప్రజలు డిమాండ్ చేయడం, ఈవీఎం వ్యతిరేక విపక్ష ఉద్యమానికి అది కేంద్రం కావడం తెలిసిందే. ఈ గ్రామం ఉన్న అసెంబ్లీస్థానం శరద్‌పవార్ వర్గానికే దక్కినప్పటికీ, గెలిచిన అభ్యర్థికి కంచుకోటలాంటి ఈ గ్రామంలో మాత్రం అతడికి ప్రత్యర్థికంటే అతితక్కువ ఓట్లు పడ్డాయట. గ్రామస్తులంతా ప్రమాణంచేయడంతో, పవార్ వర్గం ఓ పాతికలక్షలు ఖర్చుపెట్టి మళ్ళీ అక్కడ బ్యాలెట్ ఓటింగ్ జరపడం, అధికారులు అడ్డుకోవడం, పోలీసుల దాడి, కర్ఫ్యూ ఇత్యాది పరిణామాలతో ఈ గ్రామానికి బాగా పేరొచ్చింది. శరద్‌పవార్ అక్కడకు వెళ్ళి మర్కడ్‌వాడీని చూసి రాష్ట్రమంతా, ఇంకా చెప్పాలంటే దేశమంతా నేర్చుకోవాలనీ, ఈవీఎంలకు వ్యతిరేకంగా ఉద్యమించాలనీ ఉపన్యసించి వచ్చారు. ఆ చిన్నగ్రామం దేశస్థాయిలో ఈవీఎం వ్యతిరేక ఉద్యమాన్ని రగల్చాలన్నది పెద్దాయన ఆశ.

ఒకపక్క ఓట్లమెషీన్ ఎన్నికలను నమ్మబోమని అంటూనే, మరోపక్క తమకు విపక్షస్థానం ఇవ్వాలంటూ అగాడీ నేతలంతా అధికారపక్షాన్ని డిమాండ్ చేస్తున్నారు. విపక్షంగా గుర్తించాలంటే మీలో ఏ ఒక్కపార్టీకీ కనీసంగా ఉండాల్సిన పదిశాతం స్థానాలు రాలేదు కదా అని అధికారపక్షం అంటోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు అసలు ఓనర్లనూ, వారసులనూ పక్కకు నెట్టేసి, పార్టీలను చీల్చిన వారిని ఘనంగా ఆదరించిన విషయం తెలిసిందే. ఉద్ధవ్ ఠాక్రే సరేసరి, ఒకప్పుడు మహారాష్ట్రలో చక్రం తిప్పిన శరద్‌పవార్, కాంగ్రెస్‌లకు సైతం ప్రజలు ఈ ఎన్నికల్లో విపక్షహోదాకు సరిపడా 29స్థానాలు కూడా ఇవ్వలేదు. అత్యంత బల ప్రజాస్వామ్యం నిలవాలంటే విపక్షం ఉండాల్సిందే, సభలో మంచీచెడూ చర్చ జరగాల్సిందే అని ఓపక్కన అంటూనే అధికారపక్షం గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ స్పీకర్‌గా రాహుల్ నర్వేకర్ మరో రాకడ ఇటువంటి అనేకానేక అంశాల్లో బీజేపీ చక్కని ఎత్తులు వేయడానికి ఉపకరిస్తుంది. ఆ హోదా ఇచ్చేదీ లేనిదీ, ఇస్తే ఏ పార్టీకి, ఏ నాయకుడికి ఆ కిరీటం దక్కాలన్నది నర్వేకర్ తొలిగా తేల్చబోయే సమస్య. ఆయన ఘనమైన గతం తెలిసిందే కనుక, భవిష్యత్తులో వచ్చిపడే చిక్కు సమస్యలను కూడా సునాయాసంగా పరిష్కరించగలడని బీజేపీ నమ్మకం. రెండేళ్ళక్రితం తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతూనే స్పీకర్‌స్థానంలో కూచున్న ఆయన అత్యంత సంక్షుభిత ఘట్టాల్లో బీజేపీని ఒడ్డునపడేశారు. అసలు శివసేన, అసలు ఎన్సీపీ ఎవరో సునాయాసంగా తేల్చేశారు. రెండుపార్టీలనుంచి పెద్ద ఎత్తున సాగిన బహిష్కరణలు, అనర్హతల లెక్కలను బీజేపీ సున్నితపు త్రాసులో తూచి, ఎవరూ అనర్హులు కారంటూ తేల్చి శిందే, అజిత్‌పవార్ కష్టానికి ఏమాత్రం నష్టం వాటిల్లకుండా చేశారు.

ఫడ్నవీస్ చల్లగా నాలుగుకాలాలపాటు రాజ్యం చేసుకోవడానికి నర్వేకర్ వంటి విశ్వాసపాత్రుడు అవసరం. స్పీకర్ పోస్టు ఇవ్వమని ఏక్‌నాథ్ శిందే, అజిత్‌పవార్ అడిగినా బీజేపీ ఒప్పుకోలేదని, మరో నాలుగురోజుల్లో జరిగే మంత్రివర్గ విస్తరణలో వీరికి దక్కే శాఖలను బట్టి పైచేయి ఎవరన్నది పూర్తిగా తేలిపోతుందనీ అంటున్నారు. హోం కావాలన్న శిందే ఇప్పటికే చల్లారినప్పటికీ, ఆర్థికం కోసం అజిత్‌పవార్ పట్టుబడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర బీజేపీలో ఫడ్నవీస్‌కు ఎదురులేదు. కానీ, కష్టపడి చీల్చితెచ్చుకున్న బలం భవిష్యత్తులో తనకు గానీ, పార్టీకి గానీ ప్రమాదం తెచ్చిపెట్టకుండా అతిజాగ్రత్తగా అడుగులువేయాల్సిన బాధ్యత ఆయనమీద ఉంది.

సిరియాలో ప్రస్తుత పరిణామాలు షియా– సున్నీ తెగల మధ్య అధికార పోరాట పర్యవసానాలు ఎంత మాత్రం కాదు. అవి మూమ్మాటికీ గ్యాస్ విపణిపై పట్టు కోసం జరుగుతున్న పోరాటం విపరిణామాలే. చమురు, సహజ వాయువు నిల్వలు అపారంగా ఉన్న అరబ్బు నేల నుండి ఐరోపాకు వెళ్లే మార్గంలో భౌగోళికంగా అనువైన ప్రదేశంలో సిరియా ఉండడంతో అక్కడ అస్మదీయ పాలకులు అవసరం.

చమురు విపణిపై పోరులో సిరియా బలి

ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నేటి ఉక్రెయిన్ వివాదం వరకు రష్యాకు విశ్వసనీయ మిత్రుల జాబితాలో అగ్ర స్థానంలో ఉన్న దేశం సిరియా. వామపక్ష భావజాలం కంటే సిరియా భౌగోళిక స్థానమే వాణిజ్య అవసరాలరీత్యా ఆ అరబ్ దేశానికి రష్యాను అత్యంత సన్నిహితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా రష్యా ప్రభావం అంతరించిపోయిందని భావించిన క్రమంలో దశాబ్దం క్రితం సిరియాలో అమెరికా అనుకూల తిరుగుబాటుదారుల కారణాన బషార్ అల్ అస్సాద్ సర్కారు పతనపు అంచుకు చేరింది. రష్యా ఆ కీలక సమయంలో బషార్ ప్రభుత్వానికి సైనికంగా చేయూతనిచ్చి నిలబెట్టింది. తద్వారా తాము ఇంకా అమెరికాకు అడ్డుకట్ట వేయగలుగుతామని ప్రపంచానికి రష్యా సంకేతాలు పంపించింది.

అత్యధికులు అభిప్రాయపడుతున్నట్లుగా సిరియాలో ప్రస్తుత పరిణామాలు షియా– సున్నీ తెగల మధ్య అధికార పోరాట పర్యవసానాలు ఎంత మాత్రం కాదు. అవి, మూమ్మాటికీ గ్యాస్ విపణిపై పట్టు కోసం జరుగుతున్న పోరాటం విపరిణామాలే. చమురు, సహజ వాయువు నిల్వలు అపారంగా ఉన్న అరబ్బు నేల నుండి ఐరోపాకు వెళ్లే మార్గంలో భౌగోళికంగా అనువైన ప్రదేశంలో మధ్యధరా సముద్రం తీరంలో సిరియా ఉండడంతో అక్కడ అస్మదీయ పాలకులు అవసరం.

టర్కీ, ఐరోపా ఖండం తమ చమురు, గ్యాస్ అవసరాల కొరకు రష్యాపై ఆధారపడుతున్నాయి. వాటి ఈ అనివార్యతను రష్యా తన వజ్రాయుధంగా వాడుకొంటోంది. అమెరికా, ఐరోపా దేశాలు రష్యా అధిపత్యాన్ని నిర్మూలించి దాని ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో బెలరూస్, ఉక్రెయిన్ ఉద్రిక్తతలు

గల్ఫ్ లేఖ

తెరపైకి వచ్చాయి. రష్యా తరహా భారీ నిక్షేపాలు ఉన్న ఇరాన్, ఖతర్ దేశాలు కూడ గ్యాస్ విపణిపై పట్టుకొరకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా ఆంక్షల కారణాన ఇరాన్ వెనుకంజలో ఉండగా ఖతర్ మాత్రం ముందుకు దూసుకెళ్లుతోంది. ఖతర్ నుండి పైపు లైను ద్వార ఐరోపాకు చమురు, గ్యాస్ సరఫరాలకు సిరియా సహకారం అనివార్యం. అమెరికా, ఐరోపా, టర్కీలు ఖతర్‌కు ఈ విషయమై బాసటగా నిలుస్తున్నా సిరియా అందుకు అంగీకరించడం లేదు. తమకు అన్ని విధాలుగా అండగా ఉంటున్న రష్యా ఇరాన్‌లను కాదని ఖతర్ ప్రతిపాదనకు సిరియా అంగీకరించలేదు, అధ్యక్షుడు బషార్ అల్ అస్సాద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ఇది ఒక ప్రధాన కారణమని విశ్లేషకుల అభిప్రాయం.

సిరియాలోని మధ్యధరా సముద్రతీర ప్రాంతాలలో నౌకా, వైమానిక దళాల స్థావరాలను నెలకొల్పుకోవడం ద్వారా ఐరోపాకు అవసరమైన



చమురు సరఫరా జరుగుతుండే సముద్ర మార్గాలపై తన పట్టును పటిష్ఠపరచుకోవడానికి రష్యా ప్రయత్నిస్తోంది. అలాగే కీలక జలాల్లో నాటో, అమెరికాలను నిలువరించడం, తమపై తిరగబడ్డ ఉక్రెయిన్, బెలరూస్ దేశాల భూభాగాల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయంగా తన గ్యాస్, చమురు సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి రష్యా సంకల్పించింది. ఇందుకు మిత్ర దేశమైన సిరియా సముద్ర తీరం రష్యాకు కలిసి వచ్చింది. చమురు ఉత్పాదక దేశమైన రష్యా మధ్యధరా తీరంలోని లిబియాతో సహా అవతలి వైపు ఉన్న చమరు ఉత్పాదక అరబ్బు దేశాలలో కూడ తన పలుకుబడిని పెంచుకున్నది. సిరియాలో బషార్ అల్ అస్సాద్ ప్రభుత్వాన్ని పరిరక్షించడం ద్వారా రష్యా తన సైనిక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకున్నది. కీలక ప్రపంచ వ్యవహారాలలో తన పాత్ర, అభీష్టం కూడా ఉంటుందని దౌత్యపరంగా సూచనలు పంపింది.

బషార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దానికి పైగా పోరాడుతున్న తిరుగుబాటుదారులకు అమెరికా, టర్కీ, కొన్ని గల్ఫ్ దేశాలు బాసటగా ఉన్నాయి. అయినా తిరుగుబాటుదారులను రష్యా వైమానిక దళాల సహాయంతో నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం ద్వారా తన అధికారాన్ని బషార్ కాపాడుకోగలిగారు. ఇరాన్, దాని అనుకూల సాయుధ షియా బృందాలు కూడా బషార్‌కు పూర్తిగా మద్దతుగా నిలిచాయి. బయటి నుండి ఎంత మద్దతు పొందినా స్థానికంగా తిరుగుబాటుదారులతో సంధికి కాదు కదా కనీసం చర్చలు జరిపేందుకు సైతం సిరియా ప్రభుత్వం ముందుకు రాలేదు. తిరుగుబాటును బషార్ ప్రభుత్వం పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చిందని అత్యధికులు భావించారు, బషార్‌ను గద్దె దించడం వీలుకాదని చాలా మంది విశ్వసించారు. అయితే అనూహ్యంగా గత పక్షం రోజులలో ఎలాంటి ప్రతిఘటన లేకుండా సిరియా సైనిక దళాలు స్వచ్ఛందంగా తిరుగుబాటుదారులకు లొంగిపోవడంతో బషార్ ప్రభుత్వం పతనమయింది. ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం.

సరే, బషార్ దేశం నుంచి పరారయ్యారు. ఇప్పుడు సిరియాను ఎవరు ఏ విధంగా పాలించనున్నారు? ఇదే అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సద్దాం హుస్సేన్ తర్వాత ఒకప్పటి అరబ్బు అగ్రరాజ్యం, విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన ఇరాఖ్ విచ్ఛిన్నమై ఉగ్రవాదానికి ఊతమైంది. పొరుగున ఉన్న ఇరాఖ్‌లో వలే సిరియాలో కూడ క్రైస్తవులు, షియా, సున్నీ తెగల ముస్లింలు కలిసి మెలిసి నివసిస్తున్నారు. ఈ రెండు దేశాలలోనూ సిరియా క్రైస్తవుడయిన మైఖెల్ అఫ్లాఖ్ స్థాపించిన (వామపక్ష భావజాల ప్రభావిత) బాత్ పార్టీ సైనిక కమాండర్లు సద్దాం హుస్సేన్, బషార్ అల్ అస్సాద్ తండ్రి హాఫెజ్ అల్ అస్సాద్‌లు ఇరాఖ్, సిరియా దేశాధినేతలుగా సుదీర్ఘకాలం పాలించారు. వర్గ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలలకు బాత్ పార్టీ భావజాలం ప్రాధాన్యమిస్తుంది.

అరబ్బులలో అభ్యుదయ భావాలు కలిగి లౌకిక వాదం వర్ధిల్లిన ఏకైక దేశం సిరియా కూడా ఎట్టకేలకు ఇస్లామిక్ మతఛాందసవాదుల చేతికి చిక్కిందని చెప్పవచ్చు. అల్‌ఖైదా ఒడిలో పెరిగిన ఉగ్రవాది అబూ మోహమ్మద్ అల్ జ్వాలనీ ఆచూకీ తెలిపితే పది మిలియన్ డాలర్ల పారితోషికాన్ని ఇస్తామని అమెరికా ఒకప్పుడు ప్రకటించింది. మరి అదే జ్వాలనీ నేడు సిరియాను పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకుంటే పరాయి దేశం వ్యవహారంతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రక్కకు తప్పుకున్నది! ఇది, ప్రపంచ అగ్రరాజ్య ద్వంద్వ నీతిని ప్రతిబింబిస్తుందనడంలో సందేహం లేదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రహసనంగా మారుతున్న పార్లమెంట్



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఒక గుర్రానికీ, దుప్పికీ మధ్య ఘర్షణ జరుగుతుంది. దుప్పితో నెగ్గలేని గుర్రం వేటగాడి వద్దకు వెళ్లి సహాయం కోరుతుంది అందుకు సరేనన్న వేటగాడు నీ దవడల మధ్య ఇనుప కడ్డీ పెట్టి కళ్లెం బిగించేందుకు, నీ వీపుపై జీను వేసి నేనెక్కి నడిపించేందుకు అనుమతించు చాలు. నీ శత్రువును వెంటాడి వేటాడొచ్చు.. అని అంటాడు. ఈ షరతులకు గుర్రం అనుమతిస్తుంది. చివరకు దుప్పినైతే వేటగాడు వేటాడి చంపుతాడు కాని గుర్రాన్ని అలాగే అదుపులో ఉంచుకుంటాడు. దుప్పిమీద కోపంతో వేటగాడి సహాయం కోరితే జీవితాంతం వేటగాడి అదుపులో ఉండాల్సి వస్తోందని గుర్రం బాధపడుతుంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం గ్రీసులో ఒక బానిస చెప్పిన పిట్టకథల్లో ఇదొకటి.

'ప్రజాస్వామ్యాలు ఎలా మరణిస్తాయి' (హౌ డెమాక్రసీస్ డై) అన్న పుస్తకంలో హార్వార్డ్ యూనివర్సిటీకి చెందిన రాజనీతి శాస్త్రజ్ఞులు స్టీవెన్ లెవిట్స్కీ, డేనియల్ జిబాల్ట్ ఈ పిట్టకథను ఉటంకిస్తూ ఎన్నికైన నేతలు తమ అధికారాన్ని పెంచుకునేందుకు ప్రజాస్వామ్యాన్ని ఎలా హరిస్తారో వివరించారు. అమెరికా ప్రజాస్వామ్యంపై డోనాల్డ్ ట్రంప్ ప్రభావాన్ని కూడా ఈ పుస్తకం వివరిస్తుంది. పరస్పర సహనం, గౌరవం అధికార ప్రతిపక్షాలు ఎలా కోల్పోతాయో ఈ రచయితలు వివరించారు. వెనిజులా, రష్యా వంటి లాటిన్ అమెరికా, యూరప్ దేశాల్లో పరిస్థితులను కూడా వారు తమ వాదనలను సమర్థించుకునేందుకు ఉదహరించారు.

భారతదేశంలో కూడా పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అనిపించదు. గత పది రోజులుగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలను చూస్తుంటే అసలు ప్రజాస్వామ్య ప్రక్రియను కొనసాగించేందుకు ఎవరికైనా ఆసక్తి ఉన్నదా అనిపిస్తుంది. 18వ లోక్‌సభ ప్రారంభమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ తన ప్రభుత్వం సభలోనూ, బయటా ఏకాభిప్రాయం సాధించేందుకు కృషి చేస్తుందని, కాని ప్రతిపక్షం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ప్రజలు ఆశిస్తారని, సభలో హంగామా సృష్టించడం వారికి నచ్చదని చెప్పారు. నవంబర్ 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా మోదీ దాదాపు ఇదే వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తిరస్కరించిన గుప్పెడు మంది తమ స్వార్థపర రాజకీయ ప్రయోజనాలకోసం పార్లమెంట్‌ను భగ్నం చేయాలని చూస్తున్నారని కొత్త ఆలోచనలతో, ఉత్సాహంతో వచ్చిన కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మోదీ వ్యాఖ్యలు ఎలా ఉన్నప్పటికీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు, శీతాకాల సమావేశాలు రెండూ పెద్దగా జరగలేదు. బీజేపీని 240 సీట్లకు కుదించామన్న ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తొలి సమావేశాల్లో కలిసికట్టుగా సభలో తమదే పై చేయి అన్నట్లుగా వ్యవహరించాయి. కాని బడ్జెట్ సమావేశాలకూ శీతాకాల సమావేశాలకూ మధ్య జరిగిన హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఘన విజయాలు సాధించడంతో ప్రతిపక్షాల నైతిక సె[illegible]ం దెబ్బతిన్నది. కాని సరిగ్గా శీతాకాల సమావేశాలకు ఒకటి రెండు రోజుల ముందు అదానీ రాష్ట్ర ప్రభుత్వాలకు ముడుపులు చెల్లించారని అమెరికన్ ప్రాసిక్యూటర్లు ఆరోపించడం ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఉత్సాహాన్ని రేకెత్తించింది. దీనితో అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని వారు డిమాండ్ చేస్తూ ఉభయ సభలను స్తంభింపచేయడం మొదలు పెట్టారు. రాజ్యాంగ దినోత్సవం, ఒకటి రెండు బిల్లులపై చర్చలు జరిగినప్పటికీ గత 15 రోజులుగా పార్లమెంట్‌లో పెద్దగా కార్యకలాపాలు జరగలేదు.

అసలు పార్లమెంట్‌లో జరుగుతున్నది ప్రజలు గమనిస్తున్నారా? ఎంతమందికి పార్లమెంటరీ కార్యకలాపాల పట్ల ఆసక్తి ఉన్నది? జాతీయ స్థాయిలో ఢిల్లీలో కాలుష్యం, మహారాష్ట్రలో దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణస్వీకారం, ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన, సిరియాలో తిరుగుబాటు వంటి వార్తలకు వచ్చిన ప్రాధాన్యం కూడా పార్లమెంట్ సమావేశాలకు రావడం లేదు. పార్లమెంట్‌లో ఎంపీలు లిఖిత పూర్వకంగా అడిగే ప్రశ్నల్లో, మంత్రులు ఇచ్చే జవాబుల్లో పస కనబడడం లేదు. అంతా యాంత్రికంగా, మొక్కుబడిగా జరుగుతున్నట్లు కనపడుతోంది. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా పార్లమెంట్‌లో అద్భుతమైన ప్రసంగాలు కానీ, చర్చలు కానీ జరిగిన దాఖలాలు లేనే లేవు. ఒకప్పుడు హేమాహేమీలైన నేతలు మాట్లాడుతుంటే మీడియా, అతిథుల గ్యాలరీలు కిక్కిరిసిపోయి కనిపించేవి. ఇప్పుడు పార్లమెంట్ గ్యాలరీలు మీడియా ప్రతినిధులు లేక వెలవెలబోతున్నాయి. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, అధిక దూరం నడవాల్సి రావడం, పార్లమెంట్‌లో చర్చలు జరగకపోవడం వల్ల మీడియా ప్రతినిధులు ఎప్పుడో కాని వెళ్లవలసిన అవసరం కూడా కనపడడం లేదు. మొదటి లోక్‌సభ సగటున ఏడాదికి 135 రోజులు సమావేశమయితే రాను రానూ ప్రతి లోక్‌సభ సమావేశాలు తగ్గిపోతూ వస్తున్నాయి. 17వ లోక్‌సభ కేవలం 55 రోజుల పాటే సమావేశమైంది. పార్లమెంట్‌లో ఆమోదించే అనేక బిల్లులు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కాని వాటి గురించి కూడా పార్లమెంట్‌లోనూ, బయటా జరగాల్సిన చర్చ జరగడం లేదు. చర్చ లేకుండా వాటిని ఆమోదించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. 17వ లోక్‌సభలో 35 శాతం బిల్లులపై కేవలం గంటలోపే చర్చ జరిగి ఆమోదం పొందాయి. 18వ లోక్‌సభ ముగిసే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు.

అసలు 'మోదీ అదానీ ఏక్ హై' అని పార్లమెంట్‌లో నినాదాలు చేస్తూ, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న ప్రతిపక్షాలకు మీడియాలోనూ, బయటా ఎంత ప్రాధాన్యత లభిస్తోంది? అదే సమయంలో కశ్మీర్ స్వతంత్రతను సమర్థించిన అమెరికన్ పారిశ్రామికవేత్త జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని బీజేపీ నేతలు చేస్తున్న వాదనలను ఎంత మంది పట్టించుకుంటున్నారు? నిజానికి ఈ అంశాలు ఎన్నికల ప్రచారంలోనూ చర్చకు వచ్చాయి కాని ఈ ఆరోపణల ఆధారంగా ప్రజలు ఓటింగ్ చేశారని చెప్పేందుకు ఖచ్చితమైన ఆధారాలు ఏమీ లేవు. కాని పార్లమెంట్ సమావేశాల సమయంలోనే వీటిని ప్రస్తావించి సభను భగ్నం చేసేందుకు ఇరు పక్షాలు ఎందుకు పూనుకుంటున్నాయి?


నిజానికి పార్లమెంట్ సజావుగా జరగాలని అధికార ప్రతిపక్షాల్లో ఎవరు అనుకుంటున్నారో చెప్పడం కష్టం. ఉభయ పక్షాలూ తాము అధికారంలో లేనప్పుడు పార్లమెంట్ ప్రతిష్టంభనను ఆయుధంగా వాడుకున్నవారే. 1987లో బోఫోర్స్ కుంభకోణంపై ప్రతిపక్షాలు 45 రోజుల పాటు సభ స్తంభించిపోగా 2010లో శీతాకాల సమావేశాలు మొత్తం 2జీ కుంభకోణంపై అట్టుడికిపోయాయి. 2012లో బొగ్గు కుంభకోణంపై ఆరు రోజుల పాటు సభలు జరగలేదు. అప్పుడు భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సమావేశాలను స్తంభింపచేసేందుకు వెనుకాడలేదు. 'పార్లమెంట్‌ను స్తంభింపచేయడం ప్రజాస్వామ్యానికి మంచిది. అదేమంత అప్రజాస్వామికం కాదు' అని రాజ్యసభలో ప్రతిపక్ష నేత అరుణ్ జైట్లీ నాడు వ్యాఖ్యానించారు. 'పార్లమెంట్‌ను సరిగ్గా పనిచేసేందుకు అనుమతించకపోవడం కూడా ప్రజాస్వామ్య లక్షణమే' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ కూడా వ్యాఖ్యానించారు. 2001లో తెహెల్కా కుంభకోణంపై కూడా కాంగ్రెస్ 17 రోజులు పార్లమెంట్‌ను స్తంభింపచేసినప్పుడు కూడా తన్ను తాను సమర్థించుకుంది. ఇప్పుడు కూడా పార్లమెంట్ ప్రతిష్టంభనను సమర్థించుకుంటోంది.

నిజానికి బోఫోర్స్, హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణం 2జీ కుంభకోణాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని నియమించిన తర్వాత సభలు సజావుగా సాగాయి. జేపీసీలకు తమ పార్టీ సభ్యులే చైర్మన్లుగా ఉంటారని, వాటి ద్వారా ప్రభుత్వాలు క్లీన్ చిట్ ఇప్పించుకోవడం సాధ్యమని తెలిసినప్పటికీ ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఎలాంటి పట్టువిడుపులకూ ఆస్కారం కల్పించడం లేదు. అదే సమయంలో ప్రతిపక్షాలు ఒకే అంశంపై చర్చించాలని పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్‌కు ఒప్పుకోనప్పుడు ఇతర అంశాలపైన అయినా చర్చించేందుకు అవి ముందుకు రావడం లేదు. ప్రభుత్వమే ఈ ప్రతిష్టంభనకు కారణమని కొత్తగా సభ్యురాలైన కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ వాద్రా కూడా విమర్శించారు. ఎవరూ వెనక్కు తగ్గేందుకు సిద్ధంగా లేనందువల్లే ఈ పరిస్థితి తలెత్తుతోంది. గతంలో ఇందిరాగాంధీ తన ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి విదేశీ శక్తులు కారణమని తరుచూ ఆరోపించేవారు ఇప్పుడు బీజేపీ కూడా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విదేశీ శక్తులు కుట్ర చేస్తున్నాయని ఆరోపిస్తోంది.

దీనివల్ల కొన్ని అవాంఛనీయమైన పరిణామాలు జరుగుతున్నాయి. సోనియాగాంధీకి విదేశీ నిధులపై బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, ఇతర ఎంపీలు సభలో ప్రకటనలు చేయడాన్ని అనుమతించడంతో పాటు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రతిపక్షాలపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం, మణిపూర్, రైతుల నిరసనపై నోటీసులను తిరస్కరించడం ఒక ఎత[illegible] రాజ్యసభ చైర్మన్‌పైనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష నేతలు నిర్ణయించడం రాజకీయాలను మరింత అనారోగ్యకరంగా మార్చాయి. కాంగ్రెస్ వైఖరి రాజ్యాంగానికే అవమానమని జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. గతంలో వెంకయ్యనాయుడు రాజ్యసభ చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రతిపక్షాలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి వారిని శాంతిపచేసేవారు. ఇప్పటి రాజ్యసభ చైర్మన్ అధికార పార్టీ నేతల కన్నా కటువుగా మాట్లాడుతున్నట్లు కనపడుతోంది. అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ జరిగినా ప్రతిపక్షాలు నెగ్గే అవకాశం లేదు అయినప్పటికీ పెద్దల సభ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించడం, దానిపై చర్చ జరగడం ఏ మాత్రం ఆరోగ్యకరం కాదు. ఇలా జరగడం పార్లమెంట్ చరిత్రలో మొదటిసారి. అధికార, ప్రతిపక్షాల మధ్య సంబంధాలు ఇంత విషపూరితంగా మారేందుకు ఎవరు కారణం? 18వ పార్లమెంట్ తొలి రెండు సమావేశాలే ఇలా జరిగితే రానున్న అయిదు సంవత్సరాలు ఎంత దారుణంగా మారతాయో చెప్పలేము.

భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడం అనేది దేశ పాలక ప్రతిపక్షాల చేతుల్లో లేదని రోజురోజుకూ స్పష్టమవుతోంది. ఏ ఒక్క రాజకీయ పార్టీ, ఏ ఒక్క రాజకీయ నేతకూ ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం సాధ్యం కాదు. ప్రజాస్వామ్య ఆలయమైన పార్లమెంటు సమావేశాలు, చర్చలు హాస్యాస్పదంగా, విషాదంగా మారకుండా చూడడం ప్రజల బాధ్యత.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



పార్లమెంట్‌లో ఎంపీలు లిఖిత పూర్వకంగా అడిగే ప్రశ్నల్లో, మంత్రులు ఇచ్చే జవాబుల్లో పస కనబడడం లేదు. అంతా యాంత్రికంగా, మొక్కుబడిగా జరుగుతున్నట్లు కనపడుతోంది. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా పార్లమెంట్‌లో అద్భుతమైన ప్రసంగాలు కానీ, చర్చలు కానీ జరిగిన దాఖలాలు లేనే లేవు. 17వ లోక్‌సభ (2019–24)లో 35 శాతం బిల్లులు కేవలం గంటలోపు చర్చతోనే ఆమోదం పొందాయి. 18వ లోక్‌సభ ముగిసే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు.

పోలవరం: రివర్స్ నుంచి సాకారం దిశగా..!

2004లో పోలవరం నిర్మాణం ప్రారంభమైనా, 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాకే, నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో పనులు శరవేగంగా జరిగాయి. 2020 ఫిబ్రవరి 27 నాటికి పోలవరం ప్రధాన ఆనకట్ట నిర్మాణ పనులలో 69.54 శాతం పూర్తయ్యాయని లోక్‌సభకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి తెలిపారు. మిగిలిన పనులను 'ఇరిగేషన్ కాంపోనెంట్' (మిగిలిన ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, భూసేకరణ, ఆర్‌ఆర్ ప్యాకేజీ వ్యయంతో సహా) కింద కేంద్రమే భరిస్తుందని కూడా సమాచారం ఇచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు నిర్మాణం 2019 నుంచి అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) పర్యవేక్షణలో జరుగుతున్న పోలవరం నిర్మాణ పనులలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ గుత్తేదారును మార్చారు. నిజానికి ప్రాజెక్టు నాణ్యతా నియంత్రణ, డిజైన్ల అంశాలు, పర్యవేక్షణ, అనుమతులకు సంబంధించిన అంశాలు పీపీఏ అధీనంలో ఉంటాయి. పోలవరం గుత్తేదారును మారిస్తే ఎలాంటి సమస్యలు వస్తాయో వివరిస్తూ కేంద్ర జలశక్తి శాఖ, పీపీఏ... జగన్ ప్రభుత్వానికి పదేపదే లేఖలు రాసి హెచ్చరించినా, పెడచెవిన పెట్టి 2019లో కొత్త గుత్తేదారు మేఘా సంస్థతో ఒప్పందం చేసుకుని, రివర్స్ టెండర్ ద్వారా ఖజానాకు రూ.628 కోట్లు మిగిల్చినట్లు ప్రచారం చేసుకున్నారు. కాని ఆ తరువాత పని విలువను క్రమంగా పెంచి మొదట్లో ఒప్పందం చేసుకున్న రూ.1548.12 కోట్ల పనుల విలువను ఏకంగా రూ.4637.09 కోట్లకు చేర్చి ప్రభుత్వ ఖజానాపై వేల కోట్ల భారాన్ని మోపారు.

సంక్లిష్టమైన పోలవరం నిర్మాణానికి డిజైన్ల పరంగా, సాంకేతికంగా, నిర్దేశిత బాధ్యతతో విధులు నిర్వహించే అనుభవం ఉన్న అధికార బృందం కీలకం. సరైన సాంకేతికతలను ఉపయోగించి ప్రతి పనిని పకడ్బందీగా పర్యవేక్షించాలి. 2027 లోపు పోలవరం నిర్మాణం సాకారం కావాలంటే ప్రతి అంశంలో ప్రభుత్వం సునిశితంగా వ్యవహరించాలి.

2020 జనవరి 24న పీపీఏ 11వ సమావేశంలో పునరావాస కమిషనర్, పోలవరం చీఫ్ ఇంజనీర్ కలిసి 2020 జూన్‌లోగా కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నాటి పోలవరం అథారిటీ సీఈవో స్పష్టం చేశారు. తరువాత 2020 జూన్ నాటికి +35.5 మీటర్ల స్థాయికి కాఫర్ డ్యాం నిర్మించేలా పునరావాసం పూర్తి చేయాలని కూడా పోలవరం అథారిటీ 12వ సమావేశంలో పేర్కొన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చాలినంత సమయం ఉన్నా ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో కలిపి మిగిలిన 60 లక్షల క్యూబిక్ మీటర్ల పనిని పూర్తి చేయలేదు. వరదల కన్నా ముందే డయాఫ్రం వాల్ నిర్మించిన ప్రాంతంలో ఇసుకతో నింపి, ఒక బంప్‌లా.. స్పీడ్ బ్రేకర్‌లా తయారు చేయాలని పాజెక్టు అథారిటీ సూచించినా, ఆ రక్షణ చర్యలను రాష్ట్ర అధికారులు విస్మరించారు. అసలు కొత్త గుత్తేదారు మేఘా 2019 మే నుంచి 2020 జూన్ వరకు పనులే ప్రారంభించలేదు. దాంతో 2020 ఆగస్టు–అక్టోబర్ మధ్య వచ్చిన వరదలతో డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని నీతి ఆయోగ్ నియమించిన హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం స్పష్టం చేసింది.



దిగువ కాఫర్ డ్యాం సకాలంలో నిర్మించలేకపోయారని పీపీఏ, ఎగువ కాఫర్ డ్యాంలో గ్యాపులు సకాలంలో పూడ్చి ఉంటే ఇంత నష్టం జరిగివుండేది కాదని తృతీయ పక్షంగా ఉన్న ఐఐటీ నిపుణులు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. గుత్తేదారు మార్పు వల్ల నిర్మాణ పనులలో ఏర్పడిన దీర్ఘ విరామంతో వరుస సమస్యలు ఎదురయ్యాయి. 2023 జూన్‌లో రూ.80 కోట్లతో నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. గైడ్‌బండ్ కుంగడానికి అందులో భాగంగా చేపట్టిన నిర్మాణాల లోపమే కారణమని పాండ్యా కమిటీ తేల్చింది. ఎగువ కాఫర్ డ్యాంలో ఉన్న గ్యాపులను సకాలంలో పూడ్చనందువల్ల, ప్రధాన డ్యాం నిర్మించాల్సిన చోట పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. చివరకు వరదల వల్ల డయాఫ్రం వాల్ ధ్వంసమై, ప్రాజెక్టు సంక్షోభంలో కూరుకుపోయింది.

పోలవరం వద్ద ప్రతి ఏడాది సముద్రంలో వృథాగా కలుస్తున్న మూడు వేల టీఎంసీల గోదావరి జలాలలో కొంతమేర పోలవరం డ్యాంకు మళ్లించి, 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేస్తే 30.7 లక్షల ఎకరాలకు సాగునీరు, 7.2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 900 మె.వా విద్యుదుత్పత్తి, గ్రేటర్ విశాఖ, అనకాపల్లి పట్టణాలు, 540 గ్రామాలలోని సుమారు 46.50 లక్షల ప్రజలకు తాగునీరు అందుతుంది. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగల పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, అధికారుల పనితీరు వల్ల నాలుగు సీజన్లు నష్టపోయామని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ స్పష్టం చేశారు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తుకు నీరు నిల్వ చేయాలంటే ముందుగా 8 మండలాలు, 90 రెవెన్యూ గ్రామాల్లోని 172 ఆవాసాలను ఖాళీ చేయించాలి. వీరికి పునరావాస ప్యాకేజీ అమలు చేయడంతో పాటు అవసరమైన సౌకర్యాలతో ప్రభుత్వం కాలనీలు నిర్మించి, నిర్వాసితులను తరలించాలి. తొలిదశలో తరలించాల్సిన మొత్తం 38,060 కుటుంబాలకు గాను 12 వేల కుటుంబాలను తరలించారు. 48 చోట్ల ప్రారంభించిన 19 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం గత సర్కారు హయాంలో నిలిచిపోయింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొత్త డీపీఆర్ ఆమోదించి, అడ్వాన్సు నిధులు విడుదల చేయడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులతో పాటు పునరావాస కాలనీల నిర్మాణం ఊపందుకుంది. రహదారులు భవనాల శాఖ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, ఏపీఈడబ్ల్యూఐసీ, రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పోలవరాన్ని ఆనుకుని ఉన్న వివిధ ప్రాంతాల్లో పునరావాస కాలనీలు నిర్మిస్తున్నారు. ఇదిలావుండగా పోలవరం ప్రాజెక్టులో కేంద్ర అనుమతులు ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన రూ.984.44 కోట్ల బిల్లులను ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించింది.

సంక్లిష్టమైన పోలవరం నిర్మాణానికి డిజైన్ల పరంగా, సాంకేతికంగా, నిర్దేశిత బాధ్యతతో విధులు నిర్వహించే అనుభవం ఉన్న అధికార బృందం కీలకం. సరైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ప్రతి పనిని పకడ్బందీగా పర్యవేక్షించాలి. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నిర్మాణ, పర్యవేక్షణ పరంగా తలెత్తిన అనేక లోపాల వల్ల పోలవరం నిర్మాణం అగమ్యగోచరంగా మారింది. గైడ్ బండ్ కుంగిన విషయంలో కేంద్ర జల సంఘంలో ఒక చీఫ్ ఇంజనీర్, ఒక డైరెక్టర్, ఒక డిప్యూటీ డైరెక్టర్‌పై చర్యలు తీసుకున్నారు. నిర్లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాలను పాటించకుండా, నిర్మాణ పనులను సవ్యంగా పర్యవేక్షించని అధికారులపై రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇప్పటి వరకు చర్యలు లేవు. 2027 లోపు పోలవరం నిర్మాణం సాకారం కావాలంటే ప్రతి అంశంలో ప్రభుత్వం సునిశితంగా వ్యవహరించాలి. ఆ దిశగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆశిద్దాం.

● లింగమనేని శివరామప్రసాద్

రాజ్యాంగ చర్చల ముందు సవాళ్లెన్నో!

రాజ్యాంగ దినోత్సవానికి అమృతోత్సవ సంవత్సరం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ వారం చెరో రెండు రోజుల పాటు రాజ్యాంగంపై చర్చ జరగబోతున్నది. సందర్భానికి తగ్గట్టుగా అర్థవంతమైన చర్చ జరిగి, దేశానికి పార్లమెంటు దిశా నిర్దేశం చేయగలదని ఆశ.

ఈ రాజ్యాంగం ఎంతో కాలం మనజాలదని నాటి ప్రపంచం భావించింది. ఒకవైపు దేశ విభజన జరిగి, మరోవైపు పేదరికం, నిరక్షరాస్యత, ప్రాంతీయ విభేదాలు పెచ్చరిల్లిన సమయంలో దేశ గమనాన్ని నిర్దేశిస్తూ రాజ్యాంగాన్ని తయారు చేసుకోవడం కత్తి మీద సాము అయ్యింది. విభిన్న భావజాలాలు గల మేధావులు, దేశభక్తులు కలిగిన రాజ్యాంగ నిర్మాణ సభ, ముసాయిదా రాజ్యాంగ కమిటీ, డా. అంబేడ్కర్ అధ్యక్షతన అత్యుత్తమమైన, ప్రపంచంలో పెద్దదైన లిఖిత రాజ్యాంగాన్ని అందించింది. పలుమార్లు లోతైన చర్చలు, దాదాపు రెండు వేల సవరణలు, తీవ్ర వాదోపవాదాలు జరిగినా చివరకు అందరి ఆమోదంతో అంతిమ ముసాయిదా తయారయ్యిందంటే దానికి కారణం ఆ పెద్దలు దేశ ప్రయోజనానికి, జాతి ప్రయోజనానికి పెద్దపీట వేస్తూ ఒక్క తాటిపై రాగలగడం వల్లనే. ఆ కష్టఫలమే ఏడు దశాబ్దాల పాటుగా దేశాన్ని మెరుగైన సమాజంగా నడిచే దారి చూపుతోంది. ఈ స్ఫూర్తిని పాటిస్తూ నేడు పార్లమెంటు చర్చించాల్సింది – రాజ్యాంగం ప్రాతిపదికగా దేశ ప్రయోజనాల్ని.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజ్యాంగ నిర్మాతలు భావించినట్టుగానే మన దేశానికి నప్పింది. చిన్న చిన్న సమస్యలు ఉన్నా విజయవంతంగా నడుస్తోంది. అయితే ఎన్నికల విధానం ధన ప్రభావంతో సామాన్యులకు అందకుండా తయారైంది. విప్ విధానంతో పార్టీలో సభ్యుల అభిప్రాయాలకు స్వేచ్ఛ తగ్గింది. అంతర్గత ప్రజాస్వామ్యం, ఫిరాయింపులు తదితర అంశాలపై చర్చ జరగాలి. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం మరింత బలపడుతూ వస్తోంది. బలమైన కేంద్రం మంచిదే కానీ రాష్ట్రాల్ని బలహీనం చేస్తూ పాలన కేంద్రీకృతం కారాదు. నూతన ఆర్థిక విధానాల వల్ల సంపద, ఆదాయం అతి తక్కువమంది చేతిలో కేంద్రీకృతమై, అధిక శాతం ప్రజల్ని పేదరికంలోకి దిగజారుస్తుంది. ప్రభుత్వం ఆర్థిక న్యాయం అందించే బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటోంది. ప్రభుత్వాలు చట్ట సభలకు జవాబుదారీ. కానీ చట్ట సభల్లో చర్చలే తగ్గిపోతున్నాయి. దొడ్డిదారిన పనులు చక్కబెట్టుకుంటున్నాయి. రాజ్యాంగ సంస్థలు, గవర్నర్, ఎన్నికల కమిషన్, స్పీకర్ కార్యాలయం లాంటివి నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కొన్నిసార్లు అలా జరగకపోయినా బాధ్యత వహించడం లేదు. న్యాయస్థానాలు ప్రజల విశ్వాసాన్ని నిలుపుకోవడంలో ముందున్నాయి. కానీ న్యాయమూర్తుల నియామకాలు, కూర్పుల్లో సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించడం లేదు. ఇలా చెప్పు పోతే ఎన్నో సవాళ్లు. అయినా లోతైన చర్చల ద్వారా పరిష్కారాలు దొరుకుతాయి. చూడాలే గానీ, ఈ సవాళ్లను అధిగమించడానికి రాజ్యాంగమే దారి చూపుతుంది. ప్రభువులైన ప్రజలు తమ అధికారాన్ని తెలుసుకోవాలి. తమకు రక్షణగా ఉన్న రాజ్యాంగం విలువని, దానిలోని విలువల్ని అర్థం చేసుకోవాలి. అందుకు పార్లమెంటులో జరిగే చర్చ దోహదపడగలదని ఆశిద్దాం.

– డి.వి.జి. శంకరరావు
మాజీ ఎంపీ, విజయనగరం



పోలీస్ ప్రతిభకు పట్టం

కమిషనరేట్‌లో ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టం

* త్వరలో అమలు చేయాలని అధికారుల సన్నాహాలు
* స్టేషన్ల పనితీరు మొత్తం డ్యాష్‌బోర్డు పైనే...
* డ్యాష్‌బోర్డులో కంప్లయన్స్, ఇన్వెస్టిగేషన్ కేటగిరీలు

చోరీ కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చింది?

బాలికపై లైంగిక దాడి కేసులో చార్జిషీటు ఫైల్ చేశారా?

స్టేషన్‌కు వచ్చిన పిటిషన్లలో మిగిలినవి ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి?

ప్రతినెల నిర్వహించే నేర గణాంకాల సమీక్షా సమావేశంలో అధికారులు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలను అడిగే ప్రశ్నలు ఇవి. ఇలా నిర్వహించే సమావేశాలకు ఎక్కువ సమయం పడుతున్నందున ఇలాంటి ప్రశ్నలు వేయకుండానే స్టేషన్ హౌస్ ఆఫీసర్ల నుంచి జవాబులు రప్పించే యోచనలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు ఉన్నారు. ఇందుకోసం కొత్తగా ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టం (ఐటీఎస్)ను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనిపై సమాలోచనలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లను ఈ ఐటీఎస్‌కు అనుసంధానం చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. పోలీసులకు నిరంతరం దర్యాప్తు, చార్జిషీటు దాఖలు విధులు ఉంటాయి. ఇవి కాకుండా ఉన్నతాధికారులకు అందిన పిటిషన్లు, నిత్యం స్టేషన్‌కు వచ్చే బాధితుల పిటిషన్లను పరిష్కరించాలి. ఈ పిటిషన్ల పరిష్కారం, వివిధ నేరాల్లో కేసుల ఛేదన, రికవరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలకు అధికారులు రివార్డులు ఇస్తుంటారు. ఇప్పటి వరకు ఆయా డివిజన్లు, జోన్ల అధికారులు పంపిన ప్రతిపాదనల ప్రకారం వాటిని అందజేస్తున్నారు. ఇక నుంచి ఐటీఎస్ ఇచ్చిన రేటింగ్‌ను బట్టి ఈ రివార్డులకు సిబ్బందిని ఎంపిక చేస్తారు.

ఐటీఎస్ అంటే..

ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టం.. ఇదొక డాష్‌బోర్డు. ఇందులో రెండు కేటగిరీలు ఉంటాయి. ఒకటి కంప్లయన్స్. రెండోది చార్జిషీట్స్. ఫిర్యాదులు, కేసులకు సంబంధించిన అంశాలన్నీ కంప్లయన్స్ కిందకు వస్తాయి. వివిధ కేసులకు సంబంధించి న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన చార్జిషీట్లు చార్జిషీట్స్ కేటగిరీలో ఉంటాయి. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్లకు రెండు విధాలుగా ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రతి సోమవారం కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వస్తున్నారు. వాటిని స్వీకరించిన అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు పంపుతున్నారు. ఈ ఫిర్యాదులను పరిష్కరించడానికి వారం రోజుల గడువు ఉంటుంది. ఇవి కాకుండా నిత్యం పోలీస్‌స్టేషన్‌కు వివిధ అంశాలకు సంబంధించి ఫిర్యాదుదారులు వస్తుంటారు. వాటిలో కొన్నింటిని కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరిస్తారు. మరికొన్నింటిపై కేసులు నమోదు చేస్తారు. వీటితోపాటు హత్యలు, లైంగికదాడులు, చోరీలు, దోపిడీలు, రోడ్డుప్రమాదాలకు సంబంధించి కేసులు నమోదు చేస్తారు. ఈ కేసులు ముందుగా కంప్లయన్స్ కేటగిరీలోకి వస్తాయి. దర్యాప్తు పూర్తయి నిందితులు అరెస్టయిన తర్వాత చార్జిషీట్స్ కేటగిరీలోకి వెళ్తాయి.

ఎన్టీఆర్ జిల్లాలో 28 పోలీస్‌స్టేషన్లు

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 28 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇవన్నీ సీసీటీఎన్ఎస్‌కు అనుసంధానమై ఉన్నాయి. ఈ పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, వాటి విచారణ, న్యాయస్థానాల విచారణలో ఉన్న కేసులు, వాటికి దాఖలు చేయాల్సిన చార్జిషీట్లు వంటి అంశాలపై అధికారులు ప్రతినెలా నేర గణాంక సమీక్షా సమావేశం నిర్వహిస్తుంటారు. పోలీసు కమిషనర్‌తోపాటు డీసీపీలు ఈ సమావేశంలో పాల్గొంటారు. అన్ని స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు హాజరవుతారు. కేసుల దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, రికవరీ వంటి అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరచిన వారికి అధికారులు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తారు. కనబరచని వారికి అక్షింతలు వేస్తారు. యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టుకు మార్కులు వేస్తారు.

సాఫ్ట్‌గానే పనితీరును పసిగట్టాలని నిర్ణయం

ఈ సమావేశాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందికి సమయం పడుతోంది. సమావేశాలు ప్రారంభించిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతున్నాయి. దీనితో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలకు సమయంతా ఇక్కడే గడిచిపోతుంది. సమయాన్ని ఎక్కువ సేపు వెచ్చించకుండా సాఫ్ట్‌గానే పనితీరును పసిగట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ఐటీఎస్‌ను

మిగతా 6లో..

మైండ్ మనీ గేమ్

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో దారుణాలు


రైతులు అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా ప్రొక్లెయిన్‌తో చేస్తున్న పనులు

రూ. 32.58 కోట్ల పనుల కోసం రూ.300 కోట్ల రైతుల ఆస్తికి ఎసరు!

* నాలుగింటితో పోయేదానికి 11 టవర్లకు పెంపు
* అడ్డగోలుగా అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్
* పాత్రధారి 'మేఘా'.. సూత్రధారి ఎన్‌హెచ్ ఆర్‌వో ఆఫీసు!
* ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ రూపొందించిన రైతులు
* తక్కువ నష్టం, వ్యయంతో పనులు పూర్తికి అవకాశం
* స్టే ఇచ్చినా ఆగని పనులు

విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణ పనుల వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైటెన్షన్ లైన్ల సమస్య పరిష్కారానికి జక్కంపూడి పంచాయతీ భూముల్లో నాలుగు ట్రాన్స్ మిషన్ టవర్లు వేస్తే సమసిపోయేదానిని పదకొండు టవర్లతో సమస్యను పెంచుతున్నారు. రెండు చోట్ల టవర్లను మార్చితే సరిపోయేదానికి.. రైతుల భూములు, ప్రజల ప్లాట్ల చుట్టూ అర్ధ చంద్రాకారంగా మలుపులు తిప్పుతున్నారు. రూ.32 కోట్ల పని కోసం రూ.300 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని కాలరాస్తున్నారు. ఈ మైండ్ అండ్ మనీ గేమ్‌కు పాత్రధారులు మేఘా సంస్థ నిర్వాహకులు అయితే, సూత్రధారులు మాత్రం ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు అధికారులు అని రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.


రహదారిపై రైతులను అడ్డుకుంటున్న ప్రత్యేక బలగాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /విజయవాడ రూరల్) : విజయవాడ వెస్ట్ బైపాస్ పనుల నేపథ్యంలో టవర్ల అలైన్‌మెంట్ మార్పు విషయంలో రైతుల అంగీకారం లేకుండానే వారి పొలాల్లో నుంచి అర్ధచంద్రాకారంలో 11 టవర్స్ వేసే విధంగా అలైన్‌మెంట్ ఖరారు చేసి, ఏకంగా పనులు కూడా మొదలు పెట్టారు. వందలాది మంది పారామిలటరీ పోలీసులను రంగంలోకి దించి మరీ పనులు చేస్తున్నారు. అడ్డుకున్న రైతులపై భౌతిక దాడులకు దిగుతూ అరెస్టులు చేస్తున్నారు. ఈ అర్ధచంద్రా కారపు అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేయాలనుకుంటే ఆయా భూములు కలిగిన రైతులతో సంప్రదించి వారికి సమాచారాన్ని తెలియపరిచి వారి అంగీకారాన్ని తీసుకున్న తర్వాతనే చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా రైతులకు విషయం తెలియకుండా, ప్లాట్లదారులకు తెలియపరచకుండా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేయటం మొదటి తప్పు. రైతుల భూములు, ప్రజల ప్లాట్లను తమ సొంత జాగీరులాగా వారి అనుమతు లేకుండా అడ్డగోలుగా పనులు చేస్తున్నారు. ఈ అలైన్‌మెంట్‌కు సంబంధించి టవర్ల పనులను కూడా ప్రస్తుతం బైపాస్ పనులను చేస్తున్న మేఘాకే అప్పగించారు.

రైతులపై మేఘా, పోలీసుల దాదాగిరీ!

ల్యాంకో తరఫున కాంట్రాక్టు సంస్థ మేఘా, కొత్తపేట పోలీసులు రైతుల మీద దాదాగిరీ చేస్తున్నారు. మేఘా సంస్థ రూ.32 కోట్ల పని కోసం రూ.300 కోట్ల విలువైన భూములు, ప్లాట్లు కలిగిన రైతులు, ప్రజలను ఇబ్బందులు పెడుతోంది. పోలీస్‌శాఖను అడ్డుపెట్టుకుని రైతులపై దౌర్జన్యం చేస్తోంది. కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐ కొండలరావు పూర్తిగా మేఘా సంస్థకు వకల్తా పుచ్చుకుని రైతులపై విరుచుకుపడుతున్నారు. సిబ్బందిని పెట్టించి మరీ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. కోర్టు స్టే ఇచ్చినా లెక్కలేనట్టుగా పనులు చేయించడం గమనార్హం. ఒక ప్రైవేటు సంస్థ కోసం సీఐ పడుతున్న ఆరాటంపై రైతులు తీవ్రంగా దుయ్యబడుతున్నారు. ఆందోళనకు వచ్చిన ప్రతిసారి తమపై దాడీ చేస్తూ, బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

మేఘా చేస్తున్న పనులపై ఎన్నో అనుమానాలు!?

అర్ధచంద్రాకారపు హైటెన్షన్ టవర్ల అలైన్‌మెంట్‌కు ఏపీ ట్రాన్స్‌కో నుంచి అధికారిక అనుమతులు ఉన్నాయా లేదా అన్నది కూడా అనుమానమే. ల్యాంకో లైన్స్‌కు ముందు ట్రాన్స్ కో హైటెన్షన్ లైన్స్, పవర్ గ్రిడ్ లైన్స్ (పీజీఎల్) లకు సంబంధించి పనులు చేపట్టారు. వాటి అలైన్‌మెంట్ల కాపీలపై ట్రాన్స్‌కో అధికారుల అధీకృత సంతకాలు ఉన్నాయి. ల్యాంకో అలైన్‌మెంట్‌పై ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల సంతకాలు లేకపోవడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరుస్తుంది. మరి ఈ పనిని ఎందుకు

మిగతా 6లో..

అలైన్‌మెంట్ మార్పులో స్కామ్!

* 'మేఘా' ప్రయోజనాల కోసం రైతులను నట్టేటముంచుతున్నారు
* టవర్ల పనులను రైతులతో కలిసి అడ్డుకున్న వైసీపీ నేత పోతిన మహేష్
* చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామంటున్న స్థానిక రైతులు

6లో

ఎన్టీఆర్ 2.. కృష్ణా 3

రాష్ట్ర స్థూల విలువ జోడింపులో ర్యాంకుల పంట

ఎన్టీఆర్ జిల్లా రూ.69,123 కోట్ల స్థూల విలువ (జీవీఏ - 5.65%) జోడింపు

కృష్ణాజిల్లా రూ.64,118 కోట్ల స్థూల విలువ (5.24%) జోడింపు

సేవా రంగంలో ఎన్టీఆర్‌కు 2వ, కృష్ణాకు 5వ స్థానం

పారిశ్రామిక రంగంలో ఎన్టీఆర్‌కు 5, కృష్ణాకు 16వ స్థానం

6లో

వసూల్ రాజాపై వేటు

మద్యం దుకాణాలకు టార్గెట్ పెట్టి మరీ ఈఎస్ టాస్క్‌ఫోర్సు సీఐ నిక్సన్ వసూళ్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

* ప్రత్యేక కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి
* విచారణలో నిజమని తేలడంతో చర్యలు తీసుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) కృష్ణాజిల్లా ఎక్సైజ్‌శాఖలో టాస్క్‌ఫోర్సు సీఐగా పనిచేస్తున్న నిక్సన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నడిచే ఈ టాస్క్‌ఫోర్సు విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న నిక్సన్ మద్యం దుకాణదారులను వేధించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతి 'ఎక్సైజ్‌శాఖలో వసూల్ రాజా!' శీర్షికతో ప్రత్యేక కథనం సోమవారం ప్రచురించింది. దీనిపై ఆశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో ఆయనపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.

స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం

* కలెక్టర్ లక్ష్మీశ

13న ప్రారంభించనున్న సీఎం బాబు

6లో



ఆధిపత్య పోరు

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వర్సెస్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

క్రమబద్ధీకరించాలని సీఎం చంద్రబాబుకు వినతి

హౌసింగ్ కార్పొరేషన్‌లో సుమారు పదిహేనేళ్లుగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు హౌసింగ్ విభాగంలో క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. రెండు రోజుల కిందట కానూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సందర్భంలో హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది ఆయన్ను కలిశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని అభ్యర్థించారు. లేదంటే కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. దీనిపై చంద్రబాబు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అడ్డగోలు విధానాల వల్ల సజావుగా సాగే వ్యవస్థలు వివాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇందుకు గృహనిర్మాణశాఖలో సాగుతున్న ఆధిపత్య పోరే అద్దం పడుతోంది. గృహ నిర్మాణాలకు దరఖాస్తులు, మంజూరు బాధ్యత హౌసింగ్ కార్పొరేషన్‌కు, నిర్మాణాల పరిశీలన, బిల్లుల బాధ్యత గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కట్టబెట్టడంతో గొడవ మొదలైంది. అది ఒకరిపై మరొకరు పెత్తనం చేసుకునే వరకు వెళ్లింది. ఫలితంగా గృహ నిర్మాణాల పురోగతి దారి తప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా ఈ గొడవ సర్దుమణుగుతుందని భావిస్తే.. ఆరు నెలలు కావస్తున్నా కూడా ఎలాంటి మార్పులు చేయకపోవటంతో యథాస్థితి కొనసాగుతోంది. గృహ నిర్మాణం ఊపందుకోవటానికి ప్రభుత్వం టార్గెట్స్ నిర్దేశించినా క్షేత్ర స్థాయిలో పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి నిలిపితే తప్ప క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణం ఊపందుకునే పరిస్థితి కనిపించడంలేదు.

దరఖాస్తుల స్వీకరణ, మంజూరు బాధ్యత ఒకరిది..

* నిర్మాణాల పరిశీలన, బిల్లుల చెల్లింపుల అధికారం మరొకరికి..
* ఇరువర్గాల సమన్వయ లోపంతో లబ్ధిదారులకు తప్పని అవస్థలు
* వైసీపీ ప్రభుత్వంలో తెచ్చిన అడ్డగోలు విధానాల వల్లే సమస్య
* కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని క్షేత్ర స్థాయిలో పరుగులు పెట్టించారు. అప్పట్లో గృహ నిర్మాణ శాఖ ఒక్కటే ఈ పనులను పర్యవేక్షించటమే దీనికి ప్రధాన కారణం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఐదు శాతం కూడా నిర్మాణ పనులు పురోగతిలో లేవు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖతో పాటు, గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమాన అధికారాలు కల్పించారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది దరఖాస్తులను స్వీకరించి, రుణాలు మంజూరు చేస్తే.. ఇళ్ల పురోగతిని బట్టి బిల్లు చెల్లింపుల వ్యవహారాలను సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చూసేవారు. హౌసింగ్ కార్పొరేషన్ ఒక్కటే చేయాల్సిన బాధ్యతలను విడగొట్టి అప్పగించటం వల్ల సమస్యలు తలెత్తాయి. సకాలంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బిల్లులు పెట్టకపోవటం వల్ల వాటి చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొనేది. బిల్లులు సకాలంలో రాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గృహ నిర్మాణ శాఖ అధికారుల దగ్గర మొరపెట్టుకునేవారు. బిల్లు చెల్లింపులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల చేతుల్లో ఉండటం వల్ల అవి కదిలేవి కావు. హౌసింగ్ కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నా కూడా క్షేత్ర స్థాయిలో పనులు చేయటానికి అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా గత 15 ఏళ్లకు పైగా హౌసింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 300 మంది పనిచేస్తున్నారు. వీరికి చాలా అనుభవం ఉంది. టిడ్కో ఇళ్ల పరుగులు పెట్టడంలో వీరి కృషి ఎంతో ఉంది. వీరంతా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులన్న కారణంగా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారిని చిన్నచూపు చూస్తున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లేవారు కాదు.

గ్రామ సచివాలయాల్లో తాత్సారం

హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది నిర్ణీత సమయంలో ఎప్పటికప్పుడు డేటా అప్‌లోడ్ చేసినా బిల్లు చెల్లింపు విషయాల్లో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాత్సారం చేసేవారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల జాబ్ చార్ట్ వేరుగా ఉంటుంది. సచివాలయాల పరిధిలో జరిగే నిర్మాణాలను పర్యవేక్షణ చేసే అధికారం వరకు వీరికి ఇచ్చి ఉంటే హౌసింగ్ సిబ్బంది, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మధ్యన పనిలో పోటీ తత్వం పెరిగేది. అధికారాలను సమంగా పంచటం వల్ల ఒకరి మీద ఒకరు పెత్తనం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. తమకు బిల్లులు రావటం లేదని లబ్ధిదారులు హౌసింగ్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తుండటంతో.. వాటికి సంబంధించి హౌసింగ్ సిబ్బంది సచివాలయ సిబ్బందికి నివేదించటం చేస్తున్నారు. బిల్లు చెల్లింపులపై తమకు రికమండ్ చేయటాన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సహించలేకపోతున్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమకు చెప్పేదేమిటి అన్నట్టుగా వ్యవహరించటం వల్ల క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1280 మంది వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

తెరపైకి హౌసింగ్‌లో విలీనం డిమాండ్

గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాజాగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల

మిగతా 6లో..

నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



» కృష్ణా తరంగ్‌లో మంత్రి రవీంద్ర

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువతలో ప్రతిభను వెలికితీసి వారికి బంగారు భవిష్యత్తు కల్పించడమే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. యువతకు సుస్థిర ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆయన పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాలలో కృష్ణా విశ్వ విద్యాలయాల ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల కృష్ణాతరంగ్-2024 యువ జనోత్సవం మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న యువజనోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి దార్శనికతలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం యువతకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ సెన్సెస్‌ను తీసుకుంటున్నట్టు తెలిపారు. యువతలో నైపుణ్యాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈనెల 7న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మ్యారీటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కృష్ణా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ (ఇన్‌చార్జి) ఆర్.శ్రీనివాసరావు, రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, కృష్ణాతరంగ్ కన్వీనర్ ఎం.కోటేశ్వరరావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తూనుగుంట శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు గాజుల కానుక

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, గుంటుపల్లికి చెందిన పెదర్ల హర్షిత్‌కుమార్, కుటుంబసభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 11.5 గ్రాముల రెండు బంగారు బంగారు గాజులను కానుకగా అందజేశారు. మంగళవారం డిప్యూటీ ఈవో రత్నరాజును కలిసి బంగారు గాజులు కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందచేశారు. వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

● మొగల్రాజపురానికి చెందిన పునుమల్లి శ్రావణి, ఓం ప్రకాష్‌లు కుటుంబసభ్యులతో ఆలయానికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,00,116లను చెక్కు రూపంలో అందజేశారు. దర్శనానంతరం వీరికి ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందచేశారు. వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి)

తాతయ్యబాబును కలిసి తమను హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేయటం చర్చనీయాంశంగా మారింది. హౌసింగ్ విభాగంలో కీలక విధులను తామే నిర్వహించటం వల్ల తమను ఆ విభాగంలోకి విలీనం చేయాలన్న డిమాండ్ తీసుకువచ్చారు. ఇది కాస్తా హౌసింగ్ కార్పొరేషన్‌లో దశాబ్దంన్నర కాలంగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పుండు మీద కారం చల్లినట్టు అయ్యింది. తమకు ఉద్యోగ అభద్రతను కల్పిస్తున్నారని ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై గుర్రుగా ఉన్నారు. దీంతో వీరి మధ్యన మరింత గ్యాప్ ఏర్పడింది. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను తీసుకున్న ఉద్దేశం వేరు. వారి జాబ్ చార్ట్ వేరు. దీనికి భిన్నంగా సచివాలయాలను వదిలేసి హౌసింగ్ విభాగంలోకి వచ్చేయాలని ప్రజా ప్రతినిధులను కలవటంతో .. ఉభయుల మధ్యన వివాదం మరింత ముదురుతోంది.

మైండ్ మనీ గేమ్

(5వ పేజీ తరువాయి)

పిలిచారు? కమీషన్ల కోసం ఎన్‌హెచ్ అధికారులు పిలిచారా? కాంట్రాక్టు సంస్థ మేఘాకు ప్రయోజనం కల్పించటానికి కట్టబెట్టారా? అన్నది తేలాల్సి ఉంది.

వినియోగంలో లేని ల్యాంకో విద్యుత్ లైన్ల మార్పు?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి చేయడం లేదు. భవిష్యత్తులో దీని పరిస్థితి ఏమిటో తెలియదు. ల్యాంకో కొండపల్లి పవర్ ప్లాంట్ తరఫున 400 కేవీ ట్రాన్స్‌మిషన్ టవర్స్ రీ లోకేషన్‌కు సంబంధించి రూ.32.58 కోట్ల వ్యయం అవుతుందని ప్రతిపాదించింది. సూపర్ వైజేషన్ చార్జీల కోసం ల్యాంకో సంస్థ, ఎన్‌హెచ్‌కు రూ.44.56 లక్షలు చెల్లించేందుకు సుముఖంగా ఉన్నట్టుగా ఎన్‌హెచ్‌ఏఐకు రాసినట్టుగా ఉన్న లేఖలో ఉంది. ఈ లేఖ అధీకృతమా ? కాదా ? అన్నది తేలాల్సి ఉంది. అలాగే ఈ లేఖతో పాటు జతపరిచిన అర్థచంద్రాకారపు అలైన్‌మెంట్ కూడా ఏపీ ట్రాన్స్‌కో నుంచి అధీకృతంగా అనుమతులు వచ్చాయా అన్నది కూడా అనుమానమే. ఈ పనులను కేవలం ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌వో కార్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపడుతున్నట్టుగా తెలుస్తోంది. రైతులతో సంబంధం లేకుండానే పనులు చేసుకోమని ఎన్‌హెచ్ ఆర్‌వో అనుమతులిచ్చారని మేఘా సిబ్బంది రైతులతో ఘర్షణ పడిన సందర్భంలో వ్యాఖ్యానించినట్టుగా రైతులు చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే ఈ వ్యవహారంలో ఏదో కిరికిరి నడుస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

రైతులు తెచ్చిన అలైన్‌మెంట్

వంద మంది నష్టపోయే చోట పది మంది నష్టపోయినా పర్వాలేదనుకుని తమ భూములు సంతర్పణ చేయటానికి సిద్ధపడ్డ స్థానిక రైతులు వారే ఒక అధీకృత ఇంజనీర్ ద్వారా అలైన్‌మెంట్ ప్లాన్ గీయించారు. ఈ ప్లాన్ ప్రకారం కేవలం రెండు చోట్ల మాత్రమే నాలుగు టవర్లను మార్చటం ద్వారా మొత్తం సమస్య పరిష్కారమవుతుంది. ఈ రెండు చోట్ల భూములను ఇస్తామని ఇద్దరు రైతులు ముందుకు వచ్చారు. ఈ అలైన్‌మెంట్ వల్ల భారీ సంఖ్యలో రైతులు, 40 మందికి పైగా ప్లాట్లదారులకు నష్టం జరగదు. కేవలం ఇద్దరు రైతుల నష్టంతోనే సమస్య పరిష్కారమవుతుంది. రైతులు తెచ్చిన ఈ ప్రతిపాదన ఇటు ఎన్‌హెచ్ అధికారులు, అటు జిల్లా యంత్రాంగం చెవికెక్కడం లేదు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కలెక్టర్ ఆదేశాలను సైతం మేఘా సంస్థ, కొత్తపేట పోలీసులు బేఖాతర్ చేస్తున్నారు. ఈ వివాదానికి చెక్ పెట్టేందుకు ట్రాన్స్‌కో అధికారులతో కమిటీ వేసి, నివేదిక ఇచ్చిన తర్వాతనే చర్యలు చేపట్టాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. ఆయన ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఏమాత్రం పట్టించుకోకుండా పనులు చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించిన రైతులు.. స్టే ఇచ్చిన న్యాయస్థానం

రైతుల ఆందోళనతో కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్టే కూడా ఇచ్చింది. మరికొన్ని కేసులు విచారణలో ఉన్నాయి. హైకోర్టు స్టే ఇచ్చినా కూడా మేఘా సంస్థ పనులను ఆపలేదు. బలవంతంగా పనులు చేస్తోంది. కొత్త పేట పోలీసులను అడ్డుపెట్టుకుని పనులు చేస్తోంది.

స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం

13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

» కార్యక్రమానికి హాజరుకానున్న 25వేల మంది

» ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈనెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబుచే స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం చుట్టడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభకు సుమారు 25 వేల మంది హాజరుకానున్నారని, జిల్లా అధికారులు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 13వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం వీడియో కాన్ఫరెన్సు హాలులో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారన్నారు. సభకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సుమారు 25 వేలమంది ప్రజలు, విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. దీనికోసం 500 బస్సుల ఏర్పాటుకు ట్రాన్స్‌పోర్టు ఏపీఆర్‌టీసీ అధికారులు వాహనాల సమీకరణ చేయాలన్నారు. వేదిక, బారికేడ్ల నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వాహనాల పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లు చేసేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా ఏర్పాట్లను మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చేపట్టాలన్నారు. వేదిక స్టాల్స్ అలంకరణ, పర్యవేక్షణ జిల్లా ఉద్యాన అధికారి చేపట్టాలని తెలిపారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా, మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని, ఏర్పాట్లపై ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే తన దృష్టికి తెవాలని కలెక్టర్ కోరారు.

సమావేశంలో జేసీ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ గౌతమి శాలిని, డీఆర్వో లక్ష్మీ నరసింహం, ఆర్డీవో చైతన్య, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఈవో యువీ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎస్.వి.సాగర్, డీసీవో శ్రీనివాసరెడ్డి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జె.సుమన్, జిల్లా పౌరసరఫరాల అధికారి టి.సతీష్, సీపీవో వై.శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి పాల్గొన్నారు.

స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన..

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటుతో పాటు పబ్లిక్ గ్యాలరీ, వీఐపీ గ్యాలరీ, ట్రాఫిక్, బందోబస్తు, వివిధ ఇతివృత్తాలతో ఏర్పాటు చేయాల్సిన స్టాళ్లు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ తదితరాలపై సూచనలు చేశారు.

చోరీ నిందితుల కోసం గాలింపు ముమ్మరం

వత్సవాయి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దబ్బాకుపల్లి చోరీ ఘటనలో నిందితుడి కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఇంటి తాళం పగలగొట్టి రూ.36.50 లక్షలు చోరీ చేసిన నిందితులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. సొమ్ముతో పాటు పక్కన మరికొంత నగదు, పావు కేజీ బంగారం ఉన్నప్పటికీ ఆగంతకులు వాటి జోలికి వెళ్లకపోవడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు ఎస్‌కె బడేసాహెబ్ 25 సంవత్సరాలుగా వత్సవాయిలో మెకానిక్ షాపు పెట్టుకొని జీవిస్తున్నాడు. సోమవారం ఆయన డ్యూటీకి వెళ్లగా, భార్య అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లింది. ముగ్గురు పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు చేయాలని దాచిన సొమ్మును దోచుకెళ్లారని బాధితుడు బుడే సాహెబ్ వాపోయాడు. పోలీసులు క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అడిషనల్ ఎస్పీ రామారావు, నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సామాన్యుడి సొంతింటి కల సాకారం

» రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్‌రాజు

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడి సొంత ఇంటికల నెరవేర్చడమే లక్ష్యమని రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్ రాజు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ రైజ్ ఎన్ రైజ్ ఏడో వార్షికోత్సవం విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలో మంగళవారం ఘనంగా జరిగింది. కస్టమర్లు, సంస్థ డైరెక్టర్లు, వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులు, మార్కెటింగ్ సిబ్బంది, రైతుల సమక్షంలో జరిగిన వేడుకల్లో సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్‌రాజు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో పదేళ్ల అనుభవంతో 12 వెంచర్లను దిగ్విజయంగా సామాన్య ప్రజలకు అందించామన్నారు. అమరావతి రాజధాని పరిధిలో అవుటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లు వస్తున్నాయని, ఇప్పటికే తూర్పు బైపాస్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందని పశ్చిమ బైపాస్ నిర్మాణంలో ఉందని తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, మధ్య తరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు అందుబాటు ధరల్లో ఇవ్వాలనేదే మా కోరికఅన్నారు. కొత్తూరు తాడేపల్లి వద్ద నూతన వెంచర్ ప్రారంభించినట్టు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంవీ నాగరాజు వెంచర్ ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మార్కెటింగ్‌లో ప్రతిభ కనబరచిన డైరెక్టర్లు, ఏజెంట్లకు చైర్మన్ ప్రోత్సాహకాలు అందజేశారు. సంస్థ డైరెక్టర్లు ఎస్.సన్యాసిరావు, ఎ.పెద్దిరాజు, వీసీ కుమార్, ఎంవీవీ. కృష్ణారావు, టి.రాజు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్‌రాజు

అలైన్‌మెంట్ మార్పులో స్కామ్!

» 'మేఘా' ప్రయోజనాల కోసం రైతులను నట్టేటముంచుతున్నారు

» టవర్ల పనులను రైతులతో కలిసి అడ్డుకున్న వైసీపీ నేత పోతిన మహేష్

» చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామంటున్న స్థానిక రైతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ రూరల్)

"మేఘా సంస్థ ప్రయోజనాల కోసం ఎన్‌హెచ్, పోలీస్, జిల్లా అధికారులు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారు. 'ల్యాంకో' అలైన్‌మెంట్ మార్పుపై అనేక అనుమానాలు ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అండగా ఉంటాం" అని వైసీపీ అధికార ప్రతినిధి పోతిన మహేష్ అన్నారు. గురువారం మేఘా సంస్థ అడ్డగోలుగా చేపడుతున్న టవర్ల పనులను అక్కడి రైతులతో కలిసి ఆయన అడ్డుకున్నారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినా పనులు చేయటం వల్ల సమస్యలు కొని తెచ్చుకుంటారని పని చేస్తున్న సిబ్బందిని హెచ్చరించారు. పోలీసుల పర్యవేక్షణలో జరుగుతున్న పనులను ఆయన నిలుపుదల చేయించారు. ప్రొక్లెయిన్లను అక్కడి నుంచి పంపించి వేశారు. జక్కంపూడి ప్రాంతంలో పొలాలు కలిగిన రైతులంతా నిస్వార్థంగా సహకరిస్తామని చెబుతున్నారని, తక్కువ నష్టం జరిగే విధంగా చూడాల్సిన చోట వందలాది మందిని నష్టపరచటమెందుకని ప్రశ్నించారు. రైతుల అంగీకారం లేకుండా వారి పొలాల్లో పనులు చేయటానికి మీకు అధికారం ఎవరిచ్చారని పనులు చేస్తున్న వారిని నిలదీశారు. రైతులు ప్రశ్నిస్తే పోలీసులను పిలిచి నిర్బంధిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగంలో లేని ల్యాంకో లైన్‌కు సంబంధించి ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పుపైనే తమకు అనుమానాలు ఉన్నాయని, ఈ వ్యవహారాన్ని తేల్చాల్సిన చోటే తేల్చుతామన్నారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తే కోర్టు ధిక్కరణకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. రూ. 32 కోట్ల ప్రయోజనం కోసం రైతులను మోసం చేస్తున్నారని, ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

మేము స్థలాలు ఇస్తాం.. మిగిలిన వారివి వదిలేయండి

- ఆల్లూరు సత్యనారాయణ, పి.సాంబయ్యు రైతులు



అభివృద్ధికి మేము అడ్డం కాదు. కాని అనాలోచితంగా చేస్తున్న హైటెన్షన్ వైర్ల డైవర్షన్ పనుల కారణంగా అనేక మంది రైతులు నష్టపోతున్నారు. ప్రతిపాదిత అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్ వల్ల ఎక్కువ నష్టం జరుగుతోంది. రైతులెవరూ నష్టపోకుండా ఉండటానికి మా పొలాలు త్యాగం చేస్తామని చెబుతున్నా వినటం లేదు. చాలా తక్కువ నష్టంతో బయటపడే ప్లాన్‌ను మేము తయారు చేసి అందించాం. అక్కడ మా భూములే ఉన్నాయి. టవర్లు వేసుకోమని మేమే చెబుతున్నాం.

మా స్థలం మొత్తం టవర్లకే పోయింది



దావు రంగారావు, రైతు

మా కుటుంబానికి జక్కంపూడి పంచాయతీ పరిధిలో 1,150 గజాల స్థలం ఉంది. ముగ్గురు అన్నదమ్ములకు ఆ స్థలమే ఆధారం. హైటెన్షన్ వైర్ల డైవర్షన్ పేరుతో మా స్థలం మొత్తం స్తంభాల ఏర్పాటుకే పోయింది. గజం కూడా మిగల్లేదు. ఇటీవల రూ. 3 లక్షలతో స్థలంలో మెరక కూడా వేయించాం. ఇప్పుడు మా స్థలాన్ని మా అనుమతి లేకుండా ఇష్టానుసారం తవ్వేసి పిల్లర్లు వేసేశారు.

20 ఏళ్ల కష్టార్జితం పోయింది



ఎల్.బి.రాజు, ప్లాట్ యజమాని

ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుని 20 ఏళ్ల కష్టంతో పైసా పైసా కూడబెట్టి 250 గజాల స్థలాన్ని వెంచర్లలో కొనుగోలు చేశాను. ఇప్పుడు హైటెన్షన్ వైర్ల స్తంభాల కారణంగా కనీసం నా స్థలం దగ్గరకు వెళ్లడానికి కూడా దారి లేకుండా పోయింది. వెంచర్‌కు ప్రధాన రహదారికి మధ్యలో స్తంభం ఏర్పాటు చేస్తామంటున్నారు. అదేమని అడిగితే కాంట్రాక్ట్ సంస్థ సిబ్బంది గూండాగిరి చేస్తున్నారు. నాతో పాటు వెంచర్‌లోని 35 ప్లాట్లకు దారి లేకుండా అయిపోయింది.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి ఆమోదం ఇప్పించండి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి ప్రతిపాదనలకు నీతి ఆయోగ్ నుంచి ఆమోదం ఇప్పించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను తెలిపింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద విజయవాడ స్టేషన్ అభివృద్ధికి రైల్వేబోర్డు చైర్మన్ రూ.819.51 కోట్లు అంచనాలను నీతి ఆయోగ్‌కు పంపించారని, వాటిని త్వరగా ఆమోదింపచేసేందుకు చొరవ తీసుకోవాలని అశ్వినీ వైష్ణవ్‌ను శివనాథ్ కోరారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో రైల్వేల పరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి రైలు భవన్‌లో మంగళవారం కేంద్ర మంత్రిని ఎంపీ కలిశారు. సెంట్రల్ నియోజకవర్గంలో సింగ్‌నగర్ ప్రాంతంలో రెండో ఫ్లైఓవర్ నిర్మాణం, గుణదలలో రోడ్డు ఓవర్ బ్రిడ్జి అంశాలను కూడా ఎంపీ ప్రస్తావించారు. దీంతోపాటుగా పెండింగ్‌లో ఉన్న 8 రోడ్డు అండర్ బ్రిడ్జిలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు త్వరగా మంజూరు ఇప్పించాలని కోరారు. రైల్వేశాఖతో లింక్ అయిన డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు, విస్తరణ సమస్యలను కూడా పరిష్కరించేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిని శివనాథ్ కోరారు.

ఎన్టీఆర్ 2, కృష్ణా 3

» రాష్ట్ర స్థూల విలువ జోడింపులో ర్యాంకుల పంట

» సేవా రంగంలో రాష్ట్రంలోనే ఎన్టీఆర్‌కు 2, కృష్ణాకు 5

» పారిశ్రామిక రంగంలో ఎన్టీఆర్‌కు 5, కృష్ణాకు 16

» వ్యవసాయానుబంధంలో ఎన్టీఆర్‌కు-23, కృష్ణాకు-2

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రానికి స్థూల ఆదాయాన్ని జోడించే జిల్లాల్లో ఎన్టీఆర్ జిల్లా 2వ స్థానంలో నిలవగా.. కృష్ణా జిల్లా మూడో స్థానం కైవసం చేసుకుంది. విశాఖపట్నం జిల్లా నంబర్ వన్ స్థానంలో నిలిచింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వ్యవసాయానుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవా రంగాలు కీలకం. ఈ రంగాల్లో సాధించిన వృద్ధి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ జీడీపీ ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర జీడీపీలో జిల్లాలు కీలకంగా ఉంటాయి. రాష్ట్ర జీడీపీకి ఏ జిల్లా ఎంత దోహదపడుతుందన్నదానిపై బుధవారం జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రభుత్వం ర్యాంకులను ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఎన్టీఆర్ జిల్లా రెండో స్థానాన్ని, కృష్ణాజిల్లా మూడో స్థానాన్ని సాధించటం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలు ఉంటే ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు రాష్ట్ర ఆదాయంలో టాప్-3లో చోటు దక్కించుకున్నాయి. వ్యవసాయానుబంధ రంగాల్లో ఎన్టీఆర్ జిల్లా రూ.9476 కోట్ల స్థూల విలువను జోడించింది. ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఆదాయంలో 2.21 శాతం మేర ఎన్టీఆర్ జిల్లా కాంట్రిబ్యూషన్ ఇచ్చింది. వ్యవసాయానుబంధ రంగం ఒక్కదాంట్లో ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రంలో 23వ స్థానంలో నిలిచింది. కానీ పారిశ్రామిక, సేవా రంగాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించటం ద్వారా రాష్ట్రంలోనే రెండవ ర్యాంకును సొంతం చేసుకుంది. పారిశ్రామిక రంగంలో రూ.14,228 కోట్ల ఆదాయాన్ని సాధించింది. తద్వారా ఈ రంగంలో రాష్ట్ర ఆదాయానికి ఎన్టీఆర్ జిల్లా 4.52 శాతం స్థూల విలువను జోడించింది. పారిశ్రామిక రంగ పురోభివృద్ధిలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది. ఇక సేవా రంగం విషయానికి వస్తే రూ. 45,419 కోట్ల ఆదాయాన్ని సాధించింది. రాష్ట్రం ఈ రంగంలో సాధించిన విలువలో 9.45 శాతం మేర ఎన్టీఆర్‌జిల్లా స్థూల విలువను జోడించింది. సేవా రంగంలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే 2వ స్థానంలో నిలిచింది. ఈ మూడు రంగాలలో చూస్తే రూ.69,123 కోట్ల ఆదాయంతో రాష్ట్ర ప్రభుత్వానికి 5.65 శాతం మేర స్థూల విలువను జోడించి రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. ఇక కృష్ణాజిల్లా విషయానికి వస్తే .. వ్యవసాయానుబంధ రంగాలలో రూ. 32,372 కోట్ల వ్యయంతో 7.56 శాతం స్థూల విలువను జోడించింది. తద్వారా రాష్ట్రంలోనే రెండవ స్థానాన్ని సాధించింది. పారిశ్రామిక రంగంలో రూ.7632 కోట్ల ఆదాయంతో 2.42 శాతం స్థూల విలువను జోడించింది. తద్వారా రాష్ట్రంలోనే 16వ స్థానాన్ని సాధించింది. సేవా రంగంలో రూ. 24,115 కోట్ల ఆదాయంతో 5.01 శాతం స్థూల విలువను జోడించింది. తద్వారా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది. ఈ మూడింటిలోనూ రూ. 64,118 కోట్ల ఆదాయం సాధించటం ద్వారా రాష్ట్ర ఆదాయానికి 5.24 శాతం మేర స్థూల విలువను జోడించి రాష్ట్రంలోనే 3 వ స్థానంలో నిలిచింది.

జీఎస్‌డీపీలోనూ ఎన్టీఆర్, కృష్ణా 2, 3 స్థానాలు కైవసం

రాష్ట్ర జీడీపీకి కీలకంగా మారిన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ (జీఎస్‌డీపీ)లో కూడా అదే ఊపును ప్రదర్శించాయి. వరుసగా 2, 3 స్థానాలలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు నిలిచాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్ జిల్లా రూ. 73,632 కోట్ల ఆదాయంతో జీఎస్‌డీపీని సాధించింది. 2028 - 29 నాటికి రూ. 1,63,738 కోట్లకు పెరగవచ్చు అని అంచనా. కృష్ణాజిల్లా విషయానికి వస్తే 2022- 23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 68,301 కోట్ల ఆదాయంతో జీఎస్‌డీపీని సాధించటం జరిగింది. అలాగే 2028 - 29 నాటికి రూ.1,69,469 కోట్లు పెరిగే అవకాశం ఉందన్నది అంచనాగా ఉంది.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాత్రికుల రద్దీని పురస్కరించుకుని శబరిమలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

07173 కాకినాడ పోర్టు-కొల్లం బుధవారం రాత్రి 11.50కి బయలుదేరుతుంది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కొల్లం చేరుతుంది. ఈనెల 11, 18, 25 తేదీల్లో ఈరైలు నడుస్తుంది. 07174 కొల్లం-కాకినాడ పోర్టు శుక్రవారం ఉదయం 8.40కి బయలుదేరుతుంది. శనివారం సాయంత్రం 4గంటలకు కాకినాడ పోర్టుకు చేరుతుంది. ఈనెల 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. 07175 సికింద్రాబాద్-కొల్లం గురువారం రాత్రి 8 గంటలకు బయలుదేరుతుంది. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు కొల్లం చేరుతుంది. ఈనెల 19, 26 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. 07176 కొల్లం-సికింద్రాబాద్ రైలు శనివారం ఉదయం 5 గంటలకు బయలుదేరుతుంది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈనెల 21, 28 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. కాకినాడ పోర్టు-కొల్లం ప్రత్యేక రైలు ఆరు సర్వీసులు నడుస్తుంది. కాకినాడ టౌన్, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్డు, తిరుపూర్, పొలనూరు, పాలక్కాడ్, త్రిశూర్, అరువ, యర్నాకులం, ఎట్టుమనువర్, కొట్టాయం, తిరువల్లా, చెంగనూరు, కాయంకుళం స్టేషన్లలో ఆగుతాయి. సికింద్రాబాద్-కొల్లం ప్రత్యేక రైలు నాలుగు సర్వీసులు నడుస్తుంది. ఈ రైళ్లు మౌలాలి, చర్లపల్లి, నల్గొండ, విఎర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, వెల్లూరు, తిరువణ్ణామలై, విల్లిపురం, వృద్ధాచలం, అరియలూరు, శ్రీరంగం, తిరుచురాపల్లి, దిండిగల్, మధురై, విరుద్ధనగర్, టెంకాశి, చెంగొట్టై, పునలూరు స్టేషన్లలో ఆగుతుంది.

ఐటీఎస్‌తో పోలీస్ ప్రతిభకు పట్టం

(5వ పేజీ తరువాయి)

పట్టాలెక్కించాలని భావిస్తున్నారు. ఈ డ్యాష్‌బోర్డుకు అన్ని పీఎస్‌లను అనుసంధానం చేస్తారు. ఆన్‌లైన్‌లో ఉన్న కేసుల వివరాలు, పిటిషన్ల పరిష్కారాలు, చార్జిషీటు దాఖలు అన్నీ ఐటీఎస్‌కు జతవుతాయి. పోలీసు కమిషనర్ కార్యాలయం నుంచే ట్యాబ్‌లో గానీ, ల్యాప్‌టాప్‌లో గానీ ఈ డ్యాష్‌బోర్డును తెరచి ఆయా స్టేషన్లలో కేసులు, పిటిషన్లు, చార్జిషీట్లు లెక్కలను తెలుసుకోవచ్చు. ఇది నెలవారీగా అధికారులకు చూపిస్తుంది. ఎవరు ఎంత ప్రతిభను కనబరిచారో ఈ గణాంకాలు స్క్రీన్‌పై స్పష్టం చేస్తాయి. ఈ విధానమే ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఎస్ఐలకు రేటింగ్ ఇస్తుంది. ఎక్కువ రేటింగ్ వచ్చిన వారు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్టుగా నిర్ధారిస్తారు. దాని ప్రకారం వారికి పురస్కారాలకు ఎంపిక చేస్తారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారమే రెండు నెలల పొడిగింపు

» పార్కింగ్ రుసుం వసూలపై అధికారుల వివరణ

విజయవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం టోల్, పార్కింగ్ వసూలును కోర్టు ఉత్తర్వులను అనుసరించి రెండు నెలలు పొడిగించినట్టు ఈవో కేఎస్ రామారావు వివరణ ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన ఎంత 'ఘాటు' ప్రేమో..' కథనంపై ఆయన స్పందించి ప్రకటన విడుదల చేశారు. ఆరు నెలలుపాటు ఘాట్ రోడ్డును మూసివేయడంతో ఆరు నెలలు లైసెన్స్‌ను పొడిగించామన్నారు. దీంతోపాటు మరో రెండునెలలు పొడిగించాలని కాంట్రాక్టర్ కోరగా తిరస్కరించామని తెలిపారు. దీనిపై కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే ఆ రెండు నెలల పొడిగింపును ఇచ్చామన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీలుకు వెళ్లడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మార్కెట్ యార్డు కమిటీలపై కూటమి నేతల చూపు!



» రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా చైర్మన్ల నియామకాలు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్) : ముడా చైర్మన్ పదవి బీజేపీ నేతకు కేటాయించడంతో జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్‌యార్డు పదవులపై కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. మూడు విడతల్లో నామినేటెడ్ పోస్టుల జాబితాలు వెల్లడించగా.. వ్యవసాయ మార్కెట్ యార్డు పదవులను ఇంకా భర్తీ చేయలేదు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌లు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు.జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 12 మార్కెట్ కమిటీల చైర్మన్ పదవుల కోసం ఇప్పటికే కొందరు నాయకులు ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖలతో మంత్రి అచ్చెన్నాయుడు వద్దకు వెళ్లారు. సిఫార్సు లేఖలపై మంత్రి ఎవరికీ మాట ఇవ్వలేదు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో ఎవరికి దక్కుతుందో?

ఎవరికి వారు మార్కెట్ యార్డుల పదవులు తమనే వరిస్తాయని చెప్పుకుంటున్నారు. అయితే కృష్ణాజిల్లాను యూనిట్‌గా చేసుకుని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవులు భర్తీచేయాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. జీవో 77 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు, ఓసీలకు జిల్లాలోని 12 మార్కెట్ యార్డు పదవులను ఎమ్మెల్యేల సమక్షంలో లాటరీ పద్ధతిపై కేటాయించాల్సి ఉంది.

● మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఒక్కటే ఉంది. పెడన నియోజకవర్గంలో పెడన, బంటుమిల్లి రెండు ఉన్నాయి.

గుడివాడ నియోజకవర్గంలో గుడివాడ, గుడ్లవల్లేరు, ఉయ్యూరు నియోజకవర్గంలో ఉయ్యూరు, కంకిపాడు, పామర్రు నియోజకవర్గంలో పామర్రు, మొవ్వ (కూచిపూడి), అవనిగడ్డ నియోజకవర్గంలో నాగాయలంక, కొడాలి, గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం మార్కెట్ యార్డుల నుంచి కూటమి నాయకులు దాదాపు 32 మంది పదవులను ఆశిస్తున్నారు. లాటరీ పద్ధతిలో ఈ 12 వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఏ సామాజిక వర్గానికి రిజర్వు అవుతాయో తేలిపోతాయి. వైసీపీ పాలనలో కలెక్టర్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మౌఖికంగా చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వంలో మార్కెట్ యార్డు చైర్మన్ల నియామక బాధ్యతలను కలెక్టర్లకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పదవులు రిజర్వేషన్లతో భర్తీ చేస్తారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102,110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 630



సహారా డిపాజిట్ సమస్యపై ఫిర్యాదు



ఆటోనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సహారా డిపాజిట్ సమస్యపై మొగల్రాజపురం బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. మొగల్రా జపురం రావిచెట్టు సెంటర్ కొండపైన ఉన్న 15 కుటుంబాలకు సహారా డిపాజిట్‌లు అందలేదని, బాధితుల ఆధార్ కార్డులో పేరు సహారా సంస్థ డిపాజిట్ బాండ్‌లో ఉన్న పేరులో మార్పు ఉందన్న కారణంతో రిఫండ్ క్లైయిమ్‌లు ఆగిపోయాయని బాధితులు వారధి ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మకు ఫిర్యాదు చేశారు.

ఓర్పు, నేర్పుతో విజయసాధనకు కృషి చేయాలి

డాక్టర్ వీర రాఘవరావు ఆత్కూరి



డాక్టర్ వీర రాఘవరావును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డాక్టర్ టిఎస్.రవికిరణ్

మొగల్రాజపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎలాంటి సందర్భంలోనైనా ఓటమి ఎదురైతే ఒప్పుకోవద్దు, ఓర్పు, నేర్పుతో విజయ సాధనకు కృషి చేయాలి అపుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని ఇంపాక్ట్ క్లబ్ గుంటూరు డైరెక్టర్, ప్రెసిడెంట్ డాక్టర్ వీర రాఘవరావు ఆత్కూరి చెప్పారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పీబీ సిద్ధార్థ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం, స్పృహాస్థి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మానవ హక్కులు, సాంకేతిక పరిజ్ఞానం, అవకాశాలు ప్రమాదం అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించే హక్కులు మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ఉంటాయన్నారు. మనహక్కులు- మన ఉజ్వల భవిష్యత్ అనే నినాదంతో విద్యార్థులు మసలు కోవాలని సూచించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కంప్యూటర్ సైన్స్ హెడ్ డాక్టర్ టిఎస్ రవికిరణ్ ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యురాలు భారతి, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి జంపాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు ఆర్థో పరికరాలు అందజేస్తున్న పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్లు

ఆర్థో పరికరాలు, పుస్తకాలు అందజేత

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థో డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ, ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో రూ.3 లక్షల విలువ చేసే ఆర్థో పరికరాలు, పుస్తకాలను మంగళవారం సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ ఎ.వెంకటేశ్వరరావుకు ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్ పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యులు అందించారు. ఈ మేరకు వారికి ఆయన అభినందనలు తెలిపారు.

సంక్షేమ శాఖలో సమూల మార్పులు తెస్తాం

మంత్రి బాల వీరాంజనేయ స్వామి



కమ్యునిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే గద్దె

గుణదల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖలో సమూలమైన మార్పులను కూటమి ప్రభుత్వం తీసుకువస్తుందని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక నాల్గవ డివిజన్లోని వరలక్ష్మీ నగర్లో రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యునిటీ హాల్‌ను మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో పనులు ప్రారంభించిన కమ్యునిటీ హాల్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో నిధులు మంజూరై నిర్మాణ పనులు సగంలో నిలిచిపోయిన వాటన్నిటినీ కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని ప్రకటించారు. ఈ జనవరిలోనే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 340 కోట్లు దళితులకు రుణాలుగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ హాస్టళ్లలో మరమ్మతులు చేయడానికి రూ. 140 కోట్లు కేటాయించామన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ సబ్‌ప్లాన్ అనే పదాన్నే మర్చిపోయేలా చేశారని తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు సైకిళ్లు, మోటారు రిక్షాలు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం 5వ డివిజన్‌కు చెందిన వేమవరపు వేణు, కొల్లూరు అర్జునరావుకు జీవనోపాధి నిమిత్తం రెండు ఇస్త్రీ బండ్లు మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్, టీడీపీ జిల్లాదళిత విభాగం నాయకుడు సొంగా సంజయ్ వర్మ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, జాస్తి సాంబశివరావు, టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, విమలపొంగు ప్రకాష్, దోమకొండ రవి, గొల్లపూడి నాగేశ్వరరావు, అన్నాబత్తుల బాబి, నందిపాటి దేవానంద్, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

లబ్బీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు సాయి మేధ కోచింగ్ సెంటర్ విజయవాడ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ తెలిపారు. గాయత్రి నగర్‌లోని కోచింగ్ సెంటర్‌లో 2024-25 ఈసెట్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు.

భగవద్గీత విజేతలకు బహుమతుల అందజేత



విజేతలతో ధర్మప్రచార పరిషత్ సభ్యులు

లబ్బీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని 9,10 తేదీల్లో సంపూర్ణ భగవద్గీత, భగవద్గీతలోని ఆరవ అధ్యాయం ఆత్మ సంయమయోగంలో, భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించినట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం చుట్టుగుంటలోని ఈస్ట్ లైన్స్ క్లబ్ మీటింగ్ హాల్‌లో జరిగింది. 18వ అధ్యాయం ఆత్మ సంయమయోగంలో విజేతలైన వారికి, 6వ అధ్యాయం ఆత్మ సంయమయోగంలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాన్ని, పుస్తక ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బొగ్గవరపు వెంకట బాల కోటేశ్వరరావు, విష్ణుభట్ల లక్ష్మీనారాయణ, పొక్కులూరి సుబ్బారావు, టి సావిత్రి, ఇస్కాన్ ప్రతినిధులు వజ్రదాస్ గురుజి, వాసవి క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ విత్తింటి శారద, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, వరలక్ష్మి, శ్రీవారి సేవకులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రెవెన్యూ సదస్సులో టీడీపీ నేతల వినతి



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న 17, 18 డివిజన్ల టీడీపీ నాయకులు

రాణిగారితోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 18వ డివిజన్‌లోని సిమెంట్ గొడౌన్‌లో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్ర, సెంట్రల్ తహసీల్దార్ వెంకట్రామయ్య లు పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా 17,18 డివిజన్ల టీడీపీ నాయకులు పలు సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 9గా ఉన్న వాటిని జీవో నెంబర్ 10 గా మార్చాలని, ఇప్పటికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ కాని వారికి రిజిస్ట్రేషన్‌లు చేయడం, ఫ్యామిలీ ధ్రువీకరణ పత్రం తదితర సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాయాల ఉద్యోగులు, సిబ్బంది, టీడీపీ నాయకులు వేముల దుర్గారావు, రాయి, రంగమ్మ, పోలిపల్లి, వెంకటేశ్వరరెడ్డి, ఆదిబాబు, పల్లా సాగర్, కొక్కెర తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

408 మద్యం సీసాలు స్వాధీనం .. ముగ్గురు అరెస్ట్

ఉయ్యూరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంకిపాడు సమీపంలో సోమవారం సాయంత్రం కారులో మద్యం తరలిస్తున్న ఇద్దరి నుంచి 408 మద్యం సీసాలు స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనపరచుకుని అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉయ్యూరు సీఐ శేషగిరిరావు తెలిపారు. కారులో మద్యం సీసాలు ఉన్నట్టు సమాచారం మేరకు తనిఖీ చేశారు. కారులో ఉన్న కాకి విద్యాసాగర్, కుంభం సురేశ్‌ను అరెస్టు చేసి విచారించారు. దీంతో మరో వ్యక్తి జంగాల శ్రీనివాస్‌కూ సంబంధం ఉన్నట్టు చెప్పడంతో ఆయనతో కలిపి ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నేటి నుంచి నేషనల్ సిల్క్ ఎక్స్ పో



ఎక్స్‌పోలో వస్త్రాలు ప్రదర్శిస్తున్న మహిళ

లబ్బీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సిల్క్ ఎక్స్ పో ఆధ్వర్యంలో ఎ కన్వెషన్ సెంటర్‌లో ఈనెల 11 నుంచి 13 వరకు(బుధవారం నుంచి) విభిన్న రంగుల విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాల ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ఉదయం 11గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితం అని తెలిపారు. వివాహది వేడుకలకు కావలసిన అన్ని రకాల సంప్రదాయ చీరలు, సల్వార్‌లు, దేశంలోని విభిన్న ప్రాంతాల నేత కార్మికులచే అందించబడిన వేలాది రకాల పట్టు, కాటన్ వస్త్రాలు 50 శాతం తగ్గింపుతో నేరుగా విక్రయించడం జరుగుతుందని తెలిపారు. మహారాష్ట్ర పైథాని సిల్క్, బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కషిదా సిల్క్, మధ్యప్రదేశ్ నుంచి ప్రసిద్ధ చందేరి అండ్ మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలూచారి, జమదాని, టాంగైల్, ఢకాయ్ సిల్క్, లినెన్ కాంతా వర్క్ స్టిచ్ చీరలు తదితర వస్త్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దేశంలోని నలుమూలల నుంచి నేరుగా తయారీదారుల నుంచి తెచ్చిన చీరలు ఒకే చోట తగ్గింపు ధరలలో లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్



డ్రెయిన్లలో దోమల మందు పిచికారి చేస్తున్న మలేరియా సిబ్బంది

చిట్టినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు వీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ అన్నారు. మంగళవారం బెంజ్‌సర్కిల్ వద్ద నారా చంద్రబాబునాయుడు కాలనీలో యాంటీ లార్వా ఆపరేషన్ పనులు నిర్వహించారు. సైడ్ డ్రెయిన్‌లో ఆయిల్ బాల్స్‌తోపాటు ల్వారా వృద్ధి చెందకుండా పైరత్నం స్ప్రే చేశారు. డ్రెయిన్లపై చప్టాలున్న ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా దోమల నిర్మూలనకు యాంటీ ల్వారా ఆపరేషన్ పనులు నిర్వహిస్తున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక టీంల ద్వారా నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. రోజూ డివిజన్ వారీగా ఫాగింగ్ నిర్వహిస్తున్నామని, ల్వారా దశలోనే దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, దోమల నివారణ మందులు పిచికారి చేస్తున్నామన్నారు. ప్రజలు వారంలో ఒకరోజు శుక్రవారం డ్రై డేగా పాటించి ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా జ్వరంగా ఉన్నట్లయితే వెంటనే సమీపంలో ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ స్విమ్మింగ్ పోటీలకు స్పందన



విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ స్విమ్మింగ్ పూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మొత్తం 170 మంది స్విమ్మర్లు పోటీపడ్డారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, కార్యదర్శి బత్తుల సుందర్‌రెడ్డిలు మాట్లాడుతూ యువతను క్రీడలపైన ఆసక్తి కల్పించేందుకు ఈ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ సందూరి త్రినాథ్, జాయింట్ సెక్రటరీ మద్దినేని శ్రీనివాస్, యడ్ల పార్థసారథిలు క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. క్లబ్ ప్రతినిధులు సాగర్, దేవా, బాచీ, విష్ణు, తొండేపు ఉదయ్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రాష్ట్ర ప్రజలు వినియోగించుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు సూచించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు, ఆస్తులు అన్యాకాంత్రానికి గురైన సంగతి విదితమేనన్నారు. వైసీపీ భూ బకాసురుల కబంధహస్తాలో ఉన్న భూములకు విముక్తి కలిగించేందుకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి, వైసీపీ నాయకుల వలన ఇబ్బంది పడిన ప్రతి ఒక్క బాధితుడికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని, రాష్ట్ర ప్రజలు నియోజకవర్గాల వారీగా జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 9 వరకు ఈ సదస్సులను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు.

జగన్ అరాచకాలను ఎండగట్టినందుకే పత్రికల మీద కేసులు

● టీడీపీ నాయకుడు బెజవాడ నజీర్

పటమట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగన్ అవినీతిని ఎండగట్టినందుకే మీడియా సంస్థలపై కక్షసాధింపు చర్యలకు ఒడిగడుతున్నాడని టీడీపీ నాయకుడు బెజవాడ నజీర్ విమర్శించారు.

మంగళవారం ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, నిష్పక్ష పాతంగా అను నిత్యం వార్తలు ప్రచురిస్తున్న ఆంధ్రజ్యోతి తదితర పత్రికలపై ఢిల్లీ హైకోర్టులో దావా వేసిన జగన్‌పై నజీర్ నిప్పులు చెరిగారు. సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌పై లేనిపోని అభాండాలు వేస్తూ, వ్యక్తిగత దూషణలకు ఒడిగడుతూ నీ సొంత మీడియాలో ప్రచారం చేసి పైశాచిక ఆనందం పొందడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. విలువలు గురించి జగన్ మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని బెజవాడ నజీర్ విమర్శించారు.


బాలికపై అఘాయిత్యం

● యువకుడిపై పోక్సో కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన బాలిక(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. సోమవారం కాలేజీకి వచ్చిన బాలికకు తన్నేరు ప్రసన్న కుమార్ అనే యువకుడు మాయమాటలు చెప్పి న్యూ రాజరాజేశ్వరిపేటలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

స్టార్ తిరిగేనా?



క్రిస్మస్ వచ్చిందంటే చాలు క్రిస్మస్ ట్రీలకు, స్టార్లకు మంచి డిమాండ్ ఉంటుంది. నగరంలోని అన్ని చర్చిలపై చిన్న స్టార్ నుంచి పెద్ద స్టార్ వరకు ఏర్పాటు చేస్తుంటారు. అయితే వీటి తయారీనే జీవనాధారంగా చేసుకుని ఎంతోమంది ఎంతో కొంత ఉపాధి పొందుతున్నారు. ఒక్కో స్టార్ సైజును బట్టి రూ.200 నుంచి రూ.4వేల వరకు అమ్ముతారు. అయితే ఇలాంటి పండుగలొచ్చినప్పుడే వీరికి డిమాండ్, మిగతా రోజుల్లో నిల్. ఏ కూలికో నాలికో వెళ్లాల్సిందే. ఇటువంటి చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఉపాధి మార్గాలను అన్వేషించాలి. విజయవాడ నగరంలోని మొగల్రాజపురంలో ఉన్న మధు గార్డెన్ వద్ద ఈ స్టార్‌ల తయారీదారులున్నారు. ఫ్యాక్టరీలలో తయారు చేసే స్టార్ల కన్నా ఇవి నాణ్యంగా ఉంటాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పట్టభద్రుల ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలు వెల్లడవుతున్నాయి. ఇటీవల పట్టభద్రుల ముసాయిదా జాబితాను నవంబరు 23న ప్రకటించారు. ఈ జాబితాలో 2,90,970 మంది ఓటర్లున్నట్టు ఎన్నికల అధికారి, గుంటూరు డీఆర్వో ఖాజావలి ప్రకటించారు. తాజాగా అభ్యంతరాలతో పాటు నూతన ఓటర్ల నమోదుకు పెంచిన గడువు సోమవారంతో ముగిసింది. 63,607 దరఖాస్తులందాయి. డూప్లికేట్లు 2300 ఉన్నట్టు ఫిర్యాదు లు అందాయి. ఫారం- 8లో వయసు, తండ్రి, ఓటరు పేరు, ఇంటి నెంబర్లలో తప్పులు దొర్లిన సవరణలు 13వేలున్నాయి. ఇలా 63,607 దరఖాస్తుల్లో 15,300 దరఖాస్తులు పోగా కొత్తగా రెండో సారి 48,307 మంది ఓటర్లు చేరారు. గతంలో ఓటర్ల ముసాయిదాలో 2,90,970 మంది ఓటర్లకు కలిపితే 3,39,275 మంది ఓటర్లు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి, కృష్ణాజిల్లాతో పా టు ఎన్టీఆర్, ఏలూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వచ్చిన దరఖాస్తులను గుంటూరు డీఆర్వో ఖాజావలి పరిశీలిస్తున్నారు. ఈనెల 25లోగా పరిశీలన ముగించి 30న తుది జాబితా ప్రకటించనున్నారు. పరిశీలనకు అధికారులు, సిబ్బందిని నియమించినట్టు ఖాజావలి ఆంధ్రజ్యోతికి తెలిపారు.



జిందాల్ ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యే పుల్లారావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు

డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రం

- వచ్చే ఏడాది అక్టోబరు 2 నాటికి తీర్చిదిద్దుతాం
- త్వరలో మరో ఐదు జిల్లాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ
- పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్లాంట్ పరిశీలన

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా వచ్చే ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. దానికోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో కృషి చేస్తున్నామని చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు పంచాయతీలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని మంత్రి నారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలలో కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్యలో ఘన వ్యర్థాల నిర్వహణపై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలతో రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా అప్పట్లో గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టామన్నారు.

వైసీపీ అసమర్థ నిర్వహణ

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యర్థాల అసమర్థ నిర్వహణ వల్ల రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే ఆ వ్యర్థాలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం విధించిన చెత్తపన్నును రద్దుచేసి ప్రజలపై భారం తగ్గించామన్నారు. రాష్ట్రంలో రోజూ సుమారు 6,890 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, ఉమ్మడి గుంటూరు జిల్లా, విశాఖలోని జిందాల్ ప్లాంట్లలో 2,160 టన్నుల వ్యర్థాలను(31 శాతం) ట్రీట్మెంట్ చేస్తున్నారని తెలిపారు. ఆ ప్లాంట్ల ఏర్పాటుతో 50-60 కిలోమీటర్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అమృత్-2, ఏఐఐబీ నిధులు కేంద్రం నుంచి సక్రమంగా అందలేదన్నారు. త్వరలో వాటి సద్వినియోగంపై దృష్టి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు, జిందాల్ ఏపీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) ఎంవీ చారి తదితరులు పాల్గొన్నారు.



ఏకే ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న షెహ్‌జాది

ఉర్దూ స్కూల్‌ను తనిఖీ చేసిన షెహ్‌జాది

భవానీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 41వ డివిజన్‌లోని ఎస్ఎంఏకే ఉర్దూ పాఠశాలను జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్ షెహజాది మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాటామంతి నిర్వహించి వారికందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు. సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ నరీన్ బేగం, ఉమ్మడి కృష్ణా జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి అబ్దుల్ రబ్బాని పాల్గొన్నారు.

రేపు ఎస్ఆర్ఆర్‌లో జాబ్‌మేళా

గుణదల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఆలోచనతో డీఆర్‌డీఏ, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జాబ్ మేళాకు టెన్త్ నుంచి పీజీ వరకు చదివినవారు ఎవరైనా హాజరుకావచ్చన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు జాబ్ మేళాను పర్యవేక్షించనున్నరన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యేవారు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలన్నారు. వివరాలకు 7799669907 నెంబరుకు కాల్ చేయాలని కోరారు.



రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో రోడ్డు అభివృద్ధి

- కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో 17 ప్రాంతాల్లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ పద్ధతి) రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని 17 ప్రాంతాల్లోని రోడ్లను కమిషనర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సర్కిల్-1 పరిధిలోని బీఆర్‌పీ రోడ్డు, నెహ్రూరోడ్డు, కేటీరోడ్డు కుమ్మరిపాలెం, సితార సెంటర్ నుంచి సీవీఆర్ ఫ్లై ఓవర్ వరకు 7.37 కిలోమీటర్ల రోడ్లను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయబోతున్నట్టు తెలిపారు. అలాగే సర్కిల్-2లో బీఆర్‌టీఎస్ రోడ్డు, సాంబమూర్తిరోడ్డు, బీఎస్‌రాజురోడ్డు, సుమారు 7.27 కిలోమీటర్లు రోడ్లను, సర్కిల్-3లో హెచ్‌బీలైన్‌రోడ్డు, గురునానక్‌కాలనీ మెయిన్‌రోడ్డు, పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డు, టిక్కిల్‌రోడ్డు, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్ నుంచి సిద్ధార్థ సర్కిల్ వరకు మదర్ థెరిసా సర్కిల్ నుంచి అమ్మ కల్యాణ మండపం వరకు, పీవీపీ మాల్ నుంచి రమేష్ హాస్పటల్ వరకు 8.37 కిలోమీటర్ల మేరకు రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సామ్రాజ్యం, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్‌లో జెస్సీరాజ్‌కు రజతం



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని పొల్లాచీ నగరంలో జరుగుతున్న 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో నగరానికి చెందిన 9వ తరగతి చదువుతున్న మాత్రపు జెస్సీరాజ్ రజతంతో సత్తా చాటింది. దేశవ్యాప్తంగా వెయ్యి మంది క్రీడాకారులు పోటీపడగా, 14-17 ఏజ్ గ్రూప్‌లో జెస్సీరాజ్ సోలో డ్యాన్స్‌లో రజతాన్ని తన ఖాతాలో వేసుకుంది. జాతీయ పతకం సాధించిన జెస్సీరాజ్‌ను ఆర్టిస్టిక్ ఇండియన్ చైర్మన్ ప్రదీప్‌క్ మాల్వాయి, ఏపీ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ ఆకుల ప్రవీణ్‌కుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్ చౌదరి, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. విశేషమేమిటంటే ఈ పతకంతో ఇప్పటి వరకు జెస్సీరాజ్ సాధించిన పతకాల మైలురాయి హాఫ్ సెంచరీకి చేరింది.

చైత్రదీపికకు కాంస్యం



ఇదే చాంపియన్‌షిప్‌లో 14-17 ఏజ్‌గ్రూప్‌లో నగరానికి చెందిన మరో క్రీడాకారిణి పి.చైత్రదీపిక కాంస్యంతో సత్తా చాటింది. రాష్ట్రం తరఫున కపుల్ డ్యాన్స్ స్కేటింగ్‌లో దీటైన ప్రదర్శనతో కాంస్యం తన ఖాతాలో వేసుకుంది. చైత్రదీపికకు ఇది 11వ జాతీయ పతకం కావడం గమనార్హం. చైత్రదీపికను రైల్వేస్ డీసీఎం కే కమలాకర్‌బాబు, కృష్ణా వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామకృష్ణారావు అభినందించారు.

కృష్ణా వర్శిటీ వాలీబాల్‌లో సిద్ధార్థకు రన్నరప్

నున్నలో ఇటీవల జరిగిన కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నీ పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల టీమ్ రన్నరప్‌ను వశం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ ఎం రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టీవీపీ కృష్ణారెడ్డి అభినందించారు. వర్శిటీ జట్టులో కళాశాలకు చెందిన లక్ష్మీ, శివ అనే క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు.

పేదరికం చదువుకు ఆటంకం కారాదు

- రాయల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు
- ఇప్పటి వరకు రూ.కోటి వరకు పంపిణీ

పటమట-ఆంధ్రజ్యోతి: వారందరూ సమాజంలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారే. సమాజానికి తమ వంతుగా ఏదో చేయాలనే తలంపుతో 2017లో వ్యవస్థాపక అధ్యక్షుడు పేటేటి పుల్లయ్య ఆధ్వర్యంలో రాయల్ సర్వీస్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. కొంతమంది దాతలు, ట్రస్టీల ఆర్థిక సాయంతో ప్రారంభించిన మొదటి ఏడాది రూ.1.30లక్షలతో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ప్రస్తుతం రాయల్ సర్వీస్ ట్రస్ట్‌కు శీతాలం రాంబాబు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రతిభ కలిగిన పేద మధ్య తరగతి విద్యార్థులకు పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఉపకారవేతనాలను అందజేస్తున్నామని రాంబాబు తెలిపారు. 2017 మొదలైన ఈ పంపిణీ 2024-25లో 257 మందికి రూ.22,00,00 అందజేశారు. ఈ మొత్తం ఇప్పటి దాకా రూ.కోటి చేరిందని సభ్యులు తెలిపారు. డిసెంబరు 8న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపకార వేతనుల అందజేసినట్టు వారు తెలిపారు. సంస్థ ప్రారంభించినప్పుడు ఒక పేద విద్యార్థి ఎంఎస్ చేయటానికి అమెరికా వెళుతుంటే విమాన టిక్కెట్లను ట్రస్ట్ సమకూర్చిందన్నారు. ఈ ఉపకార వేతనాల పంపిణీకి రాష్ట్ర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆకుల శేషసాయిబాబా, అటామిక్ రీసెర్చ్ సెంటర్ రిటైర్డు సైంటిస్ట్ ఆర్వీ సుబ్బారావు, వైఎస్ కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో కండరాల బలహీనతతో బాధపడుతున్న ముగ్గురికి రూ.1.70 లక్షలు విలువైన పవర్ ఆపరేటివ్ వీల్‌చైర్స్ అందజేయాలని తెలిపారు. వివిధ వ్యాధులతో బాధలు పడుతున్న నలుగురికి వైద్య చికిత్స నిమిత్తం రూ.5.47లక్షలు ట్రస్ట్ అందజేసింది. లాక్‌డౌన్ సమయంలో 600 మందికి దినసరి శ్రామికులకు రూ.2,26,815 విలువైన నిత్యావసరాలను అందించినట్టు సభ్యులు తెలిపారు. నలుగురు పేద విద్యార్థులను దత్తత తీసుకుని ఫీజులు చెల్లిస్తున్నామని అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. ట్రస్ట్‌కు ఉపాధ్యక్షుడిగా ఈమని దామోదరరావు, సెక్రటరీ తోట పద్మనాభరావు, ట్రెజరర్‌గా అంకం రామసాయి ప్రసాద్ కొనసాగుతున్నారని తెలిపారు.



విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్న జస్టిస్ శేషసాయి



- నేను విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సెకెండియర్ చదువుతున్నాను. రాయల్ ట్రస్ట్ వారి ఆర్థిక సాయం నా చదువు కొనసాగించటానికి బాగా ఉపయోగపడుతుంది. **- దూళిపాళ మేఘన**



- పనస పావని అనే క్రాంతి ట్రాన్స్‌పోర్టు చిరుద్యోగి కుమార్తె. దాత కుప్పాలి శ్రీనివాసరావు సౌజన్యంతో ఆమె చదువుకయ్యే ఖర్చు ట్రస్ట్ భరిస్తుంది. ప్రస్తుతం ఆమె ఎన్టీఆర్ వైద్య విద్యాలయంలో హౌస్ సర్జన్ పూర్తిచేసింది. ఇంతకన్నా ఆనందం ఏముంది. **- పేటేటి పుల్లయ్య, ట్రస్ట్ వ్యవస్థాపకులు**



- ప్రతిభ ఉండి, అవకాశాలు, ఆర్థిక సంపత్తి లేక ఉన్నత విద్యను కొనసాగించలేని యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఉపకార వేతనాలను అందజేస్తున్నాం. స్వయం శక్తితో ఉన్నతస్థాయికి చేరిన ప్రముఖులచే ప్రేరణ కలిగించే ఉపన్యాసాలను విద్యార్థులకు ఇప్పిస్తున్నాం. **- శీతాలం రాంబాబు, ట్రస్ట్ అధ్యక్షులు**



- నేను ఒంగోలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సెకెండియర్ చదువుతున్నా. నా చదువుకు రూ.6వేల ఖర్చు, ప్రతి ఏడాది రూ.80 వేలు రాయల్ ట్రస్ట్ చెల్లిస్తోంది. ట్రస్ట్‌కు నా కృతజ్ఞతలు. **- సాక్షి అనురాధ ,మెడికల్ విద్యార్థి**

సూర్యఘర్‌కు అంబాసిడర్లుగా ప్రజల్లో స్ఫూర్తి నింపాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం (సౌర విద్యుత్) అమలుకు అంబాసిడర్లుగా ప్రజల్లో స్ఫూర్తి నింపి లబ్ధిదారులుగా రిజిస్ట్రేషన్ చేయించుకొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ, గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన విధి విధానాలు, ప్రయోజనాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అత్యంత చేరువలో అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తొలుత పథకం కింద లబ్ధిపొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆపై తమ పరిధిలోని ప్రజలకు పథకంపై అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు చేయిపట్టి నడిపించాలన్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకొని కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, నోడల్ అధికారి ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయ మైనార్టీ కమిషనర్ మెంబర్‌ను కలిసిన కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక : జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్ షాహెజాదిని మంగళవారం విజయవాడలోని హోటల్ వివంతలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.

మాజీ మంత్రి దేవినేని ఉమాపై కేసు కొట్టివేత

విజయవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుపై నమోదైన కేసును విజయవాడలోని చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు మంగళవారం కొట్టివేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని షాబాద్ - జక్కంపూడిలో వైసీపీ హయాంలో అక్రమ మైనింగ్‌ను పరిశీలించడానికి 2020 నవంబరు మూడో తేదీన ఆయన వెళ్లారు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ సీఎంఎం కోర్టులో సాగింది. మొత్తం 25 మంది సాక్షులను విచారించారు. ఉమామహేశ్వరరావు తరఫున న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. సరైన సాక్ష్యాలు లేకపోవడంతో న్యాయాధికారి ఎస్.రాజశేఖర్ కేసును కొట్టివేస్తూ తీర్పును ఇచ్చారు.



సీ క్యాబ్ యంత్రంతో వృక్షాల సుందరీకరణ

అమరావతి పచ్చదనానికి మెరుగులు

- ఎస్‌టీఎంపీ అల్ట్రాతో వృక్షాల సుందరీకరణ
- దేశంలోనే మొట్టమొదటి సీ క్యాబిన్ ట్రీ ట్రిమ్మర్

కృష్ణలంక, డిసెంబరవు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరాతిని వివిధ రకాల వృక్షజాతులతో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సిస్ రోడ్డు)పై పచ్చనిచెట్లు కనువిందు చేస్తున్నాయి. ఎడమవైపు 15 మీటర్ల బఫర్‌జోన్ శోభాయమానంగా రూపుదిద్దుకుంది. రహదార్లపై ఆహ్లాదకరమైన వృక్షాలను అందంగా పెంచేందుకు ఎస్‌టీఎంపీ-26 అల్ట్రా సీ క్యాబ్‌ను అమరావతి అభివృద్ధి సంస్థ కొనుగోలు చేసింది. ఇది పూర్తి ఇటాలియన్ టెక్నాలజీతో పనిచేస్తుంది. మొక్కలు, చెట్లను నిర్ణీత ఎత్తులో క్రమపద్ధతిగా తీర్చిదిద్దడానికి అత్యుత్తమ ప్లాట్‌ఫాం ఈ సీ క్యాబ్.

గంటకు 40 చెట్లు ట్రిమ్మింగ్

ఎస్‌టీఎంపీ - 26 అల్ట్రా సీ క్యాబ్ 22 హెచ్‌పీ ఒక గంటకు 40 చెట్లను ట్రిమ్మింగ్ చేయగల సామర్థ్యం కలిగింది. 30 అడుగుల ఎత్తులోని చెట్ల కొమ్మలను సైతం సున్నగా చేస్తోంది.సీప్ క్యాబిన్ మోడల్‌తో ఏకకాలంలో ఇద్దరు పనిచేయగల సీ క్యాబ్ దేశంలో మొట్టమొదటి యంత్రం. ఒక కార్మికుడు కొమ్మలు ట్రిమ్ చేస్తుంటే మరొకరు పురుగు నివారణ మందులు పిచికారీ చేసుకొనే వీలుంది. గంటకు 3 లీటర్ల చమురు మాత్రమే తీసుకొనే సీ క్యాబ్‌తో వృక్షజాల నిర్వహణకు బహుళ ప్రయోజనకరం. సీ క్యాబ్‌తో పచ్చదనం నిర్వహణ సమర్థవంతంగా చేపట్టవచ్చు.

డ్రైవర్ అనుమానాస్పద మృతి

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గన్నవరం పూర్వ తహసీల్దార్ వద్ద కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న ముదురుకోల గోపి సోమవారం రాత్రి తానుంటున్న ఇంటిలో ఉరేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటనపై భవానీపురం పోలీసులకు మృతుడి భార్య భవానీ ఫిర్యాదు చేసింది. గొల్లపూడిలోని నేతాజీ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద నివాసం ఉంటున్న భవానీ, గోపీలకు నాలగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప. గోపి అయ్యప్ప మాల వేసుకుని ఈ నెల 15న శబరిమలకు ప్లాన్ చేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భవానీ గుడివాడలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో గోపి వీడియో కాల్ చేసి తన కుమార్తెను చూపించమని అడిగాడు. వీడియో కాల్‌లో చూపించింది. అప్పుడు గోపి మాట్లాడుతూ 'తనవల్ల కావటం లేదు పాప జాగ్రత్త, నేను బతకలేను' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. దీంతో ఆమె తన అన్నయ్య నాగబాబుకు, పామర్రులో ఉంటున్న మామయ్య కొడుకు మణికంఠకు సమాచారం ఇవ్వటంతో వాళ్లు రాత్రి 7.30 గంటల సమయంలో గొల్లపూడికి వచ్చి గోపి నివాసం ఉంటున్న 2వ ఫ్లోర్‌లోకి వెళ్లి చూశారు. తలుపు తీసి చూడగా హాలులో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని చనిపోయిన స్థితిలో వేలాడుతూ గోపి కనిపించాడు. దీంతో భవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతను వీడియో కాల్‌లో 'తన వల్ల కావడం లేదు' అనే మాట ఎందుకు చెప్పాడన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

నూతన ఆవిష్కరణతోనే సాంకేతికాభివృద్ధి

- పాలిటెక్ ఫెస్ట్‌లో ఎమ్మెల్సీ అశోక్ బాబు

కృష్ణలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేటి యువతలో ఆలోచన శక్తితో రూపొందించిన ఆవిష్కరణలో భవిష్యత్‌లో సాంకేతికాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్సీ పి.అశోక్ బాబు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024ను మంగళవారం ఆయన సందర్శించి ఆవిష్కరణలను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.మధుసూధనరావు, కె.విజయభాస్కర్, బి.భీమానాయక్, ఎం.నాగరాజు, ఎ.శివప్రసాద్, టి.కొండారెడ్డి, బి.శైలజ, బి.శ్రీనివాసరెడ్డి, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 400 పెన్షన్ న్యాయమా?

- 'సాధన' సభలో ఏపీసీపీఎస్ఈఏ నేతలు

విజయవాడ(ధర్నాచౌక్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు రూ.4000 పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం ఉద్యోగులకు 400 పెన్షన్ ఇవ్వడం భావ్యమా అని సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో 'సాధన' పేరుతో మంగళవారం సభ నిర్వహించారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా తమపై అక్రమంగా బనాయించిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీఎం దాస్ మాట్లాడుతూ వృద్ధులకు రూ. 4 వేలు ఇస్తున్న ప్రభుత్వం నలభై ఏళ్లుగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం నాలుగు వందల పెన్షన్ ఇవ్వడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా చిత్తశుద్ధితో ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తామన్నారు. 2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగంలో చేరిన వారికి సెంట్రల్ గవర్నమెంట్ మోమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సెంట్రల్ మోమో 41 ప్రకారం ప్రభుత్వం వాటాను 14 శాతానికి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్‌రాజు, ఆస్కారావు, ఏపీ సచివాలయం సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట్ల రాజేష్, ఏపీటీఎఫ్ నేత భానుమూర్తి, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, అధిక సంఖ్యలో సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కానింగ్‌కు వెళ్లిన యువతి పట్ల అసభ్య ప్రవర్తన!

- బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడి అరెస్టు
- ఘటనపై ముఖ్యమంత్రి ఆగ్రహం.. కఠిన చర్యలకు ఆదేశం

మద్దిలపాలెం, డిసెంబరు 10: విశాఖపట్నం రామ్‌నగర్‌లో గల కేర్ ఆస్పత్రిలో స్కానింగ్‌కు వెళ్లిన ఓ యువతి పట్ల సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు కేకలు వేస్తూ బయటకు రావడంతో కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని అతనికి దేహశుద్ధి చేశారు. ఇందుకు సంబంధించి సీఐ పి.రమణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కైలాసపురం ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువతి సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడింది. కుటుంబ సభ్యులను తీసుకుని కేర్ ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు పరిశీలించి యాంకిల్, పొట్ట స్కానింగ్ చేయించుకుని, రిపోర్టు తేవాలని సూచించారు. ఆమె అదే ఆస్పత్రిలోని ల్యాబ్‌కు వెళ్లగా స్కానింగ్ ఇన్‌చార్జి కె.ప్రకాష్ దుస్తులన్నీ తొలగించాలని చెప్పాడు. ఆ తర్వాత స్కానింగ్ నెపంతో ప్రైవేటు భాగాలు తాకడంతో యువతి కేకలు వేస్తూ రావడంతో ఆమె బంధువులు విషయం తెలుసుకుని ప్రకాష్‌కు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించింది. కాగా.. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదం వల్లే బాలిక మృతి

- నందికొట్కూరు ఘటన వివరాలు వెల్లడించిన పోలీసులు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో బాలిక మృతిపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, అయితే ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో బాలిక మృతి చెందిందని పోలీసులు చెప్పారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ మంగళవారం నందికొట్కూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపామని చెప్పారు. బాలిక గదిలో ఉన్న పెయింట్‌లో కలిపే టిన్నర్ డబ్బా తెరిచి ఉండడం, అలాగే వెలుగుతున్న మస్కిటో కాయిల్ కారణంగా మంటలు వ్యాపించాయని చెప్పారు. దీంతో బాలిక మంటల్లో కాలిపోయిందని చెప్పారు. బాలిక తాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక రెండేళ్లుగా నందికొట్కూరులో తాత ఇంటి వద్ద ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోందని తెలిపారు. మూడేళ్ల క్రితం వెల్దుర్తి మండలంలో పదో తరగతి చదువుతున్నప్పటి నుంచి బాలిక, రాఘవేంద్ర అనే యువకుడు ప్రేమించుకుంటున్నారని చెప్పారు. ఈ సాన్నిహిత్యంతోనే గత ఆదివారం రాత్రి నందికొట్కూరులో బాలిక తాత ఇంట్లో బాలికతో పాటు యువకుడు ఉన్నాడని తెలిపారు.

బడులను ముంచేసిన జగన్

» 13,676 ప్రభుత్వ స్కూళ్లలో 20 మందిలోపే విద్యార్థులు

» ఏకోపాధ్యాయ బడులు 12,105.. తాజా నివేదికలో సర్కారు వెల్లడి

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ నిర్వాకంతో ప్రాథమిక పాఠశాలలు నిండా మునిగాయి. రాష్ట్రంలో 20 మంది పిల్లలు కూడా లేని పాఠశాలలు 13,676కు పెరిగాయి. కేవలం ఒక్కరే టీచర్‌తో నెట్టుకొస్తున్న పాఠశాలలు 12,105 ఉన్నాయి. ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు కోసం రూపొందించిన నివేదికలో ఈ అంశాలను పేర్కొంది. ప్రాథమిక స్థాయిలో అభ్యసన ఫలితాలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపింది. దీనిని అధిగమించేందుకు 'ఆదర్శ పాఠశాల' విధానం తీసుకొచ్చే ప్రతిపాదన చేసింది. మౌలిక సదుపాయాల్లో 87 స్కూళ్లు జీరో స్టార్ రేటింగ్‌తో అత్యంత దయనీయంగా ఉన్నాయని, అకడమిక్ రేటింగ్‌లో 311 పాఠశాలలు జీరో రేటింగ్‌లో మిగిలిపోయాయని నివేదికలో పేర్కొంది.

రూ.6 కోట్ల పునరావాస ప్యాకేజీ హాంఫట్

» గిరిజనుల సొమ్ము కొట్టేసిన వైసీపీ నేతలు... టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

భూఆక్రమణలు, నకిలీ డాక్యుమెంట్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లపై టీడీపీ ప్రజావేదికలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అమూడా చైర్మన్ స్వామినాయుడు అర్జీలు స్వీకరించారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం చినరమణయ్యపేట, దండంగి, కె.వీరవరం గ్రామాల్లో వైసీపీ నేతలు ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి, రూ.6కోట్లుపైగా పునరావాస ప్యాకేజీని కొట్టేశారని దీనిపై విచారణ జరపాలని చినరమణయ్యపేటకు చెందిన మెహర్‌బాబుగౌడ్ విజ్ఞప్తి చేశారు.. కృష్ణా జిల్లా పాపవినాశనంలో గతంలో ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చినా.. స్థలాలు చూపించడం లేదని ఎస్సీ, ఎస్టీల పేదలు వాపోయారు. 40ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించి.. సుభాన్ అనే వ్యక్తి క్రషర్ ఫ్యాక్టరీ పెట్టాడని కర్నూలు జిల్లా మాచాపురానికి చెందిన దానమ్మ ఫిర్యాదు చేశారు. వైద్యారోగ్యశాఖలో ఎంపీహెచ్‌ఏలను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ ఎంపీహెచ్‌ఏలు కోరారు. ఈ సమస్యలపై మంత్రి తక్షణమే స్పందించి.. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కారానికి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆయుష్ మాజీ కమిషనర్‌పై విచారణ ప్రారంభం

ఆయుష్ మాజీ కమిషనర్ ఎస్.బి.రాజేంద్రకుమార్ అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. బుధవారం 40 మంది ఉద్యోగులతో విచారణాధికారి మాట్లాడనున్నారు. మాజీ కమిషనర్ చేసిన అక్రమాలు, మహిళా ఉద్యోగులపై వేధింపులు, అసభ్య ప్రవర్తనపై వారి నుంచి వివరాలు సేకరించనున్నారు. మహిళా ఉద్యోగులను రాజేంద్రకుమార్ వేధించినట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ప్రభుత్వం ఆరోగ్యశాఖ సర్వీసెస్ కార్యదర్శి ఇన్‌చార్జి ఆయుష్ కమిషనర్ మంజుల హోస్మనిని విచారణ అధికారిగా నియమించారు.

బ్లడ్ బ్యాంక్ వాహనాల్లో మందుల సరఫరా

» వైసీపీ హయాంలో నిర్లక్ష్యం.. కేంద్ర ప్రభుత్వం సీరియస్.. విచారణకు ఆదేశం

రక్తాన్ని మాత్రమే సరఫరా చేయాల్సిన వాహనాల్లో మందులు తరలించి వైసీపీ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీనిపై ఫిర్యాదులు అందడంతో సీరియస్ అయిన కేంద్రం విచారణకు ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు లేఖ రాసింది. 2023 డిసెంబర్, 2024 జనవరి నెలల్లో ఆయుష్ శాఖకు సంబంధించిన వాహనాలను మందుల సరఫరాకు ఉపయోగించారు. గత డిసెంబర్, జనవరి మధ్యలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆయుష్ కమిషనర్ ఎస్.బి.రాజేంద్రకుమార్‌కు ఏపీ శాక్స్ పీడీ బాధ్యతలు కూడా అప్పగించారు. రెండు విభాగాలకు ఆయనే ఉన్నతాధికారి కావడంతో బ్లడ్ బ్యాంక్ వాహనాల్లో ఆయుష్ విభాగం మందులను డిస్పెన్సరీలకు పంపించారు. దీనిపై సామాజికవేత్తలు కేంద్ర రక్తమార్పిడి సేవల విభాగానికి ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు..

» విజయసాయిరెడ్డిపై అనకాపల్లి పోలీసులకు ఫిర్యాదు

అనకాపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును తీవ్రపదజాలంతో అగౌరవపరచిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై మంగళవారం అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పటికి చంద్రబాబు బతికి ఉంటే అరెస్టు చేసి జైలులో పెడతామని విజయసాయిరెడ్డి అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బవులవాడకు చెందిన టీడీపీ నాయకుడు గుడాల సత్యనారాయణ అన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఐ నాగేశ్వరరావుకు ఫిర్యాదు అందజేశారు.

'పానుగంటి' బెయిల్ పిటిషన్ నేటికి వాయిదా

గుంటూరు లీగల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన పానుగంటి చైతన్య బెయిల్ పిటిషన్ మంగళవారం గుంటూరు కోర్టులో విచారణకు వచ్చింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో చైతన్య మొదటి నిందితుడు. ఆయన మంగళగిరి కోర్టులో లొంగిపోయి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసులో ప్రభుత్వం ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్‌ను స్పెషల్ పీపీగా నియమించింది. ఆయన కోర్టుకు రాలేకపోవటంతో బెయిల్ పిటిషన్ బుధవారానికి వాయిదా పడింది.





చిరిగిన చొక్కాను చూపిస్తున్న మంచు మనోజ్, జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి వద్ద మోహరించిన పోలీసులు, దుబాయ్ నుంచి తమ నివాసానికి చేరుకున్న విష్ణు

మంచు ఫైటింగ్స్

(మొదటిపేజీ తరువాయి)

అయ్యాయి. దీంతో జర్నలిస్టు సంఘాలు మోహన్‌బాబు వైఖరిని తీవ్రంగా ఖండించాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. కాగా, జల్‌పల్లిలో జరిగిన ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు మోహన్‌బాబు, మనోజ్ లైసెన్స్ గన్‌లను స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. బుధవారం విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ మోహన్‌బాబుకు రాచకొండ సీపీ నోటీసులు జారీ చేశారు. మోహన్‌బాబు నివాసం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు మోహన్‌బాబు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. అంతకుముందు తన కుమారుడు మనోజ్‌ను ఉద్దేశించి మోహన్‌బాబు ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. అందులో.. మనోజ్ ప్రవర్తనను తీవ్రంగా తప్పుబట్టారు. భార్య మాటలు విని తప్పుదారి పట్టావంటూ మనోజ్‌ను నిందించారు. ఇంట్లోకి వచ్చే అధికారం, హక్కు మనోజ్‌కు లేవని, తన కష్టార్జితమైన ఆస్తిని తనకు ఇష్టంవచ్చిన వారికి రాసిస్తానని పేర్కొన్నారు.

మనోజ్‌ను ఇంటి నుంచి వెళ్లగొట్టిన విష్ణు బౌన్సర్లు?

మోహన్‌బాబు పెద్ద కుమారుడు విష్ణు దుబాయ్ నుంచి మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు రావడంతో అప్పటిదాకా ఉన్న వివాదం కాస్తా పెద్దదైంది. జల్‌పల్లిలోని నివాసానికి చేరుకున్న విష్ణు.. వస్తూనే తన బౌన్సర్లు, తన తండ్రి మోహన్‌బాబు సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మనోజ్ బౌన్సర్లను బయటకు వెళ్లగొట్టినట్లు తెలిసింది. ఇంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారంటూ బౌన్సర్లను ఆయన కొట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో విష్ణు, మనోజ్ బౌన్సర్ల మధ్య గొడవ జరిగింది. దాంతో కాసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత మనోజ్‌ను ఆయన భార్య మౌనికను ఇంటి నుంచి బయటకు పంపినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు మీడియాలో వైరల్‌గా మారాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనోజ్ దంపతులు తెలంగాణ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ అభ్యర్థించారు. తిరిగి రాత్రి 7 గంటల సమయంలో వారు నివాసానికి చేరుకున్నారు. అయితే మనోజ్ దంపతులను ఇంట్లోకి రానివ్వకుండా మోహన్‌బాబు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొని గేట్లు మూసివేశారు. దాంతో ఆగ్రహానికి గురైన మనోజ్.. గేట్లు బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. ఇంట్లో తన పిల్లలు ఉన్నారని, వారి కోసం వచ్చానని చెప్పినా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో కాసేపు కారులో వేచి చూసిన మనోజ్.. గేట్లను బద్దలు కొట్టుకొని ఇంట్లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. లోపలికి వెళ్లిన మనోజ్‌ను సెక్యూరిటీ సిబ్బందితోపాటు మోహన్‌బాబు అడ్డుకున్నారు. అనంతరం మనోజ్ చిరిగిన చొక్కాతో బయటకు వచ్చారు.

మీడియాపై మోహన్‌బాబు దాడి..

మోహన్‌బాబు నివాసం వద్ద గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న పహాడీషరీఫ్ పోలీసులు సుమారు 50 మంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో ఇంట్లోంచి గేటు వద్దకు చేరుకున్న మోహన్‌బాబు.. అక్కడ జరుగుతున్న పరిణామాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. లోగోలను లాక్కొని కోపంతో ఊగిపోతూ విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామంతో ఒకరిద్దరు కెమెరామెన్‌లు కిందపడ్డారు. దాడిలో ఓ ప్రతినిధికి తల భాగంలో ఫ్రాక్చర్ అయినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా.. అక్కడ ఉన్న పోలీసులు మోహన్‌బాబును అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తాను 78 ఏళ్ల సీనియర్ సిటిజన్‌ను అని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరిన మోహన్‌బాబు.. వారి ఎదుటే మీడియాపై దాడి చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాడి ఘటనను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ), టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేశాయి. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. మరోవైపు అయ్యప్ప మాలధారణలో ఉన్న మీడియా ప్రతినిధిని మోహన్‌బాబు కొట్టడంపై అయ్యప్ప భక్తులు మండిపడినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. మోహన్‌బాబు ఇంట్లో ఉన్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు: మనోజ్

భార్యా పిల్లలతో ఇంటి నుంచి బయటకు వచ్చాక మనోజ్ మీడియాతో మాట్లాడారు. తన పోరాటం డబ్బు కోసమో, ఆస్తుల కోసమో కాదని, ఆత్మగౌరవం కోసమని అన్నారు. తన భార్య పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే.. ఇంటికి వచ్చి అన్ని వివరాలు తెలుసుకున్న ఎస్సై.. రక్షణ కల్పిస్తానని చెప్పి పారిపోయారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే తన మనుషులను బెదిరించి భయపెట్టి బయటకు వెళ్లగొట్టారని తెలిపారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సోమవారం రాత్రే తన ఇంట్లో జరుగుతున్న గొడవను మనోజ్ తన ట్విటర్ (ఎక్స్) ఖాతాలో వివరించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, ఉప ముఖ్యమంత్రులు, తెలంగాణ డీజీపీకి ట్యాగ్ చేశారు. ఇదిలా ఉండగా.. మూడు రోజులుగా మోహన్‌బాబు ఇంటి వద్ద ఇంత రచ్చ జరుగుతూ.. ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నా.. పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తండ్రీ కొడుకులు నెట్టుకున్నారంతే: పనిమనిషి

ఆస్తుల పంపకంతో పాటు మనోజ్ రెండో వివాహం కూడా మోహన్‌బాబు కుటుంబంలో గొడవలకు ప్రధాన కారణమనే అభిప్రాయం మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోన్న నేపథ్యంలో వారి ఇంటి పనిమనిషి కూడా అదే విషయాన్ని ప్రస్తావించింది. మోహన్‌బాబు కుటుంబంలో గొడవలకు కారణాలను ఆమె చెబుతుండగా ఓ మీడియా సంస్థ సీక్రెట్ కెమెరాతో రికార్డ్ చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అప్పటికే ఒక కుమారుడు ఉన్న మౌనికారెడ్డిని మనోజ్ వివాహం చేసుకోవడం మోహన్‌బాబుకు, విష్ణుకు నచ్చలేదని, ఆ వివాహం వల్ల వారు బాగా కలత చెందారని పనిమనిషి పేర్కొంది. ఆ పెళ్లి జరిగినప్పటి నుంచే కుటుంబంలో కలతలు మొదలయ్యాయని, దానికి కొనసాగింపుగానే సిబ్బందిని మందలించే క్రమంలో తాజా గొడవలు మొదలయ్యాయని ఆమె తెలిపింది. మోహన్‌బాబు వద్ద పని చేసే ప్రసాద్‌ను మనోజ్ ఒక దెబ్బ కొట్టారని, దాంతో మోహన్‌బాబు అడ్డుపడి మనోజ్‌ను పక్కకు నెట్టేశారని, అయినా మనోజ్ వినకపోవడంతో ఇద్దరూ నెట్టుకున్నారని పనిమనిషి చెప్పింది. ఇందులో ఎవరికీ దెబ్బలు తగల్లేదని పేర్కొంది. అయితే ఈ వీడియో వైరల్ కావడంతో పనిమనిషి ఆందోళనకు గురై, ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.



మీడియాపై దాడికి నిరసనగా మోహన్‌బాబు ఇంటి ముందు ధర్నా చేస్తున్న జర్నలిస్టులు



మనోజ్.. నా గుండెలపై తన్నావ్: మోహన్‌బాబు

తన చిన్న కుమారుడు మనోజ్‌ను తాను ఎంతో గారాబంగా పెంచానని, ఇప్పుడు అతడే తన గుండెలపై తన్నాడని మోహన్‌బాబు అన్నారు. ఈ మేరకు మనోజ్‌ను ఉద్దేశించి ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మోహన్‌బాబు మాట్లాడుతూ, "మనోజ్.. నిన్ను అల్లారు ముద్దుగా పెంచాను. నీ చదువు కోసం చాలా ఖర్చుచేశాను. నీ భార్య మాటలు విని నా గుండెలపై తన్నావ్. నా మనసు ఆవేదనతో కుంగిపోతుందిరా. నువ్వు ఏది అడిగితే అది ఇచ్చాను. నీకు అన్ని ఇచ్చినా నాకు అపకీర్తి తెచ్చి పెట్టావు. తాగుడుకు అలవాటుపడి చెడు మార్గంలో వెళ్తున్నావ్. కొన్ని కారణాల వల్ల ఇద్దరం ఘర్షణ పడ్డాం. ప్రతి ఇంట్లోనూ గొడవలు ఉంటాయి. ఇంట్లో ఉన్న అందరినీ ఎందుకు కొడుతున్నావ్? బతుకుదెరువు కోసం వచ్చిన పనివాళ్లను కొట్టడం మహాపాపం. నీ దాడిలో కొందరికి గాయాలయ్యాయి. అయినా కాపాడాను. విద్యాసంస్థల్లో ప్రతిది లీగల్‌గా ఉంది. నువ్వు అక్కడే చదువుకున్నావు. కుల మతాలకు తావులేకుండా మనం విద్యను అందిస్తున్నాం. మన దగ్గర చదువుకున్న వారు ఎంతో గొప్పవారు అయ్యారు. అన్నతో పాటు వినయ్‌ని కొట్టడానికి వచ్చావ్. నీ అన్నను చంపుతానని అన్నావు. నువ్వు నీ భార్య బిహేవ్ చేసే విధానం నీచం. ఎవరు తప్పు చేస్తున్నారనేది భగవంతుడు చూస్తున్నాడురా. అందరికీ మాట్లాడుకునేందుకు ఎంత అవకాశం ఇచ్చాం. నువ్వు ఎందుకిలా చేస్తున్నావ్? నా ఇంట్లో అడుగుపెట్టడానికి నీకు అధికారం లేదు. ఇది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రోడ్డుకెక్కి నా పరువు తీశావు. ఆస్తులు ముగ్గురికి సమానంగా రాయాలా..? వద్దా..? అనేది నా ఇష్టం. పిల్లలకు ఇస్తానా. దానధర్మాలు చేస్తానా అనేది నా ఇష్టం. మా నాన్నలు నాకు ఆస్తులు ఇవ్వలేదు. అయినా నేను సంపాదించుకున్నా. మనోజ్ నన్ను కొట్టలేదు. మేం ఇద్దరం ఘర్షణ పడ్డాం. నా ఇంట్లోకి నువ్వే అక్రమంగా చొరబడ్డావు. నా మనుషులను కొట్టావు. నాకు రక్షణ కావాలని పోలీసులను కోరాను. నీ కూతురును వచ్చి తీసుకెళ్లు. నా దగ్గర వదిలిపెట్టినా ఇబ్బంది లేదు. జరిగిన సంఘటనతో మీ అమ్మ ఆసుపత్రిలో చేరింది. పోలీసుల సమక్షంలోనే నీ బిడ్డను నీకు అప్పగిస్తా" అని తన ఆడియోలో మోహన్‌బాబు అన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

శకుంతలక్కయ్య వచ్చింది!



వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడడంతో ప్రమోషన్స్ జోరు పెంచారు. ఇటీవల టీజర్ విడుదల చేయగా, తాజాగా స్నేహ గుప్తా పాల్గొన్న 'శకుంతలక్కయ్య' పాటను రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను ఉమా నేహ పాడారు. సునీల్ కాశ్యప్ స్వర పరిచారు, రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కథానాయికలు. 'క', 'పొలిమేర 2', 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయం సాధించిన వంశీ నందిపాటి 'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.



ఐఏఎస్ ఆఫీసర్ సాహసాలు

రామ్‌చరణ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. రోజురోజుకీ అంచనాలు పెంచుకుంటున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది జనవరి పదిన విడుదల కానుంది.తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఐఏఎస్ ఆఫీసర్‌గా రామ్‌చరణ్ నటిస్తున్నారు. సినిమాలో హై రేంజ్ యాక్షన్ సీన్లు, పొలిటికల్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని దర్శకుడు చెబుతున్నారు. ఈ నెల 21న అమెరికా డల్లాస్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహించ నున్నారు. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, అంజలి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. దిల్ రాజు, శిరీష్ నిర్మాతలు.



షూటింగ్‌లో వీరమల్లు

పవన్‌కల్యాణ్ హీరోగా భారీ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరిహర వీరమల్లు' చిత్రం పార్ట్ వన్ షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. మంగళవారం పవన్‌కల్యాణ్ కు దర్శకుడు జ్యోతికృష్ణ సన్నివేశాన్ని వివరిస్తున్న స్టిల్‌ను విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఏమీ ఇవ్వలేదు కానీ ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ మాత్రం ఈ సినిమా ప్రోగ్రెస్‌ను వివరిస్తూ 'రెండు మూడు రోజుల వర్క్ మినహా ఫస్ట్ పార్ట్ షూటింగ్ పూర్తయింది. మరో వారం పది రోజుల్లో ఒక పాట విడుదల చేస్తారు. కచ్చితంగా వచ్చే ఏడాది మార్చి 28న సినిమా విడుదలవుతుంది' అని చెప్పింది. రాజమండ్రిలో ఒక షాప్ ఓపెనింగ్‌కు వెళ్లిన నిధి అందించిన సమాచారం ఇది. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకర రావుఈ సినిమాను నిర్మిస్తున్నారు.

హనుమంతుడిగా నటిస్తున్నా



సన్నీడియోల్

రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని దర్శకుడు నితీశ్ తివారీ రూపొందిస్తున్నారు. 'రాముడి పాత్ర పోషించాలనే నా కల ఈ సినిమాతో నెరవేరుతోంది. భారతీయ సంస్కృతీ సంప్రదాయలను, కుటుంబ విలువలను, అన్నదమ్ముల అనుబంధాన్ని చెప్పిన మమహా కావ్యం రామాయణం. దాని ఆధారంగా రూపొందుతున్న చిత్రంలో నేనూ ఉన్నందుకు ఆనందంగా ఉంది. ఫస్ట్ పార్ట్‌కి సంబంధించి నా వర్క్ పూర్తయింది. త్వరలో రెండో పార్ట్ షూటింగ్ మొదలవుతుంది' అని చెప్పారు రణబీర్. ఈ సినిమాలో తను హనుమంతుడి పాత్ర పోషిస్తున్నట్లు సన్నీ డియోల్ ఎట్టకేలకు చెప్పారు. తను ఆ పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరిగినా పెదవి విప్పని సన్నీ తొలిసారిగా 'రామాయణ' చిత్రం గురించి మాట్లాడుతూ 'ఈ సినిమాలో స్పెషల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది.. అవి చాలా సహజంగా ఉండేలా దర్శకుడు నితీశ్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'రామాయణ' గొప్ప సినిమా అవుతుందని నా నమ్మకం' అన్నారు. ఈ చిత్రం తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027లో విడుదలవుతాయి.

చిరంజీవి ఓకే చేసిన కథ



కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించారు. మూవీ ఈనెల 27న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మట్లాడుతూ 'ప్రొడ్యూసర్ బసవరాజు లహరిధర్ వాళ్ల నాన్నగారు శ్రీనివాస్, మెగాస్టార్ చిరంజీవి మంచి మిత్రులు. నేను కథను శ్రీనివాస్ గారికి చెప్పినప్పుడు ఆయన చిరంజీవికి చెబుతాం ఆయన ఒపీనియన్ తీసుకుందాం అన్నారు. కథ విని చిరంజీవి ఓకే చేశారు. అలా మెగాస్టార్ అంగీకారంతో 'డ్రింకర్ సాయి' మొదలైంది' అని తెలిపారు. నిర్మాత ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా రావడానికి టీమ్‌లోని ప్రతి ఒక్కరూ శ్రమించారు. చంద్రబోస్ ఆరు పాటలను అద్భుతంగా రాశారు. అవన్నీ కథను మరింత ఎలివేట్ చేసేలా ఉంటాయి' అని తెలిపారు. మరో నిర్మాత లహరిధర్ మాట్లాడుతూ 'థియేటర్స్‌లో మా మూవీని ఎంజాయ్ చేస్తారు. ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్‌కు బాగా నచ్చేలా ఉంటుంది' అని అన్నారు.

మంచి సినిమాకు హద్దులు ఉండవు



జోజు జార్జ్ మలయాళంలో నటించి దర్శకత్వం వహించిన 'పని' సినిమా ఈనెల 13న తెలుగులో విడుదలవుతోంది. అభినయ కీలక పాత్రలో నటించారు. ఆమ్ వర్ద్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం లాంచ్ చేశారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులోకి తీసుకొస్తుండటం సంతోషంగా ఉంది. ఇది మంచి థ్రిల్లర్ సినిమా. 2 గంటల పాటు ఆడియన్స్‌ను ఎంగేజ్ చేస్తుంది' అని అన్నారు. హీరో, దర్శకుడు జోజు జార్జ్ మాట్లాడుతూ 'నా దృష్టిలో మంచి సినిమాకు భాషా హద్దులు లేవు. ఏ భాషలో ప్రేక్షకులైనా ఆదరిస్తారు. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది' అని అన్నారు. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది అని అభియన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్, నటుడు జెమినీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం నవ్వించేలా



అంకిత్ కొయ్య, శ్రియా కొంతం హీరో హీరోయిన్లుగా శ్రీ హర్ష దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '14 రోజులు గర్ల్ ఫ్రెండ్ ఇంట్లో'. శ్రీ సత్య ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై సత్య నిర్మించారు. సోమవారం నిర్వహించిన ఈవెంట్‌లో ఈ సినిమా నుంచి స్నీక్ పీక్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సత్య మాట్లాడుతూ 'సెన్సిబుల్ మెసెజ్ ఇస్తూనే ఆద్యంతం నవ్వించేలా మూవీ ఉంటుంది. కొత్త కంటెంట్‌ను టాలీవుడ్‌కి ఇవ్వాలని అనుకున్నాం. అందుకే ఈ చిత్రాన్ని నిర్మించాం' అని అన్నారు. హీరో అంకిత్ కొయ్య మాట్లాడుతూ 'కొన్ని సార్లు ఎదుటి వాళ్ల కష్టాలను, బాధల్ని చూసి మనం నవ్వుకుంటాం. హర్ష అనే క్యారెక్టర్ తన గర్ల్ ఫ్రెండ్ ఇంటికి వెళ్లిన తరవాత డోర్ లాక్ అవ్వడం, ఇంట్లోనే పద్నాలుగు రోజులు ఉండటంతో ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి అనేది ఈ సినిమా కథ' అని తెలిపారు.

కొత్తవాళ్లతో హిట్ కొడతాం



సదన్, ప్రియాంక ప్రసాద్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పి.ఎల్.వి ఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మించారు. సాయికుమార్ ముఖ్య పాత్రలో నటించారు. సినిమా ఈనెల 13న రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి, హీరో సోహెల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 'ప్రణయగోదారి టీమ్ అంతా కలసి ఓ చిన్నారి గుండెకు శస్త్ర చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని అందించింది. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో 'సోహెల్ మాట్లాడుతూ 'ఈ మూవీ టీమ్‌లో అందరూ కొత్త వాళ్లే. అయినా హిట్ కొడతాం. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చాలా నేచురల్‌గా చేశారు. వారి కష్టాన్ని గుర్తించి థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి' అని అన్నారు. దర్శకనిర్మాత విఘ్నేశ్ మాట్లాడుతూ 'సినిమా తీయడం, రిలీజ్ చేయడం అంటే మామూలు విషయం కాదు. ఆ సంగతి నాకు ఇప్పుడు అర్థమైంది. డిస్ట్రిబ్యూటర్లు కూడా ముందుకు వచ్చి థియేటర్లు ఇస్తామన్నారు. అందరూ వచ్చి చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.

స్పోర్ట్స్

వారెవా.. నితీశ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో అరంగేట్రం చేసిన టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకొంటున్నాడు. ఆసీస్‌తో జరిగిన రెండు టెస్టుల్లోనూ 41, 38 నాటౌట్, 42, 42 పరుగులు సాధించిన నితీశ్.. ఆస్ట్రేలియా గడ్డపై ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక (7) సిక్సర్లు బాదిన భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. ఈ క్రమంలో సెహ్వాగ్ (2003-04 సిరీస్‌లో 6 సిక్సర్లు) రికార్డును అధిగమించాడు.



ప్యాట్ కమిన్స్, బోలాండ్ బౌలింగ్‌లో రెండేసి సిక్స్‌లు కొట్టిన నితీశ్.. మార్ష్, స్టార్క్ బౌలింగ్‌లో చెరొకటి సాధించాడు. పెర్త్ టెస్టులో లబుషేన్ బౌలింగ్‌లో మరో సిక్స్ కొట్టిన నితీశ్ మొత్తంగా ఈ టూర్‌లో ఏడు సిక్స్‌లు ఖాతాలో వేసుకొన్నాడు. అయితే, ఓవరాల్‌గా చూస్తే ఆస్ట్రేలియా గడ్డపై రిషభ్ పంత్ (9 టెస్టుల్లో 10 సిక్సర్లు), రోహిత్ శర్మ (8 టెస్టుల్లో 10), సెహ్వాగ్ (8) అత్యధిక సిక్స్‌లు కొట్టిన భారత ఆటగాళ్లలో టాప్-3లో ఉన్నారు. ముఖ్యంగా లోయరార్డర్‌లో పవర్‌ఫుల్ షాట్లతో నితీశ్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. బంతి ఎంత వేగంగా వస్తే.. అంత వేగంగా షాట్లు ఆడడం అతడి ప్రత్యేకత. ఇక, నితీశ్ లాఫ్టెడ్ షాట్లు 60 కిమీ వేగంతో వెళ్లడం కామెంటేటర్లనే ఆశ్చర్యపర్చింది. అంతేకాకుండా ఆడిన తొలి నాలుగు ఇన్నింగ్స్‌లో మూడుసార్లు అత్యధిక స్కోర్లు చేసిన బ్యాటర్‌గా.. సునీల్ గవాస్కర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. 1971లో అరంగేట్రం చేసిన గవాస్కర్ తొలి టెస్టులో 65, 67 పరుగులు.. రెండో టెస్టులో 116, 64 నాటౌట్ స్కోరు చేశాడు. 53 ఏళ్ల తర్వాత నితీశ్ అంతటి ఘనతను అందుకొన్నాడు.

ఫిక్సర్ ధిల్లాన్‌పై ఆరేళ్ల నిషేధం

దుబాయ్: అబుదాబి టీ10 లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు యత్నించిన మాజీ అసిస్టెంట్ కోచ్ సన్నీ ధిల్లాన్‌పై ఐసీసీ కఠిన చర్యలు తీసుకొంది. ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అవినీతి నిరోధక కోడ్‌ను ఉల్లంఘించిన అతడిపై ఆరేళ్ల నిషేధం విధించింది. ధిల్లాన్‌పై ఆరోపణలు వెలుగుచూడడంతో గతేడాది తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి నిషేధం అమలు కానుంది. 2021 అబుదాబి లీగ్‌లో ధిల్లాన్‌తో సహా ఎనిమిది మంది మ్యాచ్ ఫలితాన్ని మార్చే విధంగా ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలు నమోదయ్యాయి. విచారించిన ట్రైబ్యునల్ సన్నీపై నిషేధం విధిస్తూ తీర్పునిచ్చింది.



విరాట్ కోహ్లీ బ్యాక్‌ఫుట్ ప్రాక్టీస్

మూడో టెస్టుకు టీమిండియా సన్నాహకాలు

చెమటోడ్చారు..

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్లు అత్యంత పేలవ ప్రదర్శనతో విమర్శల పాలయ్యారు. ఆ టెస్టులో పది వికెట్ల తేడాతో ఓటమిపాలవడం అభిమానులను నిరుత్సాహపరిచింది. దీంతో 14 నుంచి జరిగే గాబా టెస్టు కోసం మనోళ్లు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడుస్తున్నారు. మరోవైపు ఆసీస్ జట్టు బ్రిస్బేన్‌కు పయనం కాగా.. భారత జట్టు మాత్రం అడిలైడ్‌లోనే సాధన చేస్తోంది. 'మూడో టెస్టు కోసం ఇక్కడి నుంచే మా సన్నాహకాలను సాగించబోతున్నాం' అంటూ బీసీసీఐ తమ ఆటగాళ్ల సాధన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అడిలైడ్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమయ్యారు. ఆరో నెంబర్‌లో బరిలోకి దిగిన రోహిత్ 3,6 పరుగులు మాత్రమే చేశాడు. తన చివరి 12 ఇన్నింగ్స్‌ల్లో కేవలం ఒక అర్ధసెంచరీ మాత్రమే సాధించడం గమనార్హం. ఇక విరాట్ సంగతికొస్తే.. 16 నెలల సెంచరీ కరవును పెర్త్ టెస్టులో తీర్చుకుని అందరినీ అలరించాడు. కానీ ఆ వెంటనే రెండో టెస్టులో తన బలహీనతను బయటపెట్టుకుని 7,11 స్కోర్లకే వెనుదిరిగాడు. ఈ నేపథ్యంలో తను ఈసారి ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కోవాలనే ఉద్దేశంతో మంగళవారం సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేశాడు. ఎక్కువగా బ్యాక్‌ఫుట్ షాట్లను ఆడాడు. అలాగే రాహుల్ డిఫెన్స్, పంత్ పికప్ షాట్లను ప్రాక్టీస్ చేశారు. బుధవారం జట్టు బ్రిస్బేన్‌కు పయనం కానుంది.



బుమ్రా గాయపడ్డాడా?

భారత స్టార్ పేసర్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఆసీస్ మాజీ పేసర్ ఫ్లెమింగ్ సందేహం వ్యక్తం చేశాడు. రెండో టెస్టు రెండో రోజున కండరాలు పట్టేయడంతో ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. అయితే ఇది కేవలం తిమ్మిరి ప్రభావమేనని బౌలింగ్ కోచ్ మోర్కెల్ తెలిపాడు. కానీ ఆ తర్వాత అతడి బౌలింగ్‌లో వేగం తగ్గిందని ఫ్లెమింగ్ గుర్తుచేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో తను కేవలం 130కి.మీ వేగంతోనే బంతులు విసిరాడని, ఇదే అతడి ఫిట్‌నెస్‌పై అనుమానాలను రేకెత్తిస్తోందని అన్నాడు. దీనికి తగ్గట్టుగా మ్యాచ్ ముగిశాక భారత్ ప్రాక్టీస్ సెషన్లలోనూ బుమ్రా పాల్గొనలేదు.

విరాట్ టెక్నిక్ మారింది: హర్భజన్

గాబా బౌన్సీ పిచ్‌పై పరుగులు సాధించేందుకు విరాట్ ఎలా ప్రాక్టీస్ చేస్తున్నాడో మాజీ స్పిన్నర్ హర్భజన్ వివరించాడు. 'విరాట్‌తో నేను చాలా క్రికెట్ ఆడాను. తను ఎక్కువగా ఫ్రంట్ ఫుట్ ఆడతాడు. కానీ బ్రిస్బేన్‌లోని బౌన్స్‌ను ఎదుర్కోవాలంటే ఇలాంటి శైలి సరిపోదు. ఇక్కడ మెరుగ్గా ఆడిన పాంటింగ్, స్టీవ్ వా, లాంగర్, హేడెన్‌లంతా బ్యాక్‌ఫుట్ ప్లేయర్లు. అందుకే విరాట్ కూడా ఇదే రీతిన ఆడేందుకు ప్రాక్టీస్ చేస్తున్నాడు. మంగళవారం నాటి నెట్స్‌లో తను చాలా బంతులను బ్యాక్‌ఫుట్‌లో ఆడడాన్ని గమనించాను. అయితే ఫుల్లర్ బంతులను ఆడేందుకు ముందుకు వెళ్తున్నాడు. వాటిని వదిలేయడమే మంచిది. గాబా పిచ్ ఎలా స్పందిస్తుందో అతనికి బాగా తెలుసు. అందుకే బ్యాక్‌ఫుట్ గేమ్‌ను ప్రాక్టీస్ చేస్తున్నాడు. కచ్చితంగా తను పుంజుకుంటాడనే నమ్మకం ఉంది' అని భజ్జీ తెలిపాడు.

సిరాజ్‌కన్నా షమి బెస్ట్: ఆండీ రాబర్ట్స్

భారత క్రికెట్‌లో మహ్మద్ షమినే ఉత్తమ బౌలర్ అని విండీస్ దిగ్గజం ఆండీ రాబర్ట్స్ అభిప్రాయపడ్డాడు. 'బుమ్రా ఎక్కువ వికెట్లు తీస్తుండవచ్చుగాక. కానీ షమిలో నిలకడ ఉంది. బంతితో చక్కటి సీమ్, స్వింగ్‌ను రాబట్టగలడు. సిరాజ్ అయితే షమీ దరిదాపుల్లోకి కూడా రాలేడు' అని రాబర్ట్స్ తేల్చాడు. 1970-80వ దశకంలో ప్రత్యర్థి జట్లను వణికించిన విండీస్ పేసర్లలో రాబర్ట్స్ కూడా ఒకడు.



లిరెన్‌తో గుకేష్ 13వ రౌండ్ నేడు

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

ఈ గేమ్ కీలకం

సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, యువ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ మధ్య ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఉత్కంఠగా సాగుతోంది. టోర్నీ ఆరంభం నుంచి ఇరువురు ఆటగాళ్లు ప్రతి గేమ్‌లో ఆచితూచిగా పావులు కదుపుతున్నారు. ఇప్పటి దాకా 12 రౌండ్లు జరగగా.. ఇద్దరు చెరో రెండు గేమ్‌లు గెలిచారు. మిగతా గేమ్‌లను డ్రాగా ముగించారు. ఫలితంగా ఇరువురు ఆరేసి పాయింట్లతో సమంగా ఉన్నారు. 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు టోర్నీ విజేతగా నిలుస్తారు. ఈ క్రమంలో మరో రెండు రౌండ్లే మిగిలున్న నేపథ్యంలో.. బుధవారం జరిగే 13వ రౌండ్ ఇద్దరికీ అత్యంత కీలకం కానుంది. ఇందులో గెలిచిన వాళ్లు టైటిల్‌కు మరింత చేరువవుతారు. ఈ గేమ్ నెగ్గితే.. ఆఖరి రౌండ్‌ను కనీసం డ్రా చేసుకున్నా ట్రోఫీ సొంతమవుతుంది. మరి.. ఇద్దరిలో ఎవరిది పైచేయి కానుందో ఈ రౌండ్‌తో దాదాపు తేలనుంది.

లక్ష టిక్కెట్లు హాంఫట్..

బాక్సింగ్ డే టెస్టు

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ఆస్ట్రేలియా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఐదు టెస్టుల ఈ సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి రెండు మ్యాచుల్లో ఇరుజట్లూ చెరోటి నెగ్గి 1-1తో సమవుజ్జీలుగా ఉన్న విషయం తెలిసిందే. అత్యంత ఆసక్తికరంగా సాగుతున్న ఈ సిరీస్‌లోని నాలుగోదైన బాక్సింగ్ డే టెస్టు కోసం ఇప్పటి నుంచే అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 26 నుంచి మెల్‌బోర్న్ మైదానంలో జరిగే ఈ టెస్టుకు తొలిరోజు టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయినట్టు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. లక్ష సీట్ల సామర్థ్యం కలిగిన ఎంసీజీలో మ్యాచ్‌కు ఇంకా 15 రోజుల సమయం ఉండగానే ఇంత డిమాండ్ ఏర్పడడం విశేషం. అడిలైడ్ ఓవల్‌లో జరిగిన రెండో టెస్టును రికార్డు స్థాయిలో లక్షా 35 వేల మంది తిలకించారు. భారత్‌తో జరిగిన టెస్టుల్లో ఇదే అత్యధిక ప్రేక్షకుల హాజరుగా ఉంది.

గుజరాత్‌పై జైపూర్ గెలుపు

పుణె: అర్జున్ దేశ్వాల్ విజృంభించడంతో.. ప్లేఆఫ్స్ రేసులో జైపూర్ పింక్ పాంథర్స్ కీలక విజయాన్ని నమోదు చేసింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 42-29తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. కెప్టెన్ దేశ్వాల్ 13 పాయింట్లతో అదరగొట్టగా.. డిఫెండర్ అంకుశ్ 5 టాకిలింగ్స్ చేశాడు. ఫస్టాఫ్‌లో రెండుసార్లు గుజరాత్‌ను ఆలౌట్ చేసిన జైపూర్ 27-16తో పైచేయిగా నిలిచింది. సెకండాఫ్‌లో జెయింట్స్ దీటుగానే పోరాడినా.. ఆధిక్యాన్ని కాపాడుకొన్న జైపూర్ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 44-29తో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. విశ్వాస్ 14 రైడ్ పాయింట్లు సాధించగా.. డిఫెండర్లు నితీశ్, ఫజల్ చెరో 7 టాకిలింగ్స్ చేయడం విశేషం. బుల్స్ తరఫున పర్‌దీప్ నర్వాల్ 14 పాయింట్లు స్కోరు చేసినా ప్రయోజనం లేకపోయింది.

హైజంప్‌లో యశ్వితకు స్వర్ణం

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్



భువనేశ్వర్: జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి యశ్విత సత్తా చాటింది. ఇక్కడి కళింగ స్టేడియంలో మంగళవారం జరిగిన అండర్-16 బాలికల హైజంప్‌లో యశ్విత చాంపియన్‌గా నిలిచి స్వర్ణ పతకం దక్కించుకుంది. యశ్విత శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన అథ్లెట్. ఇదే టోర్నీలో అండర్-18 హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన శ్రీతేజ రజత పతకం సాధించింది. శ్రీతేజ 5,087 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఇక, హరియాణా టీనేజర్ పూజ 5,102 పాయింట్లు సాధించి జాతీయ రికార్డుతో పసిడి పతకం అందుకుంది. హరియాణాకే చెందిన ఖుషి (4,350) మూడోస్థానంతో కాంస్య పతకం గెలుచుకుంది.

ఓదార్పయినా దక్కేనా..!

● ఆస్ట్రేలియాతో భారత మహిళల మూడో వన్డే నేడు
● ఉ. 9.50 నుంచి

పెర్త్: ఘోర ప్రదర్శనతో ఈపాటికే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను చేజార్చుకొన్న భారత మహిళల జట్టు.. క్లీన్‌స్వీప్‌ను తప్పించుకోవాలనుకొంటోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగే మూడో, ఆఖరి వన్డేలో ఓదార్పు విజయం దక్కించుకోవాలని భారత్ భావిస్తోంది. గత రెండు మ్యాచుల్లోనూ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఏ రంగంలోనూ హర్మన్‌ప్రీత్ సేన ఆకట్టుకోలేకపోయింది. షఫాలీ స్థానంలో ఓపెనర్‌గా రిచా ఫర్వాలేదనిపిస్తున్నా.. సీనియర్లు స్మృతి మంధాన, హర్మన్ సహా మిగతా బ్యాటర్ల వైఫల్యం జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. బౌలింగ్ విభాగం తేలిపోతుండగా.. ఫీల్డింగ్ వైఫల్యాలు మరింత నిరాశకు గురి చేస్తున్నాయి. మరోవైపు తహిల మెక్‌గ్రాత్ సారథ్యంలోని ఆసీస్ ఫుల్ జోష్‌లో ఉంది. ఓపెనర్ జార్జియా వోల్ పరుగుల వరద పారిస్తూ భారీ స్కోర్లకు బాటలు వేస్తోంది.

టాప్ 500 స్టాక్స్‌కు అదే రోజు సెటిల్‌మెంట్

కొత్త ఏడాది నుంచి దశల వారీగా అమలు: సెబీ

న్యూఢిల్లీ: ఈ డిసెంబరు 31 నాటికి మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాప్-500 కంపెనీల స్టాక్స్‌కు ఐచ్ఛిక టీ+0 (షేరు కొనుగోలు చేసిన రోజే) సెటిల్‌మెంట్‌ను దశల వారీగా అందుబాటులోకి తెస్తున్నట్లు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తెలిపింది. స్టాక్ బ్రోకర్లందరూ టీ+0 సెటిల్‌మెంట్‌లో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, టీ+1, టీ+0 సెటిల్‌మెంట్‌కు మధ్య వ్యత్యాస బ్రోకరేజీని నియంత్రణ పరిధికి లోబడి వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. సెబీ 2024 మార్చిలో 25 స్టాక్స్‌కు ఈ ఐచ్ఛిక టీ+0 సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తాజా ప్రతిపాదిత జాబితాలో తొలుత దిగువ 100 కంపెనీలకు జనవరిలో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుందని సెబీ తన సర్క్యులర్‌లో వెల్లడించింది. ఆ తర్వాత నెలకు 100 కంపెనీల చొప్పున జాబితాను 500కు చేర్చనున్నట్లు సెబీ స్పష్టం చేసింది.

డిజిలాకర్ ద్వారా అన్‌క్లెయిమ్డ్ ఆస్తుల సెటిల్‌మెంట్: సెక్యూరిటీస్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ అసెట్స్‌ను తగ్గించడంతో పాటు ఆ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన డిజిటల్ డాక్యుమెంట్ స్టోరేజ్ ప్లాట్‌ఫామ్ డిజిలాకర్‌ను ఉపయోగించుకోవాలని సెబీ ప్రతిపాదించింది. డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్లు డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్ స్టేట్‌మెంట్లను డిజిలాకర్ ద్వారానూ అందుబాటులోకి తేవాలని మంగళవారం విడుదల చేసిన చర్చాపత్రంలో సెబీ ప్రతిపాదించింది. అలాగే, కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీలు (కేఆర్ఏ) మదుపరి మరణ సమాచారాన్ని డిజిలాకర్‌తో పంచుకోవాలని కూడా సూచించింది. డిజిలాకర్ వినియోగదారులు తమ ఖాతాలకు ఎవరినైనా నామినీగా ఎంచుకోవచ్చు. దురదృష్టవశాత్తూ వినియోగదారు మరణిస్తే, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) లేదా కేఆర్ఏ వ్యవస్థలోని మరణ నమోదు సమాచారం ఆధారంగా డిజిలాకర్ అకౌంట్ స్టేటస్‌ను అప్‌డేట్ చేస్తుంది. అలాగే, మరణించిన వినియోగదారు నామినీకి డిజిలాకర్ ఆటోమెటిక్‌గా ఎస్ఎంఎస్ లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందిస్తుంది. తద్వారా నామినీ మరణించిన వ్యక్తి డిజిటల్ రికార్డులను యాక్సెస్ చేయగలగడంతోపాటు ఆస్తుల బదిలీకి క్లెయిమ్ ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుంటుంది. ఈ ప్రతిపాదనలపై డిసెంబరు 31లో అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా సెబీ ప్రజలను కోరింది.

వృద్ధి క్షీణతకు రెపో కారణం కాదు

ఆర్‌బీఐ గవర్నర్ దాస్



ముంబై: వృద్ధి రేటు మందగించడానికి అధిక రెపో రేట్లే కారణం కాదని, అందుకు ఎన్నో అంశాలు దోహదపడ్డాయని పదవీ విరమణ చేస్తున్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. మంగళవారం ఆర్‌బీఐ గవర్నర్ హోదాలో చివరి పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతూకం సాధించడమే ఆర్‌బీఐ ముందున్న ప్రధాన సవాల్ అని చెప్పారు. దాస్ నాయకత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వరుసగా 11 విడతలుగా రెపో రేట్లను యథాతథంగా కొనసాగిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ చర్యలను ఆయన సమర్థించుకుంటూ ప్రస్తుత పరిస్థితులతో పాటు భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని అందుకనుగుణంగా ద్రవ్య విధానాన్ని ఉంచేందుకే కృషి చేశామన్నారు. రేట్ల నిర్ణయం అనే అంశాన్ని అంత తేలికైన విషయంగా తీసుకోవద్దని ఆయన కోరారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని బలంగా నిలిచిందంటూ కొత్తగా ఆర్‌బీఐ పగ్గాలు చేపడుతున్న సంజయ్ మల్హోత్రా కూడా విస్తృత అనుభవం గల వ్యక్తి అని, ఆర్‌బీఐని సమర్థవంతంగా ముందుకు నడుపుతారని తెలిపారు.

ఆర్థిక శాఖతో సత్సంబంధాలే...

తన హయాంలో ఆర్థిక మంత్రిత్వ శాఖతో సంబంధాలు అత్యుత్తమంగా ఉన్నాయని దాస్ అన్నారు. అనేక అంశాలపై కేంద్ర బ్యాంక్, ఆర్థిక శాఖ మధ్య భిన్న వైఖరులుంటాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉందని ఆయన చెప్పారు. అయితే తన హయాంలో అలాంటి సమస్యలేవైనా ఉంటే అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోగలిగామన్నారు. తమ మధ్య చక్కని సహకారం, సమన్వయం నెలకొన్నాయని ఆయన తెలిపారు. 2018లో తాను అధికార బాధ్యతలు చేపట్టిన సమయంలో వృత్తిపరమైన విలువలు, విశ్వసనీయత, స్వయంప్రతిపత్తి పరిరక్షించేందుకు తాను కృషి చేస్తానని చెప్పానని, అందుకు అనుగుణంగానే పని చేశానని శక్తికాంత దాస్ అన్నారు.

అన్నీ అర్థం చేసుకుని పని చేస్తా.. సంజయ్ మల్హోత్రా

తాను ఆర్థిక వ్యవస్థకు చెందిన అన్ని కోణాలను పూర్తిగా అర్థం చేసుకుని ఆర్థిక వ్యవస్థకు ఏది మంచిదైతే అలా పని చేస్తానని ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా చెప్పారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్న మల్హోత్రా ఆర్థిక శాఖ కార్యాలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతానికి దూసుకుపోయి వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి క్షీణించిన కీలక దశలో ఆయన ఆర్‌బీఐ గవర్నర్‌గా పగ్గాలు చేపడుతున్నారు.

ఫిబ్రవరి పాలసీలో రేట్ల తగ్గింపు

కొత్త ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా హయాంలో ఫిబ్రవరిలో జరగనున్న ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తొలి విడత రేట్ల కోత ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మల్హోత్రా సారథ్యంలో ఆర్‌బీఐ సరళతర ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలే ఎక్కువ ఉన్నట్టు జపాన్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ నోమురా అంటోంది. కొత్త గవర్నర్ ఆర్థిక శాఖ నుంచి రావడం వల్ల రాబోయే కాలంలో రేట్ల నిర్ణయంలో ప్రభుత్వం శక్తివంతమైన పాత్ర పోషించవచ్చని స్విస్ బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ అంచనా వేస్తోంది. రాబోయే ఎంపీసీ సమావేశం నాటికి ద్రవ్యోల్బణ ఒత్తిడులు తగ్గి రెపో రేటు ఒక మోస్తరుగా తగ్గించే అవకాశాలే ఎక్కువ ఉన్నట్టు ఎస్ అండ్ పీ అంటోంది. ఏది ఏమైనా ఫిబ్రవరి నుంచి ప్రారంభించి రెపో రేటును 0.75 శాతం వరకు తగ్గించే ఆస్కారం ఉన్నట్టు పలువురు అంచనా వేస్తున్నారు.

బిజినెస్

క్విక్ కామర్స్‌లోకి అమెజాన్

తేజ్ పేరుతో బెంగళూరులో పైలట్ సేవలు ప్రారంభం



భారత్‌లో శరవేగంగా వృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ విభాగంలోకి అమెజాన్ సైతం ప్రవేశించింది. బ్లింకిట్, జెప్టో వంటి క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌కు పోటీగా అమెజాన్ తేజ్ పేరుతో 15 నిమిషాల్లోపు నిత్యావసరాల డెలివరీ సేవలను తొలుత పైలట్ ప్రాజెక్టుగా బెంగళూరులో ప్రారంభించింది. మంగళవారం ఢిల్లీలో ప్రారంభించిన సంభవ్ కార్యక్రమంలో అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం 610 కోట్ల డాలర్ల (రూ.51,758 కోట్లు) స్థాయిలో ఉన్న క్విక్ కామర్స్ మార్కెట్ 2030 నాటికి 4,000 కోట్ల డాలర్లకు (రూ.3.40 లక్షల కోట్లు) చేరుకోవచ్చని దాతుమ్ ఇంటెలిజెన్స్ తాజా నివేదిక అంచనా వేసింది. క్విక్ కామర్స్ విభాగంలో 46 శాతం మార్కెట్ వాటాతో బ్లింకిట్ అగ్రస్థానంలో ఉండగా.. జెప్టో 29 శాతం మార్కెట్ వాటాను చేజిక్కించుకుంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 25 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

2030 నాటికి 8,000 కోట్ల డాలర్ల ఎగుమతులు: భారత్ నుంచి తమ ఎగుమతులను 2030 నాటికి 8,000 కోట్ల డాలర్లకు పెంచాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నామని అమెజాన్ ఇండియా పునరుద్ఘాటించింది. 2025 నాటికల్లా 2,000 కోట్ల డాలర్లకు చేర్చాలనుకుంటున్నట్లు అమెజాన్ ఎమర్జింగ్ మార్కెట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ వెల్లడించారు.

ఉద్యోగ మార్కెట్‌కు మళ్లీ మంచి రోజులు

• వచ్చే మార్చి వరకు నియామకాల జోరు
• మ్యాన్‌పవర్ గ్రూప్

న్యూఢిల్లీ: ఉద్యోగ మార్కెట్ గాడిన పడుతోంది. వచ్చే జనవరి-మార్చి త్రైమాసికంలో దేశంలో నియామకాలకు ఢోకా ఉండదని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా వెల్లడించింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రంగాలకు చెందిన 3,000 కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి కంపెనీ మ్యాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ పేరుతో ఒక సర్వేను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 53% కంపెనీల ప్రతినిధులు వచ్చే మార్చిలోగా తమ ఉద్యోగుల సంఖ్య మరింత పెరుగుతాయని చెప్పారు. 13% మంది తగ్గుతాయని, 31% మంది ఎదుగూ బొదుగు ఉండదని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తామని చెప్పిన కంపెనీలను తీసివేసినా నికరంగా 40% కంపెనీలు నియామకాలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. గత ఏడాది ఇదే కాలం లేదా ఈ ఏడాది డిసెంబరుతో పోల్చినా ఇది మూడు శాతం ఎక్కువ. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుపై కంపెనీలకు పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఎండీ సందీప్ గులాటీ చెప్పారు. ఈ నియామకాల్లో ఐటీ రంగం వాటా 50% వరకు ఉండనుండగా ఆర్థిక, రియల్ ఎస్టేట్ వాటా 44%, కన్స్యూమర్ గూడ్స్, సేవల రంగం వాటా 40% వరకు ఉంటుందని సర్వే వెల్లడించింది.

మెహుల్ చోక్సీ ఆస్తుల వేలం..

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను మోసం చేసిన కేసులో పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీ డొంక కదులుతోంది. అతడికి చెందిన సుమారు రూ.2,500 కోట్ల విలువైన ఆస్తులను వేలం వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమవుతోంది. అక్రమాస్తుల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ ఈ ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకుంది. ఈ ఆస్తులను వేలం వేసి ఆ మొత్తాన్ని పీఎన్‌బీ, ఐసీఐసీఐ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని ఈడీ కోర్టు ఇప్పటికే ఆదేశించింది. తప్పుడు పత్రాలతో పీఎన్‌బీని రూ.13,000 కోట్ల మేర ముంచిన కేసులో మెహుల్ చోక్సీ నిందితుడు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 249 రోజులకు 5.5 కోట్ల టన్నుల సరుకును రవాణా చేసి రికార్డు సృష్టించింది. మంగళవారం నాడిక్కడ భాగస్వాముల సదస్సులో పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.109 కోట్ల టన్నుల సరుకు రవాణా చేసినట్లు చెప్పారు. సరుకు రవాణా పెరగటంలో రైల్వే, కస్టమ్స్, జాతీయ రహదారుల సంస్థ, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు జిల్లా అధికారులు మంచి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తయ్యే మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రీ, జీఎస్‌టీ అండ్ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ నరసింహ శ్రీధర్, పాల్గొన్నారు.

• ఎన్‌హెచ్‌సీ ఫుడ్స్ లిమిటెడ్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.47.42 కోట్లు సమీకరించనుంది. ఈ ఇష్యూ ఈ నెల 18న ముగియనుంది. ఇష్యూ ధరను రూ.1గా కంపెనీ ఖరారు చేసింది. నవంబరు 26 నాటికి కంపెనీలో వాటాదారులు కలిగిన ఉన్న ప్రతి ఒక ఈక్విటీ షేరుకి రైట్స్ ఇష్యూ కింద నాలుగు షేర్లను జారీ చేయనుంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను మూలధన అవసరాలతో పాటు రుణాల చెల్లింపుల కోసం వినియోగించనుంది.


లాభనష్టాల మధ్య ఊగిసలాట

ముంబై: ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. మంగళవారం సెన్సెక్స్ 1.59 పాయింట్ల స్వల్ప లాభంతో 81,510.05 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 8.95 పాయింట్లు కోల్పోయి 24,510.05 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 రాణించగా.. బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.33 శాతం వరకు లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ 1.22 శాతం ఎగబాకగా.. ఐటీ, ఫోకస్డ్ ఐటీ ఇండెక్స్‌లు అర శాతానికి పైగా పెరిగాయి.

• ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా పెరిగి 84.85 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 0.36 శాతం తగ్గి 71.88 డాలర్లకు దిగివచ్చింది.
• ఢిల్లీ మార్కెట్లో 24 గ్రాముల బంగారం 10 గ్రాముల ధర రూ.820 పెరిగి రూ.79,780కి చేరుకుంది. కిలో వెండి రూ.1,000 పెరుగుదలతో రూ.94,850కి ఎగబాకింది.

కాంటినమ్ గ్రీన్ ఎనర్జీ రూ.3,650 కోట్ల ఐపీఓ

విద్యుత్ ఉత్పత్తి సంస్థ కాంటినమ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.3,650 కోట్లు సమీకరించాలనుకుంటోంది. కాగా, డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్ ఐపీఓ ప్రతిపాదనకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ 3.2 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.




బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,600 ▲	72,050 ▲	1,04,000 ▲
విజయవాడ	80,000 ▲	74,000 ▲	96,000 ▲
విశాఖపట్నం	75,650 ▲	72,050 ▲	1,04,000 ▲
ప్రొద్దుటూరు	78,800 ▲	72,970 ▲	94,500 ▲
ముంబై	77,175 ▲	76,692 ▲	92,810 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ



హైదరాబాద్	620
వరంగల్	622
చిత్తూరు	633
విజయవాడ	630
గోదావరి	628
విశాఖపట్నం	618

దజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90
వరంగల్	90
కరీంనగర్	90
మహబూబ్‌నగర్	90
కర్నూలు	90
విశాఖపట్నం	96
గోదావరి	104
విజయవాడ	104
గుంటూరు	99
ఒంగోలు	99
చిత్తూరు	77
నెల్లూరు	77
అనంతపురం	77



సాధికారమైన భవిష్యత్తు కోసం...

హర్షిత ప్రియదర్శిని వయసు చిన్నదే కానీ ఆశయం పెద్దది. పద్మశ్రీ పురస్కార గ్రహీత కమలా పూజారి స్ఫూర్తితో రెండువందలకు పైగా అరుదైన దేశీయ విత్తనాలను సేకరించి... 'సీడ్‌బ్యాంక్'ను ఏర్పాటు చేసింది. ఎనిమిదో తరగతి చదువుతున్న పదమూడేళ్ళ ఈ ఒడిశా అమ్మాయి సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యతను, అంతరించిపోతున్న ధాన్యాల పరిరక్షణ ఆవశ్యకతను ప్రచారం చేస్తోంది.

ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన హర్షిత ప్రియదర్శిని మహంతి జీవితం రెండేళ్ళ క్రితం వరకూ అందరు బడి పిల్లల్లాగానే ఆడుతూ, పాడుతూ గడిచింది. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలో చేర్చడానికి హర్షితను తీసుకొని ఆమె తండ్రి బాలకృష్ణ మహంతి బయలుదేరారు. దారిలో కమలా పూజారి ఎదురయ్యారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, దేశీయ విత్తనాలను పరిరక్షించినందుకు పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న కమలను హర్షితకు ఆయన పరిచయం చేశారు. "దేశీయమైన ఎన్నో ధాన్యం రకాలు మాయమైపోతున్నాయి. వాటిని రాబోయే తరాల కోసం భద్రపరచవలసిన బాధ్యత పిల్లలదేనని కమలా పూజారి నాకు చెప్పారు. అంతేకాదు... నాలుగు రకాల వరి విత్తనాలను నాకు కానుకగా ఇచ్చారు. ఆమె మాటలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆ తరువాత కొరాపుట్‌లోని గిరిజన మ్యూజియంలో... పర్యావరణ వైవిధ్యంపై 'ఏక్తా' అనే సంస్థ ఒక ఉత్సవం ఏర్పాటు చేసింది. అక్కడ అనేక రకాల ధాన్యం, కూరగాయలు, చిరుధాన్యాలను ప్రదర్శించారు. వాటిని చూశాక... అరుదైన విత్తనాలను సంరక్షించాలనే కోరిక నాలో మరింత బలపడింది" అని గుర్తు చేసుకుంటుంది హర్షిత. కమలాపూజారి మార్గదర్శకత్వంలోనే దేశీయ విత్తనాల సేకరణను ఆమె ప్రారంభించింది.

10 వేల మందిలో మొదటి స్థానం...

ఆ తరువాత... బడి లేని రోజుల్లో తండ్రి సాయంతో పొలాల్లోకి వెళ్ళడం, రైతులతో మాట్లాడడం, విత్తనాల గురించి తెలుసుకోవడం, అరుదైన వాటిని సేకరించడం ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారిపోయింది. "ఒక్కొక్క రకాన్ని సేకరిస్తున్నప్పుడు అంతులేని సంతోషం కలిగేది. వాటి ప్రత్యేకతల గురించి రైతులు చెబుతూ ఉంటే నమోదు చేస్తున్నప్పుడు... ఇతరులకు కూడా ఈ అంశం మీద ఆసక్తి పెంచితే మంచిదని భావించాను. 'హర్షిత ప్రియదర్శిని సైన్స్ క్లబ్' పేరిట ఒక సంస్థను, సీడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాను. అప్పటి నుంచి నా పని ప్రణాళికాబద్ధంగా సాగుతూ వచ్చింది అని చెప్పింది హర్షిత. ప్రతి రకం విత్తనాన్ని 100 నుంచి 250 గ్రాముల వరకూ సేకరిస్తుంది. అంతకన్నా ఎక్కువ దొరికితే రైతులకు వాటిని ఉచితంగా పంచుతుంది. కిందటి ఏడాది 20మందికి, ఈ ఏడాది 50 మందికి విత్తనాలు అందించింది. కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో 'ఐడియా యంగ్‌స్టర్స్' అనే జాతీయ స్థాయి పోటీలో ఆమె పాల్గొంది. 12-17 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు ఆచరణలోకి తెచ్చేందుకు సాయపడడం ఈ పోటీల లక్ష్యం. పలు దశల్లో దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి సుమారు 10 వేలమంది పాల్గొన్న ఈ పోటీలో హర్షిత మొదటి స్థానంలో నిలిచింది. సేంద్రియ సాగు, సంప్రదాయ విత్తనాల ప్రాధాన్యం గురించి న్యాయమూర్తులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానాలు న్యాయమూర్తులను ఆకట్టుకున్నాయి. విజేతగా తనకు లభించిన రూ. రెండున్నర లక్షల నగదుతో విత్తన సంరక్షణ కోసం ఒక మూల నిధిని హర్షిత ఏర్పాటు చేసింది.



ఆ సదస్సుతో జాతీయ గుర్తింపు...

"కిందటి ఏడాది సెప్టెంబర్‌లో రైతుల హక్కులపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ప్రతినిధిగా హాజరై, వేదిక నుంచి నా అభిప్రాయాలను ఆహూతులతో పంచుకున్నాను. ఆ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. భారత హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ కుమార్తె, ప్రముఖ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్‌ను కలుసుకొనే అవకాశం అక్కడ దొరికింది. నేను చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకొని, వాటిని కొనసాగించాలని ప్రోత్సహించారు. ఆమె మాటలు నాలో ఎంతో ఉత్తేజాన్ని నింపాయి. అలాగే నా పేరు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి ఆ సదస్సు దోహదపడింది" అని చెబుతోంది హర్షిత. ఢిల్లీలో జరిగిన 'జి-20' సదస్సు, భువనేశ్వర్‌లో నిర్వహించిన 'అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు'... ఇలా అనేక ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాల్లో తన సేకరణలను ఆమె ప్రదర్శించింది. హర్షిత కృషికి గుర్తింపుగా పారాదీప్ ఫాస్ఫేట్స్, 'శిక్ష ఓ అనుసంధాన్' విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'కృషిక్ రత్న' బిరుదుతో సత్కరించాయి. అలాగే 'స్టూడెంట్ ఆఫ్ ఇండియా' అవార్డును 'వార్ ఇండియా' సంస్థ నుంచి 'జ్యూవెల్ ఆఫ్ ఇండియా' పురస్కారాన్ని... ఇలా పలు గౌరవాలను ఆమె అందుకుంది.

వాటి ప్రాధాన్యతను వివరిస్తూ...

ఇప్పటివరకూ 180కి పైగా దేశీయ వరి విత్తనాలను, 80కి పైగా చిరుధాన్యాల రకాలను హర్షిత సేకరించింది. వాటిని గాజు, ప్లాస్టిక్ సీసాల్లో, మట్టి కుండలలో భద్రపరుస్తుంది, అవి పాడవకుండా ఉండడం కోసం వేప మాత్రలను ఉపయోగిస్తుంది. "వేప సహజమైన క్రిమి సంహారిణి. విత్తనాలు, ధాన్యం సంరక్షణ కోసం వందల ఏళ్ళ నుంచి వాటిని మన దేశంలో వినియోగిస్తున్నాం. అందుకే వాటిని వాడాలని నేను అందరికీ చెబుతున్నాను. అలాగే ఎక్కడికి వెళ్ళినా దేశీయమైన విత్తనాల ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాను. అవి మన పరిస్థితులకు అనుకూలమైనవి. మన వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకోగలవు. వాటి సాగుకు నీటి అవసరం తక్కువ. అదే విధంగా వాటిలో పోషక విలువలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి దేశీయ విత్తనాలను సంరక్షించుకొనేలా రైతులను ప్రోత్సహించాలి. దీనివల్ల ప్రతి సీజన్‌లో విత్తనాలు కొనడానికి డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. రైతుల సాధికారమైన భవిష్యత్తుకు ఇది దోహదపడుతుంది. అదే నా లక్ష్యం" అని చెబుతున్న హర్షితకు విత్తనాలతో పాటు విదేశీ కరెన్సీని, స్టాంపులను సేకరించడం కూడా హాబీ. 80 దేశాలకు చెందిన 2వేల నాణేలు, 40 దేశాలకు చెందిన 1,500కు పైగా స్టాంపులు ఆమె సేకరణలో ఉన్నాయి. తోటి విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఒక బృందంతో తను నివసించే బోయ్‌పరిగూడ పరిధిలోని అయిదు గ్రామాలను ఆమె తరచూ సందర్శించి, సేంద్రియ వ్యవసాయం గురించి రైతులకు వివరిస్తూ ఉంటుంది. "అరుదైన అనేక వరి, చిరుధాన్యాల విత్తనాలు నా సేకరణలో ఉన్నాయి. వాటిని సాగు చేసేందుకు రైతులకు సాయపడాలనేదే నా కోరిక" అంటున్న హర్షిత భవిష్యత్తులో వ్యవసాయ శాస్త్రవేత్త అవుతానంటోంది.

విజేత



చదువు... పెళ్లి... ఉద్యోగం... జీవిత గమనంలో పడి ఇష్టమైన ఆర్చరీని అటకెక్కించారు. బజార్లో చూసి కొడుకు ముచ్చటపడితే... విల్లు కొనిచ్చారు. అది ఆట వస్తువే... కానీ ఆ క్షణం ఆమెను కాలేజీ రోజులకు తీసుకువెళ్లింది. ఆర్చరీలో పతకాల కోసం పోటీపడిన ఘట్టాలను గుర్తుకుతెచ్చింది. ఇప్పుడు... లక్ష్యానికి 'గురి' పెట్టి... విజయం సాధించడమే కాదు... గురువుగా కొడుకునూ తన మార్గంలో నడిపి... ఎందరో తల్లులకు ఆదర్శంగా నిలుస్తున్నారు అర్చన. అమెరికాలో తన ప్రస్థానం గురించి ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

ఆర్చరీ అర్చన... గురి కుదిరింది



"లక్ష్యాలు, అభిరుచులు అందరికీ ఉంటాయి. కానీ పరిస్థితుల కారణంగా ఒక్కోసారి అవి పక్కకు వెళ్లిపోతుంటాయి. నా విషయంలోనూ అదే జరిగింది. ఆర్చరీ నాకు ఎంతో ఇష్టమైన క్రీడ. అందులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎన్నో కలలు కన్నాను. పెళ్లి తరువాత కొత్త జీవితం ప్రారంభమైంది. ఇష్టపడిన ఆర్చరీ గురించి ఆలోచించే సమయమే లేకుండాపోయింది. మా అబ్బాయి ద్వారా అనుకోకుండా మళ్లీ అది నా జీవితంలో భాగమైంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం చందాపురంలోని ఓ రైతు కుటుంబం మాది. అక్కడి కేవీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో మొదటిసారి విల్లు చేతపట్టాను. నా నైపుణ్యాన్ని చూసిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు నన్ను ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీలకు ఎంపిక చేశారు. 2009లో అలా తొలి అడుగు పడింది. నాగార్జున విశ్వవిద్యాలయంలో, ఆ తరువాత చండీగఢ్‌లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. సరైన శిక్షణ లేకపోవడంతో ఆ పోటీల్లో పెద్దగా రాణించలేదు.

అమెరికా వెళ్లాక...

డిగ్రీ తరువాత పీజీ చదివాను. ఆ వెంటనే నాకు పెళ్లి చేశారు ఇంట్లోవాళ్లు. 2013లో మావారు శ్రీధర్‌తో కలిసి అమెరికా వచ్చాను. టెక్సాస్‌లో నివాసం. ఇద్దరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నాం. మాకు ఒక అబ్బాయి... ఈశ్వర్. పెళ్లి, పిల్లాడు, ఉద్యోగం... క్షణం తీరిక లేకుండా పదేళ్లు గడిచిపోయాయి. నాలోని క్రీడాకారిణి మరుగున పడిపోయింది. ఏడేళ్ల మా అబ్బాయికి బొమ్మలు కొందామని బయటకు వెళ్లినప్పుడు... అనుకోకుండా విల్లు ఒకటి వాడి కంట పడింది. వాడికి అది కొని ఇచ్చాను. ఇంటికి వచ్చాక వాడు దాంతో ఆడుతుంటే నాకు పాత రోజులు గుర్తుకువచ్చాయి.

> "ఫీల్డ్ చాంపియన్‌షిప్‌ల కోసం అడవులకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ లక్ష్యాలు నిర్దేశించి పోటీలు నిర్వహించేవారు. నలుగురం చొప్పున అడవిలోకి వెళ్లి పోటీపడాలి. ఆ సమయంలో నాకు ఎంతో భయం వేసింది."

మళ్లీ అలా మొదలైంది...

మా అబ్బాయికి నేర్పించే క్రమంలో నేను కూడా సాధన మొదలుపెట్టాను. మా ఇద్దరి ఉత్సాహం చూసిన మావారు... మాకు మంచి శిక్షణ ఇప్పించాలని అనుకున్నారు. అయితే అది ఎంతో ఖర్చుతో కూడుకున్నదని తెలిశాక... ఆన్‌లైన్‌లో విలువిద్యా నైపుణ్యాల సమాచారాన్ని, ప్రముఖ ఆటగాళ్ల అనుభవాలను, సూచనలను సేకరించారు. వాటిని మా ఇద్దరికీ చెప్పే క్రమంలో ఆయన మాకు గురువుగా మారారు. కొన్ని మాసాల శిక్షణ తరువాత నేను పోటీలకు సిద్ధమయ్యాను.

అమెరికన్ల క్రీడాస్ఫూర్తి...

సౌత్ డకోటా టోర్నీలో నేను రజత పతకం సాధించినప్పుడు. ఆ పోటీల్లో అమెరికాకు చెందిన క్రిస్టిలయన్స్ స్వర్ణం గెలిచింది. తను నాకు ప్రత్యర్థి అయినప్పటికీ ఆటలో పలు సూచనలు ఇచ్చింది. తరువాత జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కూడా క్రిస్టిలయన్స్ పతకాలు నెగ్గింది. ఆమెతో పోటీపడడం నాకు లభించిన అరుదైన అవకాశం. మరో అమెరికా క్రీడాకారుడు రిక్‌స్టోన్ బ్రేకర్ నా ప్రతిభ చూసి అభినందించాడు. తను కూడా నాకు పలు సూచనలు ఇస్తుంటాడు. పోటీలు ఉన్నప్పుడు ప్రోత్సహిస్తుంటాడు.



గెలుపు బాట...

గత ఏడాది జార్జియాలో జరిగిన స్టేట్ ఆర్చరీ చాంపియన్‌షిప్ ద్వారా తిరిగి బరిలోకి దిగాను. అందులో కాంస్య పతకం గెలిచాను. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన కెంటకీ స్టేట్ చాంపియన్‌షిప్‌లో, ఆ తరువాత కాంటినెంటల్ దేశాల ఇండోర్ పోటీల్లో స్వర్ణ పతకాలు నెగ్గాను. అంతేకాదు... మిస్సోరీ, లూసియానా, ఓక్లహోమా రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు వచ్చాయి. జార్జియా స్టేట్ ఇండోర్, ఎన్ఎఫ్ఏ నేషనల్ చాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలు గెలుచుకున్నాను. డకోటాలో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాను. నార్త్ అమెరికా కాంటినెంటల్ పోటీలలో భారత్ తరఫున ఆడి స్వర్ణం గెలిచాను. పాన్ అమెరికా ఇంటర్‌నేషనల్ పోటీలలో రజతం, టెక్సాస్ స్టేట్ అవుట్‌డోర్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, ఎన్ఎఫ్ఏ ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో రజతం, అవుట్‌డోర్ టార్గెట్ చాంపియన్‌షిప్‌లో రజతం... ఇలా వెళ్లిన చోటల్లా పతకాలు పట్టుకువచ్చాను. టెక్సాస్ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో అయితే స్టేట్ రికార్డుతో స్వర్ణ పతకం గెలిచాను. ఇది నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది.

నా దారిలోనే మా అబ్బాయి...

మా అబ్బాయి కూడా నాతోపాటే శిక్షణ తీసుకొంటున్నాడు. కొన్నాళ్లకు వాడు కూడా పోటీలకు సిద్ధమయ్యాడు. వివిధ చాంపియన్‌షిప్‌ల్లో పాల్గొని పతకాలు సాధించాడు. జార్జియా స్టేట్ ఇండోర్ టోర్నీలో రికార్డు నెలకొల్పడమే కాకుండా, స్వర్ణ పతకం గెలిచాడు. ఎన్ఎఫ్ఎఫ్ఏ ఇండోర్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, డకోటా క్లాసిక్ నేషనల్ టోర్నమెంట్‌లో స్వర్ణం, యూఎస్ ఆర్చరీ ఫీల్డ్ నేషనల్స్‌లో రజతం, సదరన్ ఔట్‌డోర్ రీజనల్ పోటీల్లో స్వర్ణ పతకం నెగ్గాడు. విశేషమేమంటే... నార్త్ అమెరికా ఫీల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం, యూఎస్ ఓపెన్ జాతీయ పోటీల్లో రజతంతో పాటు ఎన్ఎఫ్ఎఫ్ఏ నేషనల్ ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో మూడు జాతీయ రికార్డులు నెలకొల్పాడు. ఇలా ఎన్నో విజయాలు వాడి ఖాతాలో ఉన్నాయి.

లక్ష్యం... టాప్-5...

ప్రస్తుతం నేను అమెరికా ఆర్చరీ అసోసియేషన్ ర్యాంకింగ్స్‌లో పద్నాలుగవ స్థానంలో ఉన్నాను. టాప్-5లో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాను. ఆ స్థాయికి వెళితే అసోసియేషన్ ద్వారా శిక్షణ, ఇతర సౌకర్యాలు అందుతాయి. ఇక మా అబ్బాయిని ఒలింపిక్స్‌లో ఆడించడమే నా ప్రధాన లక్ష్యం. మేమిద్దరం ఆర్చరీలో రాణిస్తున్నామంటే అందుకు మావారే కారణం. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న క్రీడ. ఖర్చుకు వెనకాడకుండా ఆయన మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. మమ్మల్ని క్రీడా ప్రాంగణానికి చేర్చడానికి మావారు ఏకధాటిగా పదిహేను గంటలపాటు కారు డ్రైవింగ్ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి."

• **శాఖమూరి మల్లిఖార్జునరావు,** నందిగామ

తినేటప్పుడు నీళ్లు తాగొచ్చా?



భోజనం చేసేటప్పుడు, ఏదైనా చిరుతిండి తినేటప్పుడు నీళ్లు తాగవచ్చా? అనే సందేహం చాలామందికి వచ్చే ఉంటుంది. ఆహారాన్ని తింటూ మధ్యలో నీళ్లు తాగడం వల్ల పొట్టలో ఉత్పత్తి అయ్యే ఆమ్లాలు పలుచగా మారి జీర్ణక్రియ ఆలస్యమవుతుందని కొందరు, పోషకాలను వేగంగా గ్రహించడంతోపాటు అధికంగా వేడికి గురికాకుండా శరీరాన్ని కాపాడుతుందని ఇంకొందరు అంటారు. ఇంతకీ ఏం చెయ్యాలి?

మితంగా: తినేటప్పుడు ఎక్కువగా నీళ్లు తాగితే కడుపు ఉబ్బరిస్తుంది. పొట్ట నిండిన భావనను కలిగిస్తుంది. దీనివల్ల భోజనాన్ని ఆస్వాదించడం కష్టమవుతుంది. రుచికరమైన ఆహారపదార్థాలను తినేటప్పుడు... నీళ్లు తాగాలని అనిపిస్తేనే తాగాలి. లేదంటే పొట్టలో నీటి శాతం పెరిగి అజీర్ణ సమస్య ఏర్పడుతుంది.

ఆ ఇబ్బంది రాకుండా : కొన్నిసార్లు తిన్న ఆహారం మింగేటప్పుడు కష్టంగా అనిపిస్తుంది. వృద్ధులకు నోరు పొడారిపోయి ఉంటుంది కాబట్టి వీరికి కూడా ఆహారాన్ని మింగడంలో ఇబ్బంది ఎదురవుతుంది. ఇలాంటి సందర్భాల్లో కొద్దిగా నీళ్లు తాగితే అన్నవాహికలోని ఆహారం తేలికగా పొట్టలోకి జారుతుంది. నీరు అన్నవాహికలో కందెనలా పనిచేస్తుంది. ఆహారంలోని పోషకాలను కరిగించి శరీరం త్వరగా గ్రహించేలా చేస్తుంది.

బరువు తగ్గేందుకు: భోజనం మధ్యలో నీళ్లు తాగడం వల్ల ఎక్కువగా తినాలన్న ఆలోచన రాదు. దీనివల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. భోజనానికి ముందు, భోజనం తరవాత కొద్దిగా నీళ్లు తాగడం వల్ల జీర్ణాశయానికి తగినంత తేమ అందుతుంది, జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. మూత్ర పిండాలలో నీరు చేరి మలాన్ని మెత్తబరుస్తుంది. దీనివల్ల మలబద్ధకం రాదు. శరీర వ్యర్థాలన్నీ తేలికగా బయటకు వెళతాయి.

కావాల్సినంత: శరీర తత్వాన్ని అనుసరించి దాహం వేసినంత మేరకు మాత్రమే నీటిని మెల్లగా తాగాలి. అర గ్లాసు నుంచి ఒక గ్లాసు వరకు నీటిని తాగవచ్చు. అంతకుమించి తాగితే కడుపు సాగినట్లయి అసౌకర్యంగా ఉంటుంది. భోజనానికి అర్ధగంట ముందు ఒక గ్లాసు నీళ్లు తాగితే జీర్ణాశయం తేమగా ఉంటుంది. ఆకలి కూడా నియంత్రణలో ఉంటుంది.

ఫ్యాషన్

బ్రొకేడ్ భలే!

వినూత్నంగా కనిపించాలనుకుంటే, మెరుపులీనే దుస్తులను ఎంచుకోవాలి. వాటిలో చెప్పుకోదగినది 'బ్రొకేడ్'. పట్టు మెరుపులు చిందిస్తూ విలాసవంతంగా కనిపించేలా చేసే బ్రొకేడ్ ఫ్యాషన్ దుస్తులు ఇవే!



పట్టు, గోల్డ్ బ్రొకేడ్ వస్త్రాలతో పాటు సౌకర్యానికి పెద్దపీట వేసే నూలు బ్రొకేడ్ వస్త్రంతో తయారయ్యే దుస్తులూ ఉంటాయి. సందర్భానికీ, వాతావరణానికీ తగ్గట్టు నప్పే శైలిని ఎంచుకునే భిన్నమైన మెటీరియల్స్‌తోనూ బ్రొకేడ్ దుస్తులు తయారవుతూ ఉంటాయి.

సిల్క్ బ్రొకేడ్: పట్టు దారాలతో తయారయ్యే ఈ బ్రొకేడ్ సహజసిద్ధమైన మెరుపుతో, మృదుత్వంతో ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సంక్లిష్టమైన ఆకృతుల్లో, వైవిధ్యమైన రంగుల్లో రూపొందే ఈ తరహా బ్రొకేడ్... పండుగలు, వేడుకలకు ఎంతో బాగా నప్పుతుంది.

బెనారస్ బ్రొకేడ్: వారణాసి మూలాలున్న బెనారస్ బ్రొకేడ్ పట్టు దారాలు, ఎంబ్రాయిడరీలతో తయారవుతుంది. పూలు, లతల డిజైన్లు బంగారం, వెండి దారాలతో తయారవుతూ ఉంటాయి. చీరలు, ఇతర సంప్రదాయ దుస్తుల తయారీ కోసం బెనారస్ బ్రొకేడ్‌ను ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.



గోల్డ్ బ్రొకేడ్: అసలైన బంగారు పోగులతో లేదా బంగారు రంగు దారాలతో తయారయ్యే గోల్డ్ బ్రొకేడ్‌ను వేడుకల్లో వేసుకునే విలాసవంతమైన దుస్తుల తయారీకి ఉపయోగిస్తూ ఉంటారు. బంగారు పోగులు వస్త్రానికి రాచరిక హుందాతనాన్ని ఆపాదిస్తాయి. కాబట్టి పెళ్లిళ్లలో వధువులు ధరించే వస్త్రాల కోసం ఈ వస్త్రాన్నే ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.



మెరిసే చర్మానికి మునగాకు

అందానికి, ఆరోగ్యానికి మునగాకు ఎంతగానో తోడ్పడుతుంది. దీనిలో ఎ, సి, ఇ విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు, మరెన్నో పోషకాలు ఉన్నాయి. చలికాలంలో చర్మాన్ని మెరిపించడంలో మునగాకు ఎలా సహకరిస్తుందో తెలుసుకుందాం.

- మునగాకును ఆహారంలో చేర్చుకోవడం వల్ల అందులోని పోషకాలు చర్మం మీద పేరుకునే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. వ్యర్థాలన్నీ తొలగి చర్మం కాంతిమంతం అవుతుంది.
- ఒక గిన్నెలో గుప్పెడు మునగాకులను వేసి ఒక గ్లాసు నీళ్లు పోసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీటిని వడబోయాలి. దీనితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచి టోనర్‌లా పనిచేసి చర్మం మృదువుగా మారుతుంది.
- మునగాకును తరచూ తినడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ పెరిగి, తేమ అందుతుంది. చర్మం మీద నిలిచి ఉండే కొవ్వులను కరిగించి మొటిమలు రాకుండా చేస్తుంది. ముఖం మీద ముడతలు, గీతలు ఏర్పడకుండా నివారిస్తుంది. అకాల వార్ధక్య లక్షణాలు రానీయకుండా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.



- మునగాకులను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. బాగా ఆరాక మెత్తని పొడిలా చేయాలి. దీనితో ముఖాన్ని మెల్లగా రుద్దితే బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ తొలగిపోతాయి.
- గుప్పెడు మునగాకులను తీసుకుని నీళ్లు చల్లుతూ మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అర్ధగంట ఆరనివ్వాలి. తరవాత మంచినీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మ రంధ్రాల్లోని మురికి తొలగిపోతుంది. మొటిమలు, బ్లాక్ హెడ్స్ రావు. చర్మానికి మంచి ఛాయ వస్తుంది.

కడప స్టీల్‌పై ప్రతిపాదనలు లేవనడం సిగ్గుచేటు

» కేంద్రమంత్రి కుమారస్వామి వ్యాఖ్యలు రాష్ట్రానికి అవమానకరం

» ఆ వ్యాఖ్యలపై ఏపీ ఎంపీలు మౌనంగా ఉంటారా?: షర్మిల

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కడప స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రాన్ని అవమానించేలా ఉన్నాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. కడప స్టీల్ ప్లాంట్‌పై ప్రతిపాదనలే లేవని, వస్తే ఆలోచిస్తామని కుమారస్వామి చెప్పడం నిజంగా సిగ్గుచేటని, ఏపీ ప్రయోజనాలతో చెలగాటం ఆడటమేనని విమర్శించారు. మంగళవారం ఎక్స్ వేదికగా షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ఎంపీలు మౌనంగా ఉండటం వారి చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు. కడప ఉక్కు సీమ ప్రజల హక్కు అని చెప్పారు. కుమారస్వామి ప్రకటనను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థిస్తారా? అసలు కడప స్టీల్ ప్లాంట్ కడతారా? లేదా అని ప్రశ్నించారు.

ప్రభుత్వ అధికారాలపై స్పష్టత ఇవ్వండి

» వక్ఫ్‌బోర్డు సభ్యుల తొలగింపుపై హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సభ్యులను తొలగించడంలో ప్రభుత్వానికి ఉన్న అధికారాలపై స్పష్టత ఇవ్వాలని అదనపు ఏజీని హైకోర్టు ఆదేశించింది. వక్ఫ్‌బోర్డు సభ్యులను తొలగించడంతోపాటు కొత్తవారిని నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యం మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఎదుట విచారణకు వచ్చింది. వక్ఫ్‌బోర్డు నామినేటెడ్ సభ్యులుగా తమను తొలగించి, కొత్తవారిని నియమిస్తూ ఇచ్చిన జీవోలను సవాల్ చేస్తూ సయ్యద్ సఫీ అహ్మద్ ఖాద్రీ మరో ఇద్దరు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. బోర్డు సభ్యులను అర్ధాంతరంగా తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివప్రతాప్ వాదనలు వినిపిస్తూ.. వక్ఫ్ బోర్డు చట్టం ప్రకారం సభ్యులను నియమించే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. విచారణను న్యాయమూర్తి ఈ నెల 13కి వాయిదా వేశారు.

17న మంగళగిరి ఎయిమ్స్‌కు రాష్ట్రపతి

» ప్రథమ వార్షికోత్సవానికి హాజరుకానున్న ద్రౌపది ముర్ము

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఏఐఐఎంఎస్) ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్నారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. 'తాత్కాలికంగా ఖరారైన కార్యక్రమం ప్రకారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 17న ఉదయం 11.20 గంటలకు భారత వాయుసేన విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 12.05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్తారు. స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం తిరుగు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటనలో గవర్నర్, సీఎం చంద్రబాబు కేంద్ర, రాష్ట్ర మంత్రులు తదితర ప్రముఖులు పాల్గొంటారు' అని సీఎస్ తెలిపారు.

'వర్గీకరణపై' కౌంటర్ వేయండి: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఇంప్లీడ్ పిటిషన్లు వేశామని, తమ వాదనలు వినాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తరఫు న్యాయవాది మట్టా జయకర్, మరొకరి తరఫు న్యాయవాది డొక్కా న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. అనుబంధ పిటిషన్లపై తదుపరి విచారణలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయమూర్తి ప్రకటించారు. రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 86 జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు.

అధికారంలో ఉన్నప్పుడు గుర్తురాలేదా?

» ప్రజా సమస్యలపై బొత్సను వైసీపీ కార్యకర్తల నిలదీత

కాకినాడ(కార్పొరేషన్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి చవి చూసిన వైసీపీ మొట్టమొదటిసారిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. మంగళవారం కాకినాడలో జరిగిన వైసీపీ సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేకుంటే జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కరెంటు చార్జీలు తగ్గించకపోతే ఈ నెల 27న పోరాటం చేస్తామన్నారు. అయితే.. బొత్స మాట్లాడుతున్న సమయంలో వేదికముందున్న వైసీపీ కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తూ.. "అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా" అని నిలదీశారు.

'అక్రమ నిర్బంధం' కేసులో తీర్పు రిజర్వ్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సానుభూతిపరుడు పప్పుల వెంకట రమణారెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, రిమాండ్ విధిస్తూ వినుకొండ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటుకావంటూ దాఖలైన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. హెబియస్ కార్పస్ పిటిషన్ వేసేనాటికి నిందితుడు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడని తెలిపారు. అందువల్ల పిటిషన్ చెల్లుబాటు కాదన్నారు.

హోంమంత్రి అనితకు హైకోర్టులో ఊరట

» విశాఖ కోర్టులో ఉన్న చెక్‌బౌన్స్ కేసు కొట్టివేత

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అనితపై ప్రస్తుతం విశాఖపట్నం కోర్టులో ఉన్న చెక్‌బౌన్స్ కేసును హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం కేసు విచారణ సందర్భంగా హోంమంత్రి అనిత, ఫిర్యాదుదారుడు వేగి శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరయ్యారు. అనిత తన వద్ద తీసుకున్న రూ.70లక్షలకు గాను 2018లో చెక్కు ఇచ్చారని, అది చెల్లలేదని పేర్కొంటూ వేగి శ్రీనివాసరావు విశాఖపట్నం కోర్టులో 2019లో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించి జరిగిన విచారణలో.. హోంమంత్రి తరఫు న్యాయవాది వి.వి.సతీష్ తన వాదన వినిపించారు. చెక్ బౌన్స్ కేసును రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారుడు వేగి శ్రీనివాసరావు, హోంమంత్రి నిర్ణయించుకున్నారన్నారు. ఇరువురి మధ్య కుదిరిన రాజీలో భాగంగా ఇప్పటికే రూ.10లక్షలు వేగి శ్రీనివాసరావుకు అందజేశామని, మరో రూ.5లక్షలు చెక్ రూపంలో వేగి శ్రీనివాసరావు తరఫు న్యాయవాదికి అందజేస్తున్నామని వివరించారు.

విశాఖ పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతి..

రెండు సంస్థలపై కేసు నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు నుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి వ్యవహారంలో రెండు సంస్థలపై అధికారులు కేసులు నమోదుచేశారు. సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీల్లో పోర్టు పరిధిలో ఉన్న కంటైనర్లలో 483 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు.. ఇండోర్‌కు చెందిన ఏఎస్‌జీ ఫుడ్స్, కాకినాడకు చెందిన 'బిబో' సంస్థపై జిల్లా కలెక్టర్ కోర్టులో కేసు దాఖలు చేసినట్టు తెలిపారు. అయితే పట్టుబడింది రేషన్ బియ్యమేనని డీలర్లు చెబుతున్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.2 కోట్లు ఉంటుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.

ప్రైవేటుకే నైపుణ్య విశ్వవిద్యాలయం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ప్రైవేటుకే అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాల రూపకల్పన, యూనివర్సిటీని గుర్తించేందుకు ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. తొలుత స్కిల్ యూనివర్సిటీపై మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నెల 18 నుంచి 27 వరకు ప్రైవేటు యూనివర్సిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, వాటిని పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న వర్సిటీని స్కిల్ యూనివర్సిటీగా ప్రకటించాలని స్పష్టం చేసింది. షెడ్యూలు ప్రకారం జనవరి 15న స్కిల్ యూనివర్సిటీని కమిటీ ప్రకటించాల్సి ఉంది.

జగన్ నిర్వాకం

(మొదటి పేజీ తరువాయి)

పెరిగింది. రోడ్ల నిర్మాణం రేట్లు 25 నుంచి 28 శాతం పెరిగాయి. భవనాలకు సంబంధించి 35 శాతం నుంచి 55 శాతం పెరిగాయి. లే అవుట్స్‌లో గ్రావెల్ ధర 6 శాతం పెరుగుతుందని అంచనా. ఎస్‌వోఆర్ రేట్లు 29 శాతం, జీఎస్టీ 6 శాతం పెరిగింది. ఇతర నష్టాల వల్ల 1.6 శాతం భారం పడుతోంది. మొత్తంగా అన్నీ కలిపి 45 శాతం ధరలు పెరుగుతున్నాయి. ఐదేళ్లపాటు అమరావతి పనులు ఆపకుండా కొనసాగించి ఉంటే ఇంత భారం ఉండేది కాదు. అయినా... సీఎం చంద్రబాబు సూచన మేరకు మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేసి తీరతాం" అని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

20,285 కోట్ల పనులకు ఓకే..

అమరావతిలో మొత్తం రూ.20,285 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో.. రూ.11,467.27 కోట్ల పనులకు నిధుల విడుదలపై మంగళవారం జీవోలు కూడా జారీ అయ్యాయి. మరో రూ.8821.44 కోట్ల విలువైన పనులను ఆమోదిస్తూ మంగళవారం సీఆర్డీయే సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. "రూ.4,521 కోట్లతో ట్రంక్ రోడ్ల నిర్మాణం, రూ.3,807 కోట్లతో ల్యాండ్ పూలింగ్ లే అవుట్లలో రోడ్ల నిర్మాణం చేపడతాం. న్యాయమూర్తులు, మంత్రుల బంగళాలను రూ.492 కోట్లతో పూర్తి చేయాలని నిర్ణయించాం. నేలపాడు, రాయపూడి, అనంతవరం, దొండపాడు వంటి గ్రామాల్లో 236 కిలోమీటర్ల లే అవుట్ రోడ్లకు అనుమతించాం" అని మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో మొత్తం 360 కిలోమీటర్ల మేర ట్రంక్ రోడ్లు ఉండగా.. వాటిలో 97.5 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. ఈ నెల 16న జరిగే అథారిటీ తదుపరి సమావేశంలో మరికొన్ని పనులకు ఆమోదం తీసుకుంటామని చెప్పారు.

నెలాఖరుకు టెండర్ల ప్రక్రియ పూర్తి

ఈ నెల 15కల్లా అన్ని టెండర్లూ పిలుస్తామని, ఈ నెలాఖరుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఇంటీరియర్‌కు వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యమైన సింగపూర్ ప్రభుత్వంపై జగన్ సర్కారు కేసులు పెట్టిందని... వారు ఇప్పుడు మళ్లీ ముందుకు రావాలంటే ఎలా వస్తారని మంత్రి నారాయణ ప్రశ్నించారు. ఈ విషయంలోనూ సీఎం నిర్ణయం మేరకు ముందుకెళ్తామని చెప్పారు.



వీటిపై జీవోలు...

- 41వ అథారిటీ సమావేశంలో వివిధ పనులు చేపట్టేందుకు అనుమతిస్తూ చేసిన తీర్మానాలను పురపాలక శాఖ ఆమోదించింది. రూ.11,467.27 కోట్లతో 20 ఇంజనీరింగ్ పనులకు ఆమోదం తెలుపుతూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. అందులో ముఖ్యమైనవి...
- గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, టైప్-2, క్లాస్-4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్స్ నిర్మాణ పనులు - రూ.594.54 కోట్లు
- ఎన్‌జీవో భవనాల్లో మిగిలిన పనులు - రూ.607.50 కోట్లు
- ఐఏఎస్ అధికారులకు సంబంధించిన 111 బంగళాల పెండింగ్ పనులు - రూ.516.5 కోట్లు
- హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు - రూ.984 కోట్లు
- వరద నివారణ పనులు - రూ.1,585.95 కోట్లు

ఆర్థిక వృద్ధి.. ఉపాధి కల్పన

» టూరిజం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలు

» వచ్చే ఐదేళ్లలో రూ. 25 వేల కోట్ల పెట్టుబడులు

» 2024-29 పర్యాటక పాలసీ విడుదల

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల పెంచడానికి కృషి చేస్తోంది. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాల సాధనలో భాగంగా రూపొందించిన 2024-29 పర్యాటక పాలసీని ఆ శాఖ సెక్రటరీ వినయ్ చంద్ మంగళవారం విడుదల చేశారు. పర్యాటక రంగంలో వచ్చే ఐదేళ్లలో రూ.25వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. పెట్టుబడుల ద్వారా రాష్ట్ర జీవీఏ 8 శాతానికి పెంచడంతో పాటు 15శాతం ఉద్యోగాలు పెంచాలని నిర్ణయించారు. అంతర్జాతీయ, జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా ఏపీని నిలబెట్టడానికి చర్యలు తీసుకోనున్నారు. అంతర్జాతీయ పర్యాటకుల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో పాటు మంచి పర్యాటక అనుభూతిని కల్పించడానికి వేసైట్ ఎమినిటీస్ పెంచడానికి నిర్ణయించారు. రాష్ట్ర సహజ, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు బాధ్యతాయుతమైన పర్యాటక పద్ధతులను అమలు చేస్తామని పాలసీలో పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లకు గాను పలు లక్ష్యాలను పాలసీలో నిర్దేశించారు. ఆర్థిక వృద్ధికి తోడ్పాటు అందించే విధంగా టూరిజం పాలసీని రూపొందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4.6 శాతంగా ఉన్న టూరిజం జీవీఏను 8 శాతానికి పెంచాలి. ఉపాధి కల్పనలో భాగంగా వచ్చే ఐదేళ్లలో పర్యాటకంలో 12 నుంచి 15 శాతానికి ఉద్యోగాలు పెంచనున్నారు. పర్యాటకుల సగటు ఖర్చును రూ.1,700 నుంచి రూ.25 వేలకు పెరిగేందుకు సదుపాయాలు కల్పించనున్నారు. ప్రస్తుతం పర్యాటకులు సగటున ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే పర్యాటకానికి సమయం కేటాయిస్తుండగా.. దానిని ఐదు రోజులకు పెరిగేలా చూడాలని నిర్ణయించారు.

ఆధ్యాత్మిక టూరిజంపై మరింత దృష్టి

రాష్ట్రంలో ఆధ్యాత్మిక, బీచ్, నదులు, ప్రకృతి పర్యాటకం అభివృద్ధిపై పాలసీలో ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో పీపీపీ విధానంలో ఏడు యాంకర్ హబ్స్ ఏర్పాటు చేయబోతున్నారు. విశాఖపట్నం, తిరుపతి, అరకు వ్యాలీ, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, గండికోటలో పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. థీమాటిక్ (నేపథ్య) సర్క్యూట్స్ అభివృద్ధిలో భాగంగా ఏడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో 2 బుద్ధిస్ట్ సర్క్యూట్లు, 10 హిందూ ఆలయాలు, 5 బీచ్‌లు, 4 రివర్ క్రూజ్ సర్క్యూట్లు, 3ఎకో సర్క్యూట్లు, 2 సముద్ర క్రూజ్ సర్క్యూట్లు, ఒక సీప్లేన్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేయనున్నారు. బౌద్ధ వారసత్వానికి మరింత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం అంతర్జాతీయ బౌద్ధ సంస్థలతో కలిసి పని చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న హోటల్ గదులను 3,500 నుంచి 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సినిమా టూరిజం అభివృద్ధి కోసం ఆర్ట్ అండ్ ఫిల్మ్ స్టూడియోలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిజం సెక్యూరిటీ ఫోర్స్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భద్రతా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పెద్ద టూరిజం సెంటర్లలో నియమిస్తారు. పెట్టుబడుదారులకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. ధ్రువీకరణ పత్రాల విషయంలో పరిశ్రమలకు వంద శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. క్యాపిటల్ సబ్సిడీని 25శాతం వరకూ అందిస్తుంది. రూ.25లక్షల పెట్టుబడికి రెండుసార్లు, రూ.7కోట్లు పైన ఉంటే 4 విడతల్లో సబ్సిడీ అందిస్తుంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా 5 శాతం సబ్సిడీ ఇస్తుంది. అనుమతులన్నీ సత్వరం ఆన్‌లైన్‌లోనే అందించనుంది.

స్పోర్ట్స్ పాలసీ విడుదల

ఏపీలో అంతర్జాతీయ, జాతీయ క్రీడలు నిర్వహణ కోసం ఆ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించింది. ఇందుకు ప్రత్యేకంగా స్పోర్ట్స్ పాలసీని రూపొందించింది. మంగళవారం క్రీడా శాఖ సెక్రటరీ వినయ్‌చంద్ ఆ పాలసీని విడుదల చేశారు. ఈ పాలసీలో ఆకర్షణీయమైన నగదు పురస్కారాలను ప్రకటించారు. ఒలింపిక్స్‌లో స్వర్ణ పతక విజేతకు రూ.7కోట్లు, రజతానికి 5కోట్లు, కాంస్యానికి 3కోట్లు ఇవ్వనున్నారు. ఆ క్రీడల్లో పాల్గొన్న వారికి రూ.15 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు.

'ఉపాధి'లో రోజుకు రూ.300


కూలీల వేతనం పెరిగేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కేంద్రం నిర్ణయించిన ప్రకారం కూలీలకు రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చేసి, వారికి అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఇప్పటికే పలుమార్లు సమీక్షలు జరిపారు. వారి ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర, జిల్లాల స్థాయిలో వేతన మానిటరింగ్ సెల్ ఏర్పాటుకు మార్గదర్శకాలు జారీచేసింది. దీనికి రాష్ట్రస్థాయి కోఆర్డినేటర్‌గా ఉపాధి హామీ పథకం చీఫ్ విజిలెన్స్ అధికారి వ్యవహరిస్తారు. జిల్లా స్థాయి కోఆర్డినేటర్‌గా జిల్లా విజిలెన్స్ అధికారి లేక డ్వామా పీడీ ఉంటారు. వీరు క్షేత్రస్థాయిలో పర్యటించి తక్కువ వేతనాలకు కారణాలను విశ్లేషిస్తారు. కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించి పనులు ఏ విధంగా చేపడితే రూ.300 వేతనం దక్కుతుందో వివరిస్తారు. జిల్లా కలెక్టర్లు, డ్వామా పీడీలు ఉపాధి కూలీల వేతనం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్ఐసీ నివేదికల ప్రకారం రాష్ట్రంలో ఉపాధి కూలీలకు సరాసరిన రోజుకు రూ.255 మాత్రమే వేతనం దక్కుతోందని గుర్తించారు. కాగా, ఉపాధి హామీ పథకంపై సీఎం చంద్రబాబు ఆగస్టు 20న చేసిన సమీక్షలో కూలీలకు తగిన అవగాహన కల్పించి, సరాసరి వేతనరేటు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. పవన్ కల్యాణ్ కూడా వేతన మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

'స్పామ్'.. ఏపీ!

(మొదటి పేజీ తరువాయి)

అర్థం కాని భాషలో ఎవరెవరో మాట్లాడతారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌ను స్పామ్‌కాల్స్‌గా టెలికం రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్) గుర్తించింది. ఈ తరహా స్పామ్ కాల్స్ బాధితులు ఏపీలో ఎక్కువ మంది ఉన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే స్పామ్ కాల్స్‌ను ఆన్సర్ చేస్తున్న వారిలో దేశ రాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉండగా ఏపీ 2వ స్థానంలో ఉంది. స్పామ్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లపై ఎయిర్‌టెల్ సంస్థ సర్వే చేపట్టింది. ఈ నివేదికను విజయవాడలో మంగళవారం విడుదల చేసింది. వివిధ కేటగిరిల్లో ఈ సర్వే చేసింది. ఈ నివేదిక ప్రకారం.. ఢిల్లీ తర్వాత స్పామ్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లతో బాధపడే సెల్‌ఫోన్ యూజర్లు ఏపీలో అత్యధికంగా ఉన్నారు. స్పామ్ కాల్స్‌ను స్వీకరిస్తున్న వారిలో 79 శాతం మంది పురుషులు, 21 శాతం మంది మహిళలు ఉన్నారు. ఢిల్లీ, ముంబై, కర్ణాటక నుంచి ఎక్కువగా ల్యాండ్‌లైన్ల నుంచి ఈ కాల్స్ వస్తున్నాయి. 35 శాతం మంది స్పామర్లు ల్యాండ్‌లైన్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ కాల్స్ పని దినాల్లోనే ఎక్కువగా వస్తున్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు ఫోన్లు చేసే స్పామర్లు ఆదివారం మాత్రం దూరంగా ఉంటున్నారు. ఆదివారం 40 శాతం వరకు స్పామ్ కాల్స్ తగ్గుతున్నాయి. ఈ కాల్స్ ఎక్కువగా ఢిల్లీ, ముంబై, కర్ణాటక రాష్ట్రాల నుంచి వస్తున్నాయి. స్పామ్ ఎస్ఎంఎస్‌లు మాత్రం గుజరాత్, ఉత్తరప్రదేశ్, కోల్‌కతా నుంచి అధికంగా వస్తున్నాయని సర్వేలో వెల్లడైంది. స్పామ్ ఎస్ఎంఎస్‌లు రిసీవ్ చేసుకుంటున్న బాధితులు ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్నారు.



ఇదీ బాధితుల లెక్క
18 ఏళ్లలోపు వారిలో 0.8% - 18-25 ఏళ్ల వారిలో 15%
26-35 ఏళ్ల వారిలో 28.2% - 36-60 ఏళ్ల వారిలో 48%
60 ఏళ్లు పైబడిన వారిలో 8%

'సమయం' చూసుకుని!

ఈఎంఐ విధానంలో మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాక చాలా మంది రూ.30 వేలు ఆపైన ధర పలికే ఫోన్లను కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి ఫోన్లకు స్పామ్ కాల్స్ తక్కువగా వస్తున్నాయని ఎయిర్‌టెల్ సర్వే పేర్కొంది. రూ.15 వేల నుంచి రూ.20 వేల ఖరీదు చేసే ఫోన్లకు మాత్రం స్పామ్‌కాల్స్ ఎక్కువగా వస్తున్నాయని తెలిపింది. సెల్‌ఫోన్ యూజర్లు రోజుకు 13 గంటల పాటు స్పామ్‌కాల్స్‌తో ఇబ్బందులు పడుతున్నారని సర్వేలో తేలింది. పగటి పూట 7 గంటలు, రాత్రి సమయంలో 6 గంటల పాటు స్పామ్‌కాల్స్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో సెల్‌ఫోన్ యూజర్లకు అత్యధిక సంఖ్యలో స్పామ్ కాల్స్ వస్తున్నాయి. తర్వాత రాత్రి 7 గంటల నుంచి 12 గంటల మధ్య కూడా స్పామ్‌కాల్స్ మోగుతూనే ఉంటున్నాయని వినియోగదారులు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, సానా సతీశ్, కృష్ణయ్య

రాష్ట్రం నుంచి రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

మూడు సీట్లకు మూడే నామినేషన్లు

అమరావతి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికలు జరుగుతున్న మూడు సీట్లు ఏకగ్రీవం అయ్యాయి. ఈ సీట్లకు మంగళవారం ముగ్గురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించనున్నారు. నామినేషన్ల దాఖలుకు చివరిరోజైన మంగళవారం అసెంబ్లీ భవనంలో టీడీపీ అభ్యర్థులు బీద మస్తాన్‌రావు, సానా సతీశ్, బీజేపీ అభ్యర్థి ఆర్ కృష్ణయ్య ఎన్నికల అధికారి వనితా రాణి ముందు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. టీడీపీ, బీజేపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అసెంబ్లీ భవనం కిటకిటలాడింది. ఈ ఎన్నికతో రాజ్యసభలో టీడీపీకి మళ్లీ ప్రాతినిధ్యం దక్కుతోంది. పోయిన ఏడాది కనకమేడల రవీంద్రకుమార్ పదవీ విరమణ తర్వాత రాజ్యసభలో టీడీపీకి సభ్యులు ఎవరూ లేకుండా పోయారు. ఆవిర్భావం తర్వాత టీడీపీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేనిపరిస్థితి ఏర్పడటం ఇదే ప్రథమం. ఇప్పుడు ఆ పార్టీ తరఫున ఇద్దరు సభ్యులు పెద్దల సభలో అడుగు పెట్టబోతున్నారు.

బీసీలకు పెద్ద పీట వేసిన కూటమి: అచ్చెన్న

ఎన్డీయే కూటమి రాష్ట్రంలో బీసీ వర్గాలకు పెద్దపీట వేసిందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 'మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగితే అందులో రెండు సీట్లను కూటమి పార్టీలు బీసీ వర్గాలకు ఇచ్చాయి. బీజేపీ అభ్యర్థి కృష్ణయ్య తెలంగాణ వ్యక్తి అని కొందరు బుద్ధి లేని విమర్శలు చేస్తున్నారు. ఆయన బీసీ వర్గాలకు జాతీయ నాయకుడు. అన్ని రాష్ట్రాలకు చెందిన వ్యక్తి' అని అచ్చెన్న అన్నారు.

సొంత ఇంటికి వచ్చాను: బీద

టీడీపీలో చేరడం మళ్లీ సొంత ఇంటికి వచ్చినట్లుందని బీద మస్తాన్‌రావు వ్యాఖ్యానించారు. 'నేను 39ఏళ్లు టీడీపీలోనే ఉన్నాను. మధ్యలో రెండున్నరేళ్లు మాత్రం వేరే పార్టీలో ఉన్నాను. అలా వెళ్లాల్సి వచ్చినందుకు బాధపడుతున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వెళ్లడానికి కృషి చేస్తాను' అని ఆయన చెప్పారు. తనకు అవకాశం ఇచ్చినందుకు పార్టీ అధినేత చంద్రబాబు, యువ నేత లోకేశ్‌కు సానా సతీష్ ధన్యవాదాలు తెలిపారు.

బీసీల రిజర్వేషన్లకై పోరాడతా: ఆర్ కృష్ణయ్య

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కోసం పోరాడతానని బీజేపీ రాజ్యసభ అభ్యర్థి ఆర్ కృష్ణయ్య అన్నారు. 'గత 50ఏళ్లుగా బీసీల కోసం పోరాటంచేస్తున్నా. ఎక్కడున్నా ఎప్పుడూ బీసీల కోసం పనిచేస్తా. పదవుల కోసం పార్టీల కండువాలు వేసుకోలేదు. పార్టీలే నన్ను పిలిచి రాజ్యసభ టికెట్లు ఇచ్చాయి' అన్నారు.

ఏ2 నుంచి ఏ1గా విజయసాయి: సోమిరెడ్డి

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్రమాలు, అరాచకాల్లో ఏ2 నుంచి ఏ1గా మారుతున్న వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి వయసుతో పాటు ఒంట్లో కొవ్వు పెంచుకుని, నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. 'విజయసాయిరెడ్డి అడ్డగోలు వాగుడును జీర్ణించుకోలేకపోతున్నాం. ఆయన బతుకంతా అవినీతి, అక్రమాలు, అరాచకాలే. ముఖ్యమంత్రి అంటే కనీస మర్యాద లేకుండా క్రూరంగా మాట్లాడుతుంటే డీజీపీ ఏం చేస్తున్నారో? చంద్రబాబుపై తప్పుడు మాటలు మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి ఇంకా బయట ఎలా ఉన్నాడో అర్థం కావట్లేదు. సోషల్ మీడియాలోనూ రెచ్చిపోతున్న విజయసాయిరెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి' అని సోమిరెడ్డి డిమాండ్ చేశారు.

ఇక వాట్సాప్ పాలన..!

పాలనలో మరింతగా టెక్నాలజీ వినియోగం

» అన్ని ప్రజా సేవలకూ వాట్సాప్ వేదిక కావాలి

» జనవరి 1న జనన, మరణాల నమోదుకు కొత్త పోర్టల్

» మరో వెయ్యి గ్రామ సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు: సీఎం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని సమర్థవంతమైన పాలన అందిస్తామని, భవిష్యత్‌లో వాట్సాప్ వేదికగా పరిపాలన సాగిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ నుంచి, ఆదాయ ధ్రువీకరణ వరకు.. జనన, మరణాల నమోదు నుంచి ఇతర ప్రజాసేవల వరకూ వాట్సాప్‌ను వేదికగా చేసుకునేలా వ్యవస్థలను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కృత్రిమ మేధ (ఏఐ), డీప్‌టెక్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవల వినియోగంతో ప్రజలకు వేగవంతమైన పరిష్కారాలు అందుతాయని చెప్పారు. శాఖల వారీగా రియల్‌టైమ్ డ్యాష్ బోర్డుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎస్‌కు అప్పగిస్తామని ప్రకటించారు. మరో వెయ్యి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అందుకు అవసరమైన వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు రూ.20కోట్లు మంజూరు చేసేందుకు సీఎం అంగీకరించారు. జనవరి 1న జనన, మరణాల నమోదుకు కొత్త పోర్టల్‌ను ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధ్రువీకరించుకున్నామని గుర్తుచేశారు. భవిష్యత్తులో పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్ల గురించి రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని సూచించారు. అలాగే రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్లు సహాయపడతాయని చెప్పారు.

ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగిన ధర, 48 గంటల్లోనే రైతులకు డబ్బులు జమచేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు సీఎంకు వివరించారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందో.. లేదో.. సరిచూసుకోవాలని చంద్రబాబు వారికి సూచించారు.

ప్రత్యేక పోర్టల్‌లో భారీ ప్రాజెక్టుల ప్రగతి

రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు.

జనన-మరణ ధ్రువీకరణ పత్రాలకు కొత్త పోర్టల్

రాష్ట్రంలో జనన-మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో తలెత్తుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేలా నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్‌ను నిర్వహించాలని సూచించారు.

ఫిర్యాదులకు పరిష్కారం

- ఇదే అజెండాగా కలెక్టర్ల సదస్సు
- నేడు, రేపు నిర్వహణ
- జగన్ పాపాలపై ఫిర్యాదుల వెల్లువ
- గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల విన్నపాలకు జవాబుదారీ
- ఫ్రీ హోల్డ్, అసైన్డ్ సమస్యలు తీరేనా?
- రీ సర్వే చిక్కులు ఇకనైనా తొలగేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో జరిగిన అన్యాయాలను సరిదిద్దాలని ప్రజలు గత ఆరు నెలలుగా ప్రభుత్వానికి విన్నపాలు ఇస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వాటి పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించిన సర్కారు, ప్రజా ఫిర్యాదులను ఆర్టీజీఎస్ పరిధిలోకి తీసుకొస్తోంది. ప్రజల భూముల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఆరోతేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. వేల సంఖ్యలో ప్రజా విన్నపాలు ఈ సదస్సుల్లో వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు బుధవారం నుంచి రెండు రోజులపాటు కలెక్టర్ల సదస్సు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. గత ఐదారు నెలలుగా కూటమి ప్రభుత్వానికి వచ్చిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ప్రధాన అజెండాగా సర్కారు కీలక చర్యలు చేపట్టబోతుంది. ఆ అంశాలను జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విన్నపానికి జవాబుదారీ కల్పించేందుకు ప్రత్యేకంగా పబ్లిక్ రిడ్రెస్సెల్ గ్రీవెన్స్ సిస్టమ్‌ను (పీఆర్‌జీఎస్) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీన్ని రియల్‌టైమ్ గవర్నెన్స్ సిస్టమ్‌తో (ఆర్‌టీజీఎస్) అనుసంధానించబోతున్నారు. ఆర్టీజీఎస్‌లో ఉండే డేటాను ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విభాగాధిపతులు ఎప్పుడైనా పరిశీలన చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ఆర్టీజీఎస్‌లోకి వస్తే ఏ సమస్య ఎలా పరిష్కరించారు...ఇప్పుడు ఆ సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉంది...ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉంది...ఒక వేళ పరిష్కారం అయితే, సంబంధిత వ్యక్తి స్పందన ఎలా ఉందో నేరుగా ముఖ్యమంత్రి తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీ కోసమే ఈ ప్రక్రియకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అధికారవర్గాలు చెబుతున్నాయి. కలెక్టర్ల సదస్సులో సీఎం ఇదే అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా ప్రభుత్వం తమకోసం పనిచేస్తుందన్న సానుకూల దృక్పథం ఏర్పడేలా జిల్లా కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. అయితే, ప్రభుత్వానికి అందిన ప్రజా ఫిర్యాదుల్లో అత్యధిక శాతం రెవెన్యూశాఖ పరిష్కరించేవే ఉన్నాయి. అందులో ప్రధానమైనది భూముల సమస్య.

అసైన్డ్‌పై నిషేధం ఎత్తివేస్తారా?: కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన మదనపల్లి ఫైల్స్ సంఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం నిలుపుదల చేసింది. తొలుత మూడు నెలలు అన్నారు. ఆ తర్వాత మరో నెల పొడిగించారు. చివరకు నవంబరులో మరో నెల పొడిగించారు. ఇది కాస్తా మంగళవారంతో ముగియనుంది. ఈసారి నిషేధం గడువు పొడిగిస్తారా? లేక ఎత్తివేస్తారా? అన్న చర్చజరుగుతోంది.

> మదనపల్లి ఫైళ్ల దహనం తర్వాత ప్రభుత్వానికి 1.92 లక్షల ఫిర్యాదులు, విన్నపాలు వచ్చాయి. ఆ తర్వాత రీ సర్వే గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 2.71 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో గత ఐదు రోజుల వ్యవధిలోనే 20వేల విన్నపాలు సర్కారుకు వచ్చాయి. గత ప్రభుత్వం పాపాలను జనం ఇలా ఫిర్యాదుల రూపంలో కూటమి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. చంద్రబాబు సర్కారుపై ఎంతో నమ్మకం, ఆశతో న్యాయం కోసం వేచిచూస్తున్నారు. వీరి సమస్యలకు సరైన పరిష్కారం చూపడంపైనే బుధవారంతో మొదలవుతున్న కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించనున్నారు.

రీ సర్వే చిక్కులెన్నో?

రీ సర్వే జరిగిన పల్లెల్లో నిర్వహించిన గ్రామసభల్లో 2.71 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. సర్వే నంబర్, సరిహద్దు, భూమి విస్తీర్ణం, ఇతర తప్పులపై వేలాది ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిని పరిష్కరించాలంటే ఆయా గ్రామాల్లో మళ్లీ భూముల సర్వే చేయాలని అధికారవర్గాలు చెబుతున్నాయి. అది అంత సులువుగా ముగిసేది కాదని వారే చెబుతున్నారు. కాబట్టి రికార్డుల్లో సవరణలు చేస్తే సరిపోతుందని రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా చెబుతున్నారు.

తొలిరోజు అజెండాలో శాంతిభద్రతలు...

జిల్లా కలెక్టర్ల సదస్సు బుధ, గురువారాల్లో జరగనుంది. ఈ భేటీలో తొలిరోజు సాయంత్రం శాంతిభద్రతలపై చర్చ జరగనుంది. సాధారణంగా రెండో రోజు చివరి అజెండాగా ఈ అంశం చర్చించడం పరిపాటి. కానీ ఈ సారి తొలిరోజే దీన్ని చర్చించాలని అజెండాలో చేర్చారు.

విజన్ -2047 డాక్యుమెంట్ ఆవిష్కరణ

- కలెక్టర్ల సదస్సులో ఆర్థిక శాఖ ప్రజంటేషన్

2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ నం.1గా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను బుధవారం ప్రభుత్వం..కలెక్టర్ల సదస్సులో ఆవిష్కరించనుంది. ఈ సమావేశంలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ వివరాలను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూశ్ కుమార్ వెల్లడిస్తారు. నిపుణులు, వివిధ ఏజెన్సీలు, మేధావులతో పాటు 17 లక్షల మంది నుంచి విజన్ డాక్యుమెంట్‌పై సూచనలు, సలహాలు స్వీకరించారు. అందరి అభిప్రాయాలు, ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని ఈ డాక్యుమెంట్‌ను రూపొందించారు.

'కరువు రహితా'నికి కార్యాచరణ!

రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు జలవనరుల శాఖ సిద్ధమైంది. బుధవారం మొదలయ్యే కలెక్టర్ల సదస్సులో సీఎం వివిధ ప్రాజెక్టుల పూర్తికి గడువును నిర్దేశించే అవకాశాలు ఉన్నాయి. ఏ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తిచేయాలనుకుంటున్నదీ జలవనరుల శాఖ నివేదించనుంది. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త డయాఫ్రం వాల్ పనులను జనవరి రెండున ప్రారంభించనుంది. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు వచ్చే ఏడాది నవంబరులో మొదలుపెట్టనుంది. చింతలపూడి ఎత్తిపోతలను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని భావిస్తోంది. రాష్ట్రంలో కరువు నివారణకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి దృఢంగా విశ్వసిస్తున్నారు.

గోదావరి-పెన్నా అనుసంధాన పథకాన్ని 2026 జూన్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గోదావరి-బనకచర్ల అనుసంధానంలో భాగంగా మొదటి దశలో గోదావరి నుంచి కృష్ణాకు కొత్త వరద కాలువను తవ్వాలని.. పోలవరం కుడి ప్రధాన కాలువను విస్తరించాలని నిర్ణయించారు. రెండో దశలో కృష్ణా పరీవాహక ప్రాంతం నుంచి నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయరులో 150 టీఎంసీలను నిల్వ చేస్తారు. మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు నీటిని తరలించడానికి నల్లమలలో 31.5 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వుతారు. వంశధార-నాగావళి అనుసంధానం కూడా చేపడతారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉంటూ.. వంశధార ప్రవాహం తక్కువగా ఉన్నప్పుడు గోదావరి జలాలను వంశధార దాకా తరలించడం.. గోదావరి వైపు జలాలు తక్కువగా ఉంటే.. రివర్స్ పంపింగ్ విధానం ద్వారా వంశధార నుంచి గోదావరి వైపు నీటిని తరలించడం.. ఇలా రెండు వైపుల నుంచీ నీటిని తరలించే పథకాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు అధ్యయనం జరుగుతోంది. కలెక్టర్ల సదస్సులో వీటన్నిటిపైనా చర్చ జరుగనుంది.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయండి

- ఆర్వోబీలు, అండర్‌పాస్‌లను నిర్మించండి
- రైల్వే మంత్రికి కూటమి ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు, కూటమి ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టాలని, వివిధ మార్గాలలో కొత్తగా ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్ రైళ్లను నడపాలని, ఆర్వోబీలు, అండర్‌పాస్‌ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీలు కేంద్ర మంత్రిని కోరారు. మంగళవారం, ఇక్కడ రైల్వే భవన్‌లో మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఆ పార్టీ ఎంపీలు, బీజేపీ, జనసేన ఎంపీలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి కూటమి ఎంపీలు ఒక్కొక్కరు తమతమ నియోజకవర్గాలలోని రైల్వే సమస్యలను వివరించారు. మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎంపీల నియోజకవర్గాలలో ఉన్న రైల్వే సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో అడిగి తెలుసుకున్నారు. రైల్వే మంత్రితో లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, పుట్టా మహేశ్, దగ్గుమళ్ల ప్రసాదరావు, తెన్నేటి కృష్ణప్రసాద్, జీఎం హరీష్, నాగరాజు, కేశినేని చిన్ని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బైరెడ్డి శబరి, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ సమావేశంఅయ్యారు.


రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర ఎంపీల బృందం

సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ: కూటమి ఎంపీలు

తమ నియోజకవర్గాలలోని రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారని కూటమి ఎంపీలు చెప్పారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడారు. విజయవాడ- గుడూరు నాలుగో రైల్వే లైన్ నిర్మాణం పట్ల మంత్రి సుముఖంగా ఉన్నారని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. మచిలీపట్నం నుంచి రేపల్లె మీదుగా బాపట్లకు కొత్త రైల్వే లైన్ నిర్మాణం కోసం తాను చేసిన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. బాపట్ల, చీరాలలో వందేభారత్ రైలుకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరినట్లు చెప్పారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో శిబిరిపల్లి- రాజాం రైల్వే లైన్ కోసం తాను చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా మంత్రి స్పందించి సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, నగరిలో ఎల్‌సీ 49 దగ్గర ఉన్న సమస్యలు పరిష్కరించాలని, అండర్‌పాస్‌లు, చిత్తూరులో రైల్వే బ్రిడ్జి నిర్మించాలని కోరినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. కర్నూలు నుంచి అమరావతికి కొత్త రైలు, కర్నూలు-మంత్రాలయం మధ్య రైల్వే లైన్‌ను నిర్మించాలని కోరామని కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు తెలిపారు. రైల్వే కోచ్ మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాప్ సెంటర్‌ను ఏడాదిలో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రైల్వే సమస్యలను అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లానని ఎంపీ పుట్టా మహేష్ తెలిపారు. టీడీపీ ఎంపీ జీ.లక్ష్మీనారాయణ, జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ తదితరులు ప్రతిపాదనలు సమర్పించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు

- 50 శాతం వారికే.. మిగిలిన 50 శాతం ఇతరులకు
- జిల్లా యూనిట్‌గా ఖరారు చేయనున్న కలెక్టర్లు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్వోఆర్) అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని మార్కెట్ కమిటీ చైర్మన్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు నియమితులు కానున్నారు. పలువురు ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు చైర్మన్ పదవులకు రిజర్వేషన్ అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం 2019లో ఇచ్చిన జీవో77 ప్రకారం చైర్మన్ పదవులను రిజర్వుడు వర్గాలకు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. ఈమేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా యూనిట్‌గా చైర్మన్ పదవులను 50% రిజర్వుడు వర్గాలకు కేటాయించనున్నారు. విగతా 50% ఇతరులకు ఇవ్వనున్నారు. మొత్తంగా మహిళలకు 50% పదవులు దక్కనున్నాయి. బీసీ, మైనార్టీలకు 29%, ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% చైర్మన్ పదవులు ఇవ్వనున్నారు.

త్వరలో లిక్కర్ ప్రీమియం స్టోర్లు

- లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.కోటి
- 12 స్టోర్ల ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రీమియం లిక్కర్ బ్రాండ్లు విక్రయించేందుకు 'ప్రీమియం స్టోర్లు' అందుబాటులోకి రానున్నాయి. ఈ స్టోర్ల ఏర్పాటుకు అనుమతిస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి అనుగుణంగా ఒకట్రెండు రోజుల్లో ఎక్సైజ్ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో 12 ప్రీమియం స్టోర్ల ఏర్పాటుకు ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ కార్పొరేషన్లు, ప్రధాన నగరాల్లో మాత్రమే ఉండే వీటికి దరఖాస్తు రుసుము రూ.15 లక్షలుగా ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చు. లైసెన్స్ ఫీజు కింద ఏడాదికి రూ.కోటి చెల్లించాలి. దానిపై ఏటా 10శాతం చొప్పున ఫీజు పెరుగుతుంది. అయితే ఈ స్టోర్లకు ఒకేసారి ఐదేళ్ల కాలానికి లైసెన్సులు జారీ చేస్తారు. కనీసం 4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం చూపించినవారే దరఖాస్తు చేయడానికి అర్హులు. దరఖాస్తులు పరిశీలించి లైసెన్సీలను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమిస్తుంది. సాధారణ మద్యం షాపుల తరహాలోనే ఈ స్టోర్ల పనివేళలు ఉంటాయి. ప్రీమియం స్టోర్లలో లిక్కర్, బీరు, వైన్‌తో పాటు లిక్కర్ చాక్లెట్లు, సిగార్స్, సిగరెట్లు, సాఫ్ట్ డ్రింక్స్ కూడా విక్రయించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫారము - 6ఎ
చట్టం నెం. 30/2013 లోని సెక్షన్ 11(1) మరియు రూలు 19 (1) క్రింద

ప్రాథమిక ప్రకటన

ఆర్.సి.నెం. L9/1023/2024. — తేది : 09-12-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గెజిట్ సంఖ్య : 123/KST/2024, తేది : 09-12-2024

ఈ దిగువ పేర్కొన్న షెడ్యూల్డ్ దాఖలా భూములను కృష్ణాజిల్లా, మచిలీపట్నం నార్త్ మండలము కర్రగ్రహారం గ్రామము నందు ప్రజాహిత కార్యక్రమముల నిమిత్తము, అనగా **గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ మచిలీపట్నం అభివృద్ధిలో** భాగంగా రోడ్డు & రైలు కనెక్టివిటీ నిర్మాణము చేయుట ప్రయోజనం కోసం **య. 32.18** సెంట్లు భూమి అవసరమని కృష్ణాజిల్లా కలెక్టరు వారు భావించి నందున 2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే. హక్కు పారదర్శక చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనల ననుసరించి మరియు సవరణ చట్టం 22/2018 అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందు మూలముగా నోటీసు జారీచేయటమైనది.

భూసేకరణ సవరణ చట్టం 22/2018లోని అధ్యాయం III A సెక్షన్ 10(A) (e) ప్రకారం మరియు G.O.Ms. No. 562 రెవెన్యూ (భూసేకరణ) విభాగం, తేది : 13-11-2018లోని చాప్టర్ III (A) లో రూల్ 10 (a) ప్రకారం సామాజిక ప్రభావ అంచనా అధ్యయనం మినహాయించబడింది మరియు భూసేకరణ కోసం ప్రాజెక్టుకు అవసరమైన కనీస భూమి మాత్రమే ప్రతిపాదించడమైనది. ఈ భూసేకరణ కారణముగా నిర్వాశితులయ్యే కుటుంబాలు ఏమియూ లేవు.

కావున పైన పేర్కొన్న చట్టము సెక్షన్ -12 అనుసారము సంక్రమించిన అధికారములను కృష్ణాజిల్లా కలెక్టరు వారు, రెవిన్యూ డివిజనల్ అధికారి, మచిలీపట్టణం వారు, వారి సిబ్బంది, మరియు వారి పని వారలను, ఈ దిగువ పేర్కొనబడిన భూములు భూసేకరణపై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టములోని సెక్షన్ 11(4)ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుండి జిల్లా కలెక్టరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తీ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకము / కొనుగోలు (క్రయ విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయుటమైనది.

పై చట్టములోని సెక్షన్ 15ననుసరించి భూసేకరణపై ఏవేని అభ్యంతరములు / ఆక్షేపణలువున్న యెడల, సంబంధించిన వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోపు భూసేకరణ అధికారి / రెవెన్యూ డివిజనల్ అధికారి, మచిలీపట్టణం వారి వద్ద భూమి విషయములలో భూమి ఉపయుక్త మరియు ప్రజాహిత ప్రయోజనములపై అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

ప్రాజెక్ట్ పేరు : గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ మచిలీపట్నం అభివృద్ధిలో భాగంగా రోడ్డు & రైలు కనెక్టివిటీ నిర్మాణము చేయుట ప్రయోజనం కోసం

జిల్లా : కృష్ణాజిల్లా — మండలం : మచిలీపట్నం నార్త్ — గ్రామము : కర్రగ్రహారం

క్రమ. సంఖ్య	సర్వే నెం.	పూర్తి విస్తీర్ణం	సేకరించవలసిన ప్రాంతం (ఎకరములలో)	వెబ్‌ల్యాండ్ అడంగల్ రికార్డుప్రకారం: పట్టాదారు పేరు	విస్తీర్ణము	అసైన్మెంట్/రిజిస్టరు రికార్డు (లేదా)ఎఫ్.ఎల్.ఆర్ ప్రకారము: పట్టాదారు పేరు	విస్తీర్ణం	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	నిర్మాణాల సంఖ్య మరియు వృక్షముల వివరములు
1			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		కంచర్ల పాండు	0.5	గోపువానిపాలెం RS.No. 137	7/2ఎ	26/1	7/1బి	-
2			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		పాతాపటి నాంచారయ్య	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
3			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		బందెల వెంకన్న	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
4			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		చిన్నం నరసింహం	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
5			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		చిన్నం సుబ్బారావు	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
6			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		శ్రీరాయకపు జగన్నాథం	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
7			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		నాయుడు వ్యయ్యారు రెడ్డి	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
8	7-2	26.85	0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)	26.85	నాయుడు నాగేశ్వరరావు	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
9			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		ముచ్చు నాగేశ్వరరావు	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
10			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		కొక్కిలిగడ్డ వెంకటుస్వామి	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
11			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		మోక కృష్ణమూర్తి	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
12			0.5	సీలింగు భూమి (అసైన్మెంటు)		కొక్కిలిగడ్డ నరసింహారావు	0.5	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
13			0.05	సీలింగు భూమి (అసైన్మెంటు)		మోక కోటేశ్వరరావు	0.05	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
14	249-2	0.22	0.22	యు.ఎ.డబ్ల్యూ.డి	0.22	సత్తినేది గంగ రాజు	0.22	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
15	249-3	0.79	0.79	యు.ఎ.డబ్ల్యూ.డి	0.79	పీరపల్లి వెంకటేశ్వరరావు & సత్తినేది సుబ్రహ్మణ్యం	0.79	7/2ఎ	7/2ఎ	26/1	7/1బి	-
16	249-4	0.49	0.49	బోలెం వెంకటప్రసాద్	0.49	సత్తినేది పెద్ద రామచంద్ర రావు	0.49	7/2ఎ	7/2బి	26/1	7/1బి	-
17	249-5	0.42	0.42	సత్తినేది గజేంద్రరావు	0.42	సత్తినేది గజేంద్రరావు	0.42					-
18	249-6	0.44	0.44	సత్తినేది చిన్న రామచంద్రరావు	0.44	సత్తినేది చిన్న రామచంద్రరావు	0.44					-
19	249-7	0.05	0.05	ప్రభుత్వ భూమి	0.05	కె సుబ్రహ్మణ్యేశ్వరరావు	0.05					-
20	249-8	0.66	0.66	మారాము. అనంత రామి రెడ్డి (వెబ్లాండ్ నందు అనుభవదారు)	0.66	కె సుబ్రహ్మణ్యేశ్వరరావు	0.66	గోపువాని పాలెం R.S.No.138	RS No 251	RS No 250	RS No 28	-
21	249-9	0.62	0.62	ప్రభుత్వ భూమి	0.62	కె సాంబ శివరావు	0.62					-
22	249-10	1.28	1.28	మాదమల రంగనాయకమ్మ	1.28	మాదమల రంగనాయకమ్మ	1.28					-
23	249-11	1.37	1.37	ప్రభుత్వ భూమి	1.37	కె.నాగమణి & వన్నెంరెడ్డి సీత రత్నం	1.37					-
24	249-12	0.48	0.48	గ్రామకంఠం	0.48	వన్నెంరెడ్డి ప్రహ్లాదరావు	0.48					-
25	249-13	1.19	1.19	ప్రభుత్వ భూమి	1.19	వన్నెంరెడ్డి సీతరత్నం	1.19					-
26	249-14	0.69	0.69	గుమ్మడి బాబుజి	0.69	వన్నెంరెడ్డి వన ప్రహ్లాద రావు	0.69					-
27	251-2	0.95	0.95	గుమ్మడి బాబుజి	0.95	వన్నెంరెడ్డి వన శ్రీప్రహ్లాదరావు	0.95	251/7	251/9	R.S.No 250	251/1	-
28	251-3	0.72	0.72	వన్నెంరెడ్డి కోటేశ్వరరావు	0.72	వన్నెంరెడ్డి కోటేశ్వరరావు	0.72	251/8	251/10, 11,12	R.S.No 250	251/1	-
29	251-4	0.64	0.64	చిడిబొమ్మ వనమలయ్యా	0.64	చిడిబొమ్మ వనమలయ్యా	0.64	251/9	251/18	R.S.No 250	251/1	-
30	251-5	0.64	0.61	చిడిబొమ్మ వనమలయ్యా	0.64	చిడిబొమ్మ వనమలయ్యా	0.64	251/9	251/16 , 17	R.S.No 250	251/1	-
31	251-6	0.82	0.76	ప్రభుత్వ భూమి	0.82	పెనుబోతు నారాయణరావు	0.82	251/9	251/13, 14,15	R.S.No 250	251/1	-
32	251-7	1.34	1.23	పెనుబోతు నారాయణరావు	1.34	పెనుబోతు నారాయణరావు	1.34	251/12	R.S.No 252	R.S.No 250	251/1	-
33	251-8	1.43	1.32	వన్నెంరెడ్డి దశరథరామయ్య	1.43	వన్నెంరెడ్డి దశరథరామయ్య	1.43	251/12	R.S.No 252	R.S.No 250	251/1	-
34	251-9	1.42	1.32	మదమల పూర్ణచంద్రరావు	1.42	మదమల పూర్ణచంద్రరావు	1.42	251/12	R.S.No 252	R.S.No 250	251/1	-
35	251-10	0.42	0.42	ప్రభుత్వ భూమి	0.42	వన్నెంరెడ్డి పూర్ణచంద్రరావు	0.42	251/11	R.S.No 252	R.S.No 250	251/1	-
36	251-11	0.52	0.52	పెనుబోతు వేంకటేశ్వరరావు	0.52	వన్నెంరెడ్డి భాస్కరరావు	0.52	251/11	R.S.No 252	R.S.No 250	251/1	-
37	251-12	0.52	0.4	మదమల రామభాయమ్మ	0.52	వన్నెంరెడ్డి ప్రభాకరరావు	0.52	251/10	R.S.No 252	R.S.No 250	251/1	-
38	251-13	0.17	0.08	గుండు చలపతిరావు	0.17	గుండు చలపతి రావు	0.17	R.S.No 251	252/8	252/3	252/1	-
39	251-14	0.08	0.08	మదమల వేంకటేశ్వరరావు	0.08	గుండు వన ప్రసాదరావు	0.08	R.S.No 251	252/8	252/4	252/2	-
40	251-15	0.09	0.09	మదమల వేంకటేశ్వరరావు	0.09	గుండు వన ప్రసాదరావు	0.09	R.S.No 251	252/8	252/5	252/3	-
41	251-16	0.22	0.22	గుండు రాఘవరావు	0.22	గుండు రాఘవరావు	0.22	R.S.No 251	252/8	252/6	252/4	-
42	251-17	0.22	0.22	ప్రభుత్వ భూమి	0.22	గుండు వేంకటేశ్వరరావు	0.22	R.S.No 251	252/8	252/7	252/5	-
43	251-18	0.42	0.42	గుండు కోటేశ్వరరావు	0.42	గుండు కోటేశ్వరరావు	0.42	R.S.No 251	252/8	R.S.No 253	252/6	-
44	252-2	0.30	0.16	గుండు చలపతిరావు	0.3	గుండు చలపతిరావు	0.3	252/2-7	252/9	R.S.No 253	252/1	-
45	252-3	0.13	0.13	మదమల వేంకటేశ్వరరావు	0.13	గుండు వన ప్రసాదరావు	0.13	252/8	252/10	R.S.No 253	252/1	-
46	252-4	0.13	0.13	మదమల వేంకటేశ్వరరావు	0.13	గుండు వన ప్రసాదరావు	0.13	252/9	252/11	R.S.No 253	252/1	-
47	252-5	0.3	0.3	గుండు రాఘవరావు	0.3	గుండు రాఘవరావు	0.3	252/10	252/12	R.S.No 253	252/1	-
48	252-6	0.28	0.28	గుండు అనసూర్య	0.28	గుండు వేంకటేశ్వరరావు	0.28	252/11	252/13, 14	R.S.No 253	252/1	-
49	252-7	0.55	0.55	గుండు కోటేశ్వరరావు	0.55	గుండు కోటేశ్వరరావు	0.55	R.S.No 250	R.S.No 252	253/3 ,4	R.S.No 252	-
50	252-8	0.8	0.73	ప్రభుత్వ భూమి	0.8	మదమల సత్యనారాయణ	0.8	R.S.No 250	253/3	253/ 12	R.S.No 250	-
51	252-9	0.74	0.69	ప్రభుత్వ భూమి	0.74	మదమల రంగనాయకమ్మ	0.74	R.S.No 253/2	253/4	253/ 12	253/ 1	-
52	252-10	0.72	0.66	మదమల పూర్ణచంద్రరావు	0.72	మదమల పూర్ణచంద్రరావు	0.72	R.S.No. 250	253/ 13	బంగాళా ఖాతము	253/ 3,4	-
53	252-11	0.91	0.74	మదమల వేంకటేశ్వరరావు	0.91	మదమల నాగయ్య	0.91	R.S.No. 253/3	253/5	253/ 12,13	253/1	-
54	252-12	1.16	0.43	మదమల నాంచారయ్య	1.16	మదమల వెంకటేశ్వరరావు	1.16	R.S.No. 253/12	253/ 14	బంగాళా ఖాతము	253/ 4,5	-
55	253-1	0.08	0.08	పెనుబోతు నాగరాజు	0.08	పెనుబోతు గంగయ్య	0.08	R.S.No. 253/4	253/6	253/ 13	R.S.No. 252	-
56	253-2	0.27	0.27	ప్రభుత్వ భూమి	0.27	పెనుబోతు గంగయ్య	0.27	250	253/3	253/ 8	250	-
57	253-3	0.67	0.67	ప్రభుత్వ భూమి	0.67	కొక్కిలిగడ్డ మంగాదేవి	0.67	253/2	253/4	253/ 8	253/1	-
58	253-12	0.31	0.31	ప్రభుత్వ భూమి	0.31	కొక్కిలిగడ్డ మంగాదేవి	0.31	250	253/ 13	బంగాళా ఖాతము	253/8	-
59	253-4	0.67	0.67	మోక విజయలక్ష్మి	0.67	మోక విజయలక్ష్మి	0.67	253/3	253/ 5A	253/ 8	253/1	-
60	253-13	0.32	0.32	మోక విజయలక్ష్మి	0.32	మోక విజయలక్ష్మి	0.32	253-12	253- 14	బంగాళా ఖాతము	253-8	-
61	253-5	0.67	0.31	ప్రభుత్వ భూమి	0.31	సెర్రు విజయలక్ష్మి	0.31	253-4	253- 5B	253-8	253-1	-
	మొత్తం	55.18	32.18									

సం/- డి.కె. బాలాజీ, ఐ.ఎ.ఎస్
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, కృష్ణాజిల్లా

జవాన్ సుబ్బయ్య వీరమరణం

- జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి మృతి
- స్వగ్రామం ప్రకాశం జిల్లా రావిపాడులో విషాదచాయలు



కంభం/నార్పల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి ప్రకాశం జిల్లాకు చెందిన జవాన్ వరికుంట్ల వెంకటసుబ్బయ్య(40) వీరమరణం పొందారు. ఆయన ఆర్మీలోని 25వ రాష్ట్రీయ రైఫిల్స్‌లో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం విధుల్లో ఉండగా చోటుచేసుకొంది. వెంకటసుబ్బయ్య స్వస్థలం ప్రకాశం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామం. 15 ఏళ్ల క్రితం ఆర్మీలో జవాన్‌గా చేరారు. ఆయన అనంతపురం జిల్లా నార్పలకు చెందిన జీమాను రామకృష్ణ కుమార్తె లీలావతిని వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లల చదువుల కోసం ఆరేళ్ల క్రితం కుటుంబాన్ని నార్పలకు మార్చారు. సుబ్బయ్య వీరమరణం చెందాడని తెలియగానే రావిపాడులో విషాదం నెలకొంది. వెంకటసుబ్బయ్య పార్థివదేహానికి నార్పలలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పవన్‌కు బెదిరింపు కాల్ నిందితుడి అరెస్టు

విజయవాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను చంపేస్తామంటూ ఆయన ఓఎస్డీ వెంకటకృష్ణకు ఫోన్ చేసి బెదిరించిన కేసులో నిందితుడిని విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు హోంమంత్రి వంగలపూడి అనితకు కూడా ఫోన్ చేసి బెదిరించాడు. వెంకటకృష్ణ, అనిత నేరుగా డీజీపీకి ఫిర్యాదు చేయడంతో ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన నూక మల్లికార్జునరావును విజయవాడ కృష్ణలంక పోలీసులు సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని రహస్య ప్రదేశంలో ప్రత్యేక బృందాలు విచారిస్తున్నాయి. మల్లికార్జునరావుకు మతిస్థిమితం లేదని గుర్తించినట్టు సమాచారం. మద్యం మత్తులో ఉండి వెంకటకృష్ణకు ఫోన్ చేసినట్టు గుర్తించారు.

సజ్జల అరెస్టుపై మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి కేసులో సజ్జల రామకృష్ణారెడ్డికి అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఈ నెల 24 వరకు హైకోర్టు పొడిగించింది. విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సజ్జల హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి పోలీసులు లుక్అవుట్ సర్క్యులర్ జారీ చేశారంటూ సజ్జల మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది స్పందిస్తూ.. ఘటన జరిగిన రోజు పిటిషనర్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని, ఆధారాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పొడిగించాలని అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించి విచారణను వాయిదా వేశారు.

షరతులతో ఆర్జీవీకి ముందస్తు బెయిల్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో దర్శకుడు రాంగోపాల్‌వర్మకు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అనకాపల్లి జిల్లా రావికమతం, గుంటూరు జిల్లా తుళ్లూరు, ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్ హౌజ్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో)లకు రూ. 10 వేల చొప్పున రెండు స్వీయ పూచీకత్తులు సమర్పించాలని ఆర్జీవీని ఆదేశించింది. పోలీసులు కోరినప్పుడు విచారణకు అందుబాటులో ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం తీర్పు ఇచ్చారు. తీర్పు వెల్లడించిన అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. దర్యాప్తునకు ఆర్జీవీ సహకరించడం లేదని, పోలీసుల నోటీసులకు స్పందించడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ముందస్తు బెయిల్ రద్దు కోసం తగిన చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

నా మొబైల్ పోయింది

- సోషల్ మీడియా అకౌంట్ల పాస్‌వర్డ్ గుర్తులేదు
- రెండోరోజు విచారణలో అవినాశ్ పీఏ రాఘవరెడ్డి

కడప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి వరుసగా రెండోరోజు పోలీసు విచారణకు హాజరయ్యారు. పోలీసులు అడిగిన పలు ప్రశ్నలకు తనకేమీ తెలియదని సమాధానం ఇచ్చారు. మాజీ సీఎం జగన్ తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిలపై రాఘవరెడ్డి ఇచ్చిన కంటెంట్‌తోనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టానని వర్రా రవీంద్రారెడ్డి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించారు. దీంతో రాఘవరెడ్డిపైనా కేసు నమోదు చేశారు. కడప సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో అతడిని రెండు రోజులుగా విచారిస్తున్నారు. వర్రా రవీంద్రరెడ్డి ఎవరో తనకు తెలియదని సోమవారం చెప్పిన రాఘవరెడ్డి.. మంగళవారం నాటి విచారణలో 20రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని తెలిపారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇతర సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డ్ తనకు తెలియదని చెప్పారు. షర్మిలపై మీరు ఇచ్చిన కంటెంట్‌నే పోస్టు చేశానంటూ వర్రా రవీంద్రరెడ్డి స్టేట్‌మెంట్ ఇచ్చారని, అందుకు డబ్బులు కూడా ఇచ్చారట కదా అని పోలీసులు ప్రశ్నించగా... అసలు వర్రా ఎవరో తనకు తలియదని, అతనితో మాట్లాడనే లేదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అయితే షర్మిలపై అసభ్య పోస్టులు పెట్టిన తరువాత ఒక్కో పోస్టుకు రూ.13,500 చొప్పున వర్రాకు బండి చెల్లించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. వాటిపై ప్రశ్నించగా తనకేం తెలియదన్నారని సమాచారం. మంగళవారం దాదాపు 10గంటల పాటు విచారణ సాగింది. రాఘవరెడ్డి వెంట ఆయన తరఫు న్యాయవాది వచ్చారు. పోలీసులు బుధవారం కూడా విచారణకు రావాలని రాఘవరెడ్డికి 41ఏ నోటీసు ఇచ్చారు.

అయ్యో... దేవుడా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటన నెల్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా కలువాయి మండలం బాలాజీరావుపేట దళిత కాలనీకి చెందిన లక్ష్మయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. నెల్లూరు నగరంలో ఓ అపార్ట్‌మెంటులో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తె భవ్యశ్రీ(8)ని కలువాయి మండలం నూకనపల్లిలో ఉంటున్న లక్ష్మి చెల్లెలు వద్ద ఉంచి స్కూలుకు పంపుతున్నారు. కొంతకాలంగా భవ్యశ్రీ తలనొప్పి, వాంతులతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చూపించగా.. భవ్యశ్రీ తలలో ట్యూమర్ ఉందని, శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు భయపడ్డారు. ఆర్థిక స్తోమతలేక శస్త్రచికిత్స ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ క్రమంలో ఆదూరుపల్లిలోని చర్చిలో ప్రార్థనలు చేస్తే జబ్బు నయమవుతుందని కొందరు బంధువులు చెప్పారు. దీంతో వారు భవ్యశ్రీతోపాటు చర్చికి చేరుకుని 40రోజులుగా అక్కడే ఉంటూ ఉపవాస ప్రార్థనలు చేస్తూ వచ్చారు. బిడ్డ పరిస్థితి క్షీణిస్తున్నా దేవుడినే నమ్ముకున్నారు. చివరికి.. చర్చి ఫాదరు కూడా వారిని వారించలేదు. బిడ్డ ఆరోగ్యం కుదుటపడుతుందని చెప్పారు. అదే నమ్మకంతో ఉన్నారు. భవ్యశ్రీ ఆరోగ్యం క్షీణించి చివరకు సోమవారం అర్ధరాత్రి చర్చిలోనే ప్రాణాలు విడిచింది.

సిరియాపై.. ఇజ్రాయెల్ ముప్పేట దాడులు

- కీలక వైమానిక స్థావరాల ధ్వంసం.. ఆయుధాగారాలపైనా ఏరియల్ బాంబింగ్
- బఫర్‌జోన్‌లో భారీగా ట్యాంకులు
- డమాస్కస్‌కు 25 కి.మీ. దూరంలో ఐడీఎఫ్
- ఖతార్, తుర్కియే, ఇరాన్ ఖండన
- సిరియాలో కొలువుదీరిన ఆపద్ధర్మ సర్కారు
- మూణ్నెల్లపాటు అల్-బషీర్ సేవలు
- ఆ తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వం



ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన వాహనాలు

డమాస్కస్/జెరూసలేం, డిసెంబరు 10: కల్లోలిత సిరియాలో తిరుగుబాటుదారులు ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వేళ.. ఇజ్రాయెల్ ముప్పేట దాడులు జరుపుతోంది. గడిచిన 13 ఏళ్లలో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూ.. దేశ పునర్నిర్మాణానికి సిరియా నేతలు పిలుపునిస్తుంటే.. ఇజ్రాయెల్ విధ్వంసానికి పాల్పడుతోంది. సిరియా అధ్యక్షుడు అసద్ ఆదివారం డమాస్కస్ నుంచి పలాయనం చిత్తగించగానే.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) దాడులను మొదలుపెట్టింది. ఈ మూడ్రోజుల్లో కామిష్లీ, షిన్షార్ వైమానిక దళ స్థావరాలతోపాటు.. అక్బరా ఎయిర్‌పోర్టుపై వైమానిక దాడులు జరిపింది. ఆదివారం 300కుపైగా.. సోమవారం 100కు పైగా జరిపిన దాడుల్లో ఎయిర్‌బేస్‌లలోని యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ధ్వంసమయ్యాయి. కీలకమైన మిలటరీ బేస్‌లు, ఆయుధాగారాలు, రాడార్ సెంటర్లు, క్షిపణి క్షేత్రాలను రసాయన ఆయుధాగారాల పేరుతో ధ్వంసం చేసింది. మంగళవారం కూడా డమాస్కస్‌తోపాటు.. శివార్లలోని కునిత్రా, హోమ్స్, హమా, లటాకియా, ఖమిష్లీల్లోనూ ఇజ్రాయెల్ బాంబింగ్ కొనసాగింది. ఈ దాడుల్లో హమాలోని మస్యాల్‌లో ఉన్న శాస్త్రీయ పరిశోధన కేంద్రాలు, జమ్రాయా, బర్జేహ్ ప్రాంతల్లో ఆవాస ప్రాంతాలు ధ్వంసమైనట్లు సిరియా భద్రత బలగాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ ఆదివారం సాయంత్రమే.. గోలాన్‌హైట్స్‌లోని బఫర్‌జోన్‌లోకి చొచ్చుకువెళ్లింది. 400 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న బఫర్‌జోన్‌లో భారీ ఎత్తున యుద్ధ ట్యాంకులను మోహరించింది. ఇజ్రాయెల్ సేనలు డమాస్కస్‌కు 25 కిలోమీటర్ల దూరంలోని ఖతానా పట్టణం వరకు చొచ్చుకుని వెళ్లాయని అల్-జజీరా ఓ కథనాన్ని ప్రసారం చేసింది. ఖతానా నగరం బఫర్‌జోన్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు వివరించింది. రాయిటర్స్ కూడా సిరియా భద్రతాదళాలను ఉటంకిస్తూ.. ఇదే విషయాన్ని ప్రచురించింది. కల్లోల సిరియాపై ఇజ్రాయెల్ బాంబింగ్‌ను ఈజిప్టు, సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే, ఇరాన్ తీవ్రంగా ఖండించాయి. 1974 నాటి ఒప్పందానికి ఇజ్రాయెల్ తూట్లు పొడిచిందంటూ మండిపడ్డాయి. అయితే.. ఇజ్రాయెల్ మాత్రం తమ సేనలు బఫర్‌జోన్‌ను దాటలేదని స్పష్టం చేశాయి. ఇజ్రాయెల్ చర్యలపై ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో సిరియా ప్రతినిధి భద్రతామండలికి ఫిర్యాదు చేయగా.. తాము సిరియా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదని ఇజ్రాయెల్ ప్రతినిధి డానీ డానన్ వివరణ ఇచ్చారు. తమ దేశ భద్రతపైనే ఐడీఎఫ్ దృష్టిసారించిందని పేర్కొన్నారు. మరోవైపు సిరియాలో అమెరికా దాడులపైనా విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. దీనిపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ వివరణ ఇస్తూ.. సిరియాలోని ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) శిబిరాలపైనే దాడులు జరిపినట్లు స్పష్టం చేశారు.

కొలువుదీరిన ఆపద్ధర్మ సర్కారు

తిరుగుబాటు దళాలకు నేతృత్వం వహించిన హయత్ తహ్రీర్ అల్-షామ్(హెచ్‌టీఎస్) ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు సాల్వేషన్ ప్రభుత్వ అధినేతగా సేవలందించిన మహమ్మద్ అల్-బషీర్ నేతృత్వంలో మంగళవారం సిరియా ఆపద్ధర్మ సర్కారు కొలువుదీరింది. ఈ ప్రభుత్వం మూణ్నెల్లపాటు కొనసాగుతుంది. ఆలోగా ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తిస్థాయి సర్కారు ఏర్పాటు దిశగా అల్-బషీర్, ఆయన క్యాబినెట్ మంత్రులు(సాల్వేషన్ ప్రభుత్వంలోని సలహాదారులు) కృషిచేస్తారు. ఈలోగా పారామిలటరీని రద్దు చేసి, భద్రత బలగాల్లో విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ఆపద్ధర్మ సర్కారుకు ప్రస్తుత ప్రధాని జలాలీ సహకరిస్తున్నారు. కాగా.. సిరియాలోని జైళ్లలో తమవారి కోసం పౌరులు గాలింపు చేపడుతున్నారు. నిజానికి 2011లో సిరియా జనాభా 2.1 కోట్లు కాగా.. అసద్ సర్కారు క్రూరత్వానికి 5 లక్షల మందికి పైగా బలయ్యారు. మరో 10 లక్షల మంది దివ్యాంగులుగా మారారు. 1.3 కోట్ల మంది విదేశాల్లో శరణార్థులుగా ఉన్నారు. వారంతా తిరిగి రావాలని ఆపద్ధర్మ ప్రభుత్వం పిలుపునిచ్చింది.



తైవాన్ తీరంలో 90 యుద్ధ నౌకలు!

తైపీ, డిసెంబరు 10: తైవాన్ సమీపంలో చైనా భారీగా యుద్ధ నౌకలను మోహరించింది. గతంలో ఎన్నడూ లేనంత భారీస్థాయిలో వీటిని మోహరించడం గమనార్హం. దాదాపు 90 యుద్ధనౌకలను రంగంలోకి దించింది. చైనా తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడుతూనే ఉంటుంది. నౌకాదళంతో విన్యాసాలు చేస్తుంటుంది. అయితే ఈ సారి పెద్దఎత్తున నౌకలను మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జపాన్ దక్షిణ ఐలాండ్స్ నుంచి దక్షిణ చైనా సముద్రం వరకు చైనా తన యుద్ధనౌకలను మోహరించిందని తైవాన్ రక్షణ శాఖ అధికార ప్రతినిధి సన్‌లీ ఫాంగ్ మంగళవారం తెలిపారు. ఇది 2022లో చేసిన మోహరింపు కంటే చాలా ఎక్కువన్నారు. గతంలో చేసిన విన్యాసాల కంటే అత్యధిక స్థాయిలో యుద్ధనౌకలను మోహరించడాన్ని ముప్పుగానే పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిసారి మొత్తం తైవాన్ తీరాన్నే లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోందన్నారు. తైవాన్ తూర్పు తీరంలో దాదాపు గోడ కట్టినట్లుగా చైనా నౌకలను మోహరించిందని తైవాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. అయితే ఏడు రిజర్వ్‌డ్ జోన్లలో మాత్రం ఎలాంటి ఫైర్ డ్రిల్స్ చేయలేదన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తైవాన్ ఆర్మీ ప్రకటించింది. వ్యూహాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే యుద్ధసన్నద్ధత కార్యకలాపాలు చేపట్టినట్లు తెలిపింది.

అమెరికా పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్

- ట్రంప్ కేబినెట్‌లో మరో ఇండియన్ అమెరికన్‌కు ఉన్నత పదవి



వాషింగ్టన్, డిసెంబరు 10: భారతీయ అమెరికన్ సిక్కు న్యాయవాది హర్మీత్ కె.ధిల్లాన్(54)ను అమెరికా న్యాయశాఖలో పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా నామినేట్ చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ పోస్టుకు హర్మీత్‌ను ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ప్రకటించారు. చండీగఢ్‌కు చెందిన హర్మీత్ చిన్నతనంలోనే ఆమె కుటుంబం అమెరికాకు వలస పోయి నార్త్ కరోలినాలో స్థిరపడింది. డార్ట్‌మౌత్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన ఆమె, యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా లా స్కూల్ నుంచి న్యాయశాస్త్రం అభ్యసించారు.

పుట్టుకతో పౌరసత్వ హక్కును రద్దు చేస్తా

- పాలన పగ్గాలు చేపట్టగానే ఉత్తర్వు: డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్, డిసెంబరు 10: ప్రస్తుతం అమెరికాలో అమల్లో ఉన్న 'పుట్టుకతో పౌరసత్వ హక్కు'ను.. తాను పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే తొలగిస్తానని కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం.. ఆ గడ్డపై పుట్టే ప్రతి ఒక్కరికీ ఆ దేశ పౌరసత్వం వస్తుంది. పర్యాటక/విద్యార్థి/ఉద్యోగ వీసాపై వచ్చేవారి పిల్లలకే కాదు.. ఆ దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారికి పుట్టే పిల్లలకు సైతం పౌరసత్వం ఇవ్వకుండా ఎవరూ అడ్డుకోలేరు. అలా ఇచ్చేయడం హాస్యాస్పదమని.. తాను అధ్యక్ష పదవి చేపట్టగానే దీనికి ముగింపు పలుకుతానని 'ఎన్‌బీసీ న్యూస్' వార్తా సంస్థ నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ట్రంప్ తేల్చిచెప్పారు.

ఖైదీపై క్రూర లాఠీ

- జైలులో ఉండాల్సిన ఖైదీతో ఇంటి పనులు
- సరిగా పని చేయడం లేదంటూ బాదేసిన జైళ్ల ఉన్నతాధికారి
- అడ్డువచ్చిన వార్డర్‌కు కూడా గాయాలు
- రాజమండ్రి సెంట్రల్ జైలు పరిధిలో ఘటన

అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ విషయంలో జైళ్ల ఉన్నతాధికారి ప్రవర్తించిన తీరు ఆ శాఖనే దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఇంటి అవసరాలకు వాడుకుంటున్న ఖైదీని..పనులు సరిగా చేయడం లేదంటూ ఆ అధికారి లాఠీ తీసుకుని గొడ్డును బాదినట్టు బాదేశారు. అడ్డొచ్చిన వార్డర్‌ను కూడా కొట్టారు. బాధిత ఖైదీ రాజమండ్రి ఓపెన్ ఎయిర్ జైలులో ఉంటున్నాడు. సాధారణంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను మాత్రమే ఓపెన్ జైలులో ఉంచుతారు. వ్యవసాయ పనులు మాత్రమే వారితో చేయిస్తారు. అలాంటి ఖైదీతో ఇంటి పనులు చేయించడమే పెద్ద తప్పు. పైగా.. పనులు సక్రమంగా చేయలేదని క్రూరంగా కొట్టడం ఇంకా పెద్ద నేరం. బీడీ తాగుతుంటే దండించినట్టు ఆయన వివరణ ఇచ్చినట్టు సమాచారం. అయితే, ఈ అధికారి గత చరిత్ర తెలిసిన జైళ్లశాఖలోని పలువురు... ఆయన వాదన నమ్మశక్యంగా లేదని అంటున్నారు.


ఆయనను బదిలీ చేస్తే స్వీట్లు పంచుకున్న సిబ్బంది..

గత వైసీపీ ప్రభుత్వంలో ఓ రాయలసీమ మంత్రికి సదరు అధికారి సమీప బంధువు. దీంతో ఆయనను కడప జైలు సూపరింటెండెంట్‌గా నియమించారు. అప్పట్లో వివేకానంద రెడ్డి హత్యకేసు నిందితులు అక్కడ ఉండటంతో ఆయనను అక్కడకు పంపించారు. అయితే ఈ అధికారి అరాచకాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో జగన్ సర్కారే ఈయనను భరించలేకపోయింది. దీంతో రాజమండ్రి జైలుకు బదిలీ చేసింది. ఆయన బదిలీ ఘటనను కడప జైలు సిబ్బంది వేడుకలా జరుపుకొన్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఖైదీల నుంచి జైలు ఉద్యోగుల వరకు ఎంతగా ఈయన టార్చర్ చేసేవారనేందుకు ఈ ఘటనే నిదర్శనం. వారి దృష్టిలో ఈయన ఓ 'రాక్షస కిరణం'గా ముద్రపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేసిన అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అప్పట్లో రాజమండ్రి జైలులోనే ఉన్నారు. చంద్రబాబు ఏడు వారాలకు పైగా ఆ జైలులో ఉన్నారు. ఈ సమయంలో ములాఖత్‌ల విషయంలో ఆ అధికారి చాలా ఇబ్బందిపెట్టారు. గతంలో నెల్లూరు జైలు సూపరింటెండెంట్‌గానూ ఆయన పనిచేశారు. ఆ సమయంలో ఒక ఖైదీ విషయంలో క్రూరంగా ప్రవర్తించారనే ఆరోపణలను ఈయన ఎదుర్కొంటున్నారు. ఇంటి పనులు సరిగా చేయడం లేదంటూ లాకప్‌లోకి లాక్కొచ్చి ఆయన దుస్తులు విప్పేసి కర్ర చొప్పించినట్లు విమర్శలు ఎదుర్కొంటున్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సైతం ఈ ఘటనపై అప్పట్లో ఫిర్యాదులు అందాయి.

పన్నుల యుద్ధంలో విజేతలు ఉండరు



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్య



బీజింగ్, టొరాంటో, డిసెంబరు 10: వాణిజ్య యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అన్నారు. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై ఏకంగా 60% మేర, కెనడా వస్తువులపై 25% మేర పన్నులను పెంచుతామని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో జిన్‌పింగ్ చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరిచుకొంది. చైనా తమ మేధోపర సంపదను దొంగిలిస్తోందని, అక్రమ వాణిజ్య విధానాలకు పాల్పడుతోందని ఎప్పటి నుంచో విమర్శలు చేస్తున్న ట్రంప్ దానికి ప్రతిగా పన్నులు పెంచాలని భావిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం బీజింగ్‌లో జరిగిన ఆర్థిక సంస్థల అధిపతుల సమావేశంలో ప్రసంగించిన జిన్‌పింగ్ స్పందించారు. "పన్నుల పోరులు, వాణిజ్య పోరాటాలు, సాంకేతిక పరిజ్ఞాన యుద్ధాలన్నవి చారిత్రక పరిణామాలు, ఆర్థిక సూత్రాలకు విరుద్ధంగా జరుగుతాయి. వీటిలో విజేతలు ఎవరూ ఉండరు" అని వ్యాఖ్యానించారు. అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని, సహకారాన్ని పెంచుకుంటామని తెలిపారు. మరోవైపు అక్రమ వలసలు, మాదకద్రవ్యాలను అరికట్టకపోతే కెనడా, మెక్సికోలపై పన్నులు పెంచుతామని కూడా ట్రంప్ హెచ్చరించారు. వాటికి ఆర్థిక సాయం చేసే బదులు అమెరికాలో రాష్ట్రాలుగా చేర్చుకుంటే మంచిదని అన్నారు. దీనిపై కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రూడో స్పందించారు. సోమవారం హలిఫాక్స్ వాణిజ్య మండలి సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ పాలనలో వాణిజ్యం సవాళ్లతో కూడుకొని ఉంటుందని చెప్పారు. జీవనం సులభతరం చేస్తామన్న హామీతో ట్రంప్ అధికారంలోకి వచ్చారని, కానీ కెనడా వస్తువులపై పన్నులు పెంచితే దాని ప్రభావం అమెరికా దక్షిణ సరిహద్దులోని ప్రజలపై ఉంటుందని తెలిపారు. అక్కడి వారు కెనడా నుంచి వస్తువులను ఉపయోగిస్తారని, పన్నులు పెంచితే ఆ భారాన్ని వారు మోయాల్సి ఉంటుందని చెప్పారు.

కెనడా గవర్నర్ ట్రూడో

- ప్రధాని ట్రూడోను ఉద్దేశించి ట్రంప్ సంబోధన

న్యూఢిల్లీ, డిసెంబరు 10: అక్రమ వలసలు, డ్రగ్స్ రవాణాపై తానెంత సీరియస్‌గా ఉన్నానో చెబుతూ అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు సుతిమెత్తగా హెచ్చరిస్తూ మరోసారి అదే పంచ్ వేసిరారు! ట్రూడోను ఉద్దేశించి కెనడా గవర్నర్ అని సంబోధించారు! కెనడా నుంచి వలసలు, డ్రగ్స్ రవాణాను అరికట్టకపోతే ఆ దేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తానంటూ ఇటీవల ట్రంప్ హెచ్చరిక చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ హెచ్చరిక ఆచరణ రూపం దాల్చితే కెనడా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర పరిణామం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో కెనడా ప్రధాని ట్రూడో హుటాహుటిన అమెరికా వెళ్లి ట్రంప్‌తో సమావేశమయ్యారు. డిన్నర్ సందర్భంగా వలసలు, డ్రగ్స్ రవాణాను అరికట్టడంలో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాల్సి ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ నుంచి ఊహించని వ్యాఖ్యతో షాకైన ట్రూడో, ఆయన బృంద సభ్యులు ఏడ్వలేక నవ్వారు! అయితే తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెడుతూ ట్రూడోకు మరోసారి షాక్ ఇచ్చారు! "ఆ రోజు గొప్ప రాష్ట్రమైన కెనడాకు చెందిన గవర్నర్ ట్రూడోతో కలిసి డిన్నర్ చేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆ గవర్నర్‌తో మరోసారి సమావేశమయ్యేందుకు ఎదురుచూస్తున్నాను. కెనడా నుంచి అక్రమ వలసలు, డ్రగ్స్ రవాణాపై సుదీర్ఘంగా చర్చించాలనుకుంటున్నాను' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

గుడిసె కాదు.. యుద్ధ ట్యాంకు!

ఉక్రెయిన్ దాడుల నుంచి తన యుద్ధ ట్యాంకుల రక్షణకు తిప్పలు పడుతున్న రష్యా

- ప్లై వుడ్ షీట్లు, డ్రోన్ జామర్లతో కాపాడుకునే ప్రయత్నం
- 'టర్టిల్ ట్యాంకుల'ని ఎగతాళి చేస్తున్న ఉక్రెయిన్ సేనలు



న్యూఢిల్లీ, డిసెంబరు 10: రెండున్నరేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తూ....నే ఉన్న రష్యాకు కొత్త కష్టం వచ్చిపడింది! ఆ దేశం వాడుతున్న టీ-90 యుద్ధ ట్యాంకులను.. ట్యాంకు విధ్వంసక క్షిపణులతో ఉక్రెయిన్ తునాతునకలు చేస్తుండడంతో వాటిని కాపాడుకోవడానికి రకరకాల అమరికలతో నానా తంటలూ పడుతోంది. తన ట్యాంకులకు ప్లైవుడ్ షీట్లు, రూఫ్ ప్యానెలింగ్ రేకులతో, ఇనప చువ్వలతో రక్షణ కవచాన్ని కడుతోంది. దాంతో అవి ట్యాంకుల్లా కాకుండా కదిలే ఇళ్లలాగా కనిపిస్తున్నాయి. కవచంలో ఉన్న తాబేలులా కనిపిస్తున్న ఆ ట్యాంకులను.. ఉక్రెయిన్ సైనికులు 'టర్టిల్ ట్యాంకులు' అని పిలుస్తూ ఎగతాళి చేస్తున్నారు. యుద్ధరంగంలో రష్యా మూడు రకాల యుద్ధ ట్యాంకుల్ని వాడుతోంది. అవి.. టీ-72, టీ-80, టీ-90 ట్యాంకులు. శత్రుసైనికులపై నిరంతరాయంగా కాల్పులు జరపడానికి వీలుగా.. ఈ ట్యాంకుల్లో 'ఆటోలోడర్' సదుపాయం ఉంటుంది. అంటే.. ఒకసారి కాల్పులు జరిపాక, వాటిలో అమ్యూనిషన్ (మందుగుండు) పెట్టడానికి మనుషులు అక్కర్లేదు. ఒక షెల్ ఫైర్ అయిన తర్వాత.. దాని స్థానంలో మరో షెల్ లోడ్ అవుతుంది. రెండోది కూడా పేలాక.. మూడోది లోడ్ అవుతుంది. ఆ సదుపాయమే రష్యా యుద్ధ ట్యాంకులకు పెనుముప్పుగా మారింది. ఎందుకంటే.. మామూలు యుద్ధ ట్యాంకుపైకి.. క్షిపణులను ప్రయోగిస్తే అవి దెబ్బతిన్నా, వాటిని బాగుచేసి మళ్లీ వాడుకునే అవకాశం చాలా సందర్భాల్లో ఉంటుంది. కానీ, ఆటోలోడర్ ట్యాంకుల్లో అమ్యూనిషన్ మొత్తాన్నీ టర్రెట్‌లోనే ఉంచడం వల్ల.. క్షిపణులు లేదా డ్రోన్లతో ఆ ట్యాంకులను పేల్చినప్పుడు.. టర్రెట్ లోపల ఉన్న షెల్స్ అన్నీ పేలిపోతాయి. ఆ వరుస పేలుళ్ల దెబ్బకు ట్యాంకు ముక్కలైపోతుంది. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపే.. ట్యాంకులో ఉన్న సైనికులు మాడిమసైపోతారు. రష్యా ట్యాంకుల్లో ఉన్న ఈ లొసుగు గురించి తెలుసుకున్న ఉక్రెయిన్.. జావెలిన్, ఎన్‌లా, స్టుగ్నా వంటి ట్యాంకు విధ్వంసక క్షిపణులతో, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. దీంతో, రష్యా తన ట్యాంకులను రక్షించుకోవడానికి ఇలా రకరకాల ఏర్పాట్లు చేస్తోంది. అయితే, వీటివల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. యుద్ధట్యాంకులకు ఉండే పలు ప్రయోజనాలు.. ఈ కొత్త అమరికల వల్ల రష్యా టీ-90లకు లేకుండా పోతున్నాయి. టర్రెట్ చుట్టూ అమర్చిన రక్షణ కవచం వల్ల ఆ ట్యాంకుల తాలూకా గన్ కదలికలు ఒక వైపునకు మాత్రమే పరిమితమైపోయాయి. వేరే వైపు కాల్పులు జరపాలంటే.. ట్యాంకు మొత్తం ఆ వైపునకు తిరగాల్సిందే. అలాగే, ఈ అమరికల వల్ల.. ట్యాంకులోపల ఉండే సైనికులు కేవలం తమ ముందు ఏముందో మాత్రమే చూడగలుగుతారు. ట్యాంకుల్ని ఇలా తయారుచేయడం వల్ల సైనికుల్లో స్థైర్యం దెబ్బతింటుంది.

భారత్ ముందు జాగ్రత్త..

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా వాడుతున్న టీ-90 ట్యాంకులు, దానికి ముందుతరంవైన టీ-72 యుద్ధట్యాంకులు భారతదేశం వద్ద కూడా ఉన్నాయి. మన వద్ద 2400కు పైగా టీ72 యుద్ధట్యాంకులు, దాదాపు 1600 టీ-90 యుద్ధట్యాంకులు ఉన్నాయి. అయితే, ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఈ ట్యాంకులకు పడుతున్న గతి నేపథ్యంలో.. మన సైన్యం అప్రమత్తమైంది. 2030 నాటికి 1770 "ఫ్యూచర్ రెడీ కంబాట్ వెహికల్స్‌ను (ఎఫ్ఆర్‌సీవీలు)" టీ-72ల స్థానంల నియోగించడానికి ఆర్మీ పెట్టిన ప్రతిపాదనలను రక్షణ శాఖ ఆమోదించింది. ఈ మెగా ప్రాజెక్టు విలువ దాదాపు రూ.60 వేల కోట్లు. ఎఫ్ఆర్‌వీసీల్లో డ్రోన్లు, యాంటీ ట్యాంక్ మిసైళ్ల దాడుల నుంచి రక్షణ కల్పించే 360 డిగ్రీల 'యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్', కృత్రిమ మేధ వంటి అధునాతన ఫీచర్లు ఉండనున్నట్టు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.